www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 255 | మంగళవారం | 6 మార్చి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



ది షేప్ ఆఫ్ వాటర్‌కు 4 ఆస్కార్‌లు

8లో

అవార్డుల ప్రదాన సభలో శ్రీదేవి, శశి కపూర్‌ల మృతిపట్ల సంతాపం





12 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఈనెల 12 నుండి శాసనసభ బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ ఆదేశాల మేరకు నోటిఫికేషన్ జారీ అయింది. తొలి రోజున ఉదయం 10 గంటలకు ఉభయసభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి గవర్నర్ ప్రసంగంతో తరువాయి 6లో

రాజ్యసభకు 12 వరకు నామినేషన్లు 3

మంతనాలు..మేధామథనాలు

ఫ్రంట్ ఎజెండాపై వివిధ పార్టీల ప్రముఖులతో, నిపుణులతో సిఎం కెసిఆర్ వరుస భేటీలు

- ఎన్‌సిపి, తృణమూల్ కాంగ్రెస్ తదితర రాజకీయ పక్షాల నేతలతో, కమల్ హాసన్‌తో సాగిన సంభాషణ
- దక్షిణ భారత పత్రికల సంపాదకులతో సంప్రదింపులు
- ప్రస్తుత రాజకీయ వ్యవస్థ లోపాలపై పాత్రికేయ ప్రముఖులతో త్వరలో భేటీ
- హైదరాబాద్‌తో ప్రారంభించి ఢిల్లీ, కోల్‌కతా, ముంబయి, చెన్నై, బెంగళూరు తదితర నగరాల్లోనూ సమావేశాల నిర్వహణకు వ్యూహం
- సమన్వయకర్తల నియామకం



మన తెలంగాణ / హైదరాబాద్ : దేశ రాజకీయాల్లో పరివర్తన, ప్రబల మార్పు తీసుకురావడానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా వివిధ ప్రాంతీయ పార్టీల నేతలతో సిఎం కెసిఆర్ సంప్రదింపులు మొదలుపెట్టారు. ఎన్‌సిపి, బిజూ జనతాదళ్, తృణమూల్ కాంగ్రెస్ తదితర పార్టీలకు చెందిన నేతలతో పాటు తమిళనాట కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన కమల్ హాసన్‌తోనూ సోమవారం మాట్లాడినట్లు తెలిసింది. పార్లమెంటు సమావేశాల సందర్భంగా వివిధ పార్టీల ఎంపిల ద్వారా ఆయా పార్టీల నేతలతో సంభాషించినట్లు సమాచారం. దక్షిణ భారతదేశం నుంచి వెలువడే పలు పత్రికల సంపాదకులు, సంపాదక సలహాదారులను కూడా కెసిఆర్ సంప్రదించినట్లు తెలిసింది. దీర్ఘకాలం పాటు పాత్రికేయ రంగంలో ఉంటూ ఇప్పటివరకూ చూసిన రాజకీయ వ్యవస్థలోని లోపాలు, వాటిని అధిగమించడానికి ఉన్న అవకాశాలు తదితరాలపై త్వరలో ఒక సమావేశాన్ని నిర్వహించాలనుకుంటున్నట్లు తెలిసింది. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఎక్కువ సమయం జాతీయ రాజకీయాలకు కేటాయించి ఇతర రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. వివిధ రంగాల నిపుణులతో, ప్రసార మాధ్యమాల సీనియర్ సంపాదకులతో, వివిధ జాతీయ, ప్రాంతీయ పత్రికల సంపాదకులతో కూడా వరుస భేటీలు ఉంటాయని, కేంద్ర సివిల్ సర్వీసుకు చెందిన సీనియర్‌లతో పాటు పదవీ విరమణ చేసినవారితోనూ, రక్షణ రంగంలోని త్రివిధ దళాలకు చెందిన తరువాయి 6లో

సిఎంకు కొత్త బస్సు

- బుల్లెట్ ప్రూఫ్ వాహనం నిర్మాణంపై కమిటీ

మన తెలంగాణ / హైదరాబాద్ : ముఖ్యమంత్రి కెసిఆర్ పర్యటనల నిమిత్తం కొత్తగా ఒక బుల్లెట్ ప్రూఫ్ బస్సును సమకూర్చుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. అన్ని సౌకర్యాలతో కూడిన ఈ బస్సు తయారీపై రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ సోమవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మెంబర్ కన్వీనర్‌గా తరువాయి 6లో



వరంగల్ ఐటి మేటి

డిసెంబర్ నాటికి మరి మూడు కంపెనీలు : మంత్రి కెటిఆర్

మన తెలంగాణ/ వరంగల్ : ఐటి, సాంకేతిక రంగాలలో బెంగళూరుకు మైసూర్ సిటీ గుండెకాయలాగ ఉన్నట్లు హైదరాబాద్‌కు వరంగల్ సిటీ కూడా రానున్న రోజుల్లో అభివృద్ధి చెందబోతుందని రాష్ట్ర ఐటి, పురపాలకశాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు చెప్పారు. వరంగల్ పట్టణానికి వచ్చే డిసెంబర్ నాటికి మరో మూడు ఐటి కంపెనీలు రాబోతున్నాయని తెలిపారు. సోమవారం వరంగల్ అర్బన్ జిల్లా హసన్‌పర్తి మండలంలోని అనంతసాగర్‌లోని ఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐటి ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఉపముఖ్యమంత్రితో కలసి కెటిఆర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇన్నోవేషన్ అంటే ఆర్టిఫీషియల్‌గా ఆలోచించడం కాదని, ఇన్నోవేషన్‌లో సోషల్ అండ్ రూరల్ ఇన్ఫర్‌మేషన్ ఉందన్నారు. టెక్నాలజీ అంటే అమెరికానో వేరే తరువాయి 6లో

రాష్ట్రాల పరిధిలో కోటా

లోక్‌సభలో టిఆర్‌ఎస్ సభ్యుల డిమాండ్, ఆందోళన

- రిజర్వేషన్ల అంశంపై చర్చకు పట్టుబడుతూ వెల్‌లోకి
- వాయిదా తీర్మానాన్ని తిరస్కరించిన స్పీకర్
- జనాభా ప్రాతిపదికన కోటా కోసం ఆర్టికల్ 16 (4)ను సవరించాలని డిమాండ్
- నేడు కొనసాగనున్న ఆందోళన
- వేర్వేరు అంశాలపై ఇతర పార్టీలు గొంతు విప్పడంతో సభ నేటికి వాయిదా



మన తెలంగాణ/ న్యూఢిల్లీ: దేశంలో రిజర్వేషన్లు కేటాయించే హక్కు రాష్ట్రాలకే ఉండాలని డిమాండ్ చేస్తూ టిఆర్‌ఎస్ ఎంపిలు సోమవారం లోక్‌సభలో వాయిదా తీర్మానం ఇచ్చారు. ఈ అంశంపై సభలో చర్చించాలని పట్టుబట్టారు. అయితే వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించడంతో టిఆర్‌ఎస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన నిర్వహించారు. నెల రోజుల విరామం తర్వాత సోమవారం నుంచి పార్లమెంట్ సమావేశాలు తిరిగి ప్రారంభం అయ్యాయి. సభ ప్రారంభం కాగానే ఇటీవల మృతి చెందిన ఎంపిలకు లోక్‌సభ నివాళులర్పించింది. అనంతరం లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రశ్నోత్తరాలు చేపట్టారు. ప్రశ్నోత్తరాల సమయంలో టిఆర్‌ఎస్ సభ్యులు రిజర్వేషన్లపై చర్చించాలని పట్టుబడుతూ ఆందోళనకు దిగడంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 వరకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తరువాత కూడా ఇదే అంశంపై టిఆర్‌ఎస్ ఎంపిలు తరువాయి 6లో

ప్రత్యేక ప్యాకేజీ కోసం టిడిపి ఆందోళన

పార్లమెంట్ ఉభయ సభలను కుదిపివేసిన పిఎన్‌బి కుంభకోణం 10

కుంచెపోటు



మా వల్లే కలిశారు వీళ్లు.. మావి విభజన రాజకీయాలు కావని ఇప్పటికైనా తెల్సిందా..?

నిఘా, కూంబింగ్

మావోయిస్టుల హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దులపై పోలీసుల దృష్టి

మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు అటవీ ప్రాంతంలో ఇటీవల జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో పది మంది మావోయిస్టులు మృతి చెందడంతో తెలంగాణ పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఒకవైపు నిఘాను ముమ్మరం చేస్తూనే మరోవైపు మావోయిస్టు కదలికలను వీలైనంత వరకు అరికట్టడానికి కూంబింగ్‌పై దృష్టి సారించింది. ప్రజా ప్రతినిధులు గ్రామాల పర్యటనలకు వెళ్ళేటప్పుడు స్థానిక పోలీసులకు సమాచారమివ్వాలని, వీలైనంత వరకు అటవీ ప్రాంతాల్లో కదలికలను పరిమితం చేసుకోవాలని రాష్ట్ర పోలీసు యంత్రాంగం సూచనలు చేసింది. ఎన్‌కౌంటర్ అనంతరం టిఆర్‌ఎస్ పార్టీ నేతలను టార్గెట్ చేస్తామని మావోయిస్టు పార్టీ అగ్రనేత జగన్ ఒక ప్రకటనలో హెచ్చరించడంతో రాష్ట్ర పోలీసులు అప్రమత్తమై అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు జాగ్రత్తలు పాటించాలని, పర్యటనలకు వెళ్ళే సమయంలో స్థానిక పోలీసులకు విధిగా సమాచారం ఇవ్వాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మావోయిస్టు పార్టీ ఈ తరహా హెచ్చరికలు చేయడం ఇదే తొలిసారి. తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని గ్రామాలతో పాటు ఆనుకుని ఉన్న జిల్లా కేంద్రాలు, మండలాలపై కూడా రాష్ట్ర పోలీసులు దృష్టి సారించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం వంటి చర్యలకు కూడా మావోయిస్టులు పాల్పడే అవకాశాలు లేకపోలేదని భావించిన పోలీసు ఉన్నతాధికారులు ఆ ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పోలీసు అధికారులను టార్గెట్ చేసే అవకాశాలు లేకపోలేదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొత్తగా రాష్ట్రంలో 31 జిల్లాలు తరువాయి 6లో



బస్సుకు మావోయిస్టుల నిప్పు 2

రాబడి పన్నుపై రాబందులు

- ఉద్యోగులను మోసం చేసిన 447 కంపెనీలు
- రూ.3200 కోట్ల టిడిఎస్ స్కాం

9

ఎన్నికలు వస్తున్నందునే కెసిఆర్ ప్రజల కష్టాలపై మాట్లాడుతున్నారు 6

- ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్య

వ్యవసాయ బడ్జెట్‌కు లీగల్ చిక్కులు 3

కలెక్టర్లకు అసైన్డ్ భూముల అప్పగింత అధికారం 3

రుణాలతో స్వయం ఉపాధి పొందండి



మన తెలంగాణ/హైదరాబాద్: స్వయం ఉపాధి పథకాలకు బ్యాంకులు ఇస్తున్న 'ముద్రా' రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి సూచించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ సోమవారం నిర్వహించిన మెగా రుణ మేళాలో పాల్గొన్న సిఎస్ లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలను అందజేశారు. నాంపల్లి తెలుగు యూనివర్శిటీ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిఎస్ మాట్లాడుతూ పంజాబ్ నేషనల్ బ్యాంక్ తెలంగాణ రీజియన్‌లో రూ.166 కోట్ల రుణాలను స్వయం ఉపాధికోసం 'ముద్ర' పథకం కింద అందజేస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు డబ్బును తమ డబ్బుగా భావించి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. గతంలో చాలా తక్కువ మొత్తంలో రుణాలు మంజూరయ్యేదని, దాని వల్ల లబ్ధిదారులకు ఉపయోగం ఉండేదికాదని, ఇప్పుడు బ్యాంకులు యువతకు ఉపాధిని కల్పించే ఉద్దేశంతో ఎక్కువ మొత్తంలో రుణాలు అందిస్తున్నాయన్నారు. పశుసంవర్ధక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ బ్యాంకుల నుండి రుణాలు పొందిన వారు సకాలంలో చెల్లించి బ్యాంకులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి సహకరించాలని అన్నారు. యువత వ్యాపారం ప్రారంభించడానికి గాను మూలధనం రూపంలో బ్యాంకులు ఇస్తున్నాయన్నారు.

సిఎం కెసిఆర్‌కు అజిత్ జోగి మద్దతు

ఛత్తీస్‌గఢ్: దేశంలో బిజెపి , కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా మూడో ఫ్రంట్ అవసరమని, అవసరమైతే తాను జాతీయ రాజకీయాల్లోకి వచ్చి మూడో ఫ్రంట్ ఏర్పాటు చేస్తానని తెలంగాణ సిఎం , టిఆర్‌ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ చేసిన వ్యాఖ్యలకు దేశం నలుమూలల నుంచి మద్దతు లభిస్తోంది. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్ జనతా కాంగ్రెస్ నేత అజిత్ జోగి సోమవారం కెసిఆర్‌కు ఫోన్ చేశారు. కెసిఆర్ ఏర్పాటు చేసే మూడో ఫ్రంట్‌లో తాను భాగస్వామిని అవుతానని ఆయన కెసిఆర్‌తో చెప్పారు. తెలంగాణ ఉద్యమాన్ని విజయవంతంగా నడిపి ప్రత్యేక రాష్ట్రం సాధించిన కెసిఆర్ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అజిత్ జోగి ఆకాంక్షించారు.

నత్త నడకన కలెక్టరేట్‌ల నిర్మాణం

ప్రతి నెలా ప్రగతి నివేదికలివ్వాలని ప్రభుత్వం ఆదేశం

ఇంకా పునాది దశలోనే నూతన భవనాలు



మన తెలంగాణ/ హైదరాబాద్ : కొత్త జిల్లాలో నిర్మిస్తున్న సమగ్ర జిల్లా కలెక్టర్ కార్యాలయ భవన సముదాయాల పనులు నిదానంగా సాగుతుండడంతో ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రతి నెలా నిర్మాణానికి సంబంధించిన ప్రగతి నివేదికలను పంపించాలని రోడ్డు భవనాల శాఖ అధికారులతో పాటు ఇంజనీర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మొత్తం 26 జిల్లాల్లో నూతన కలెక్టరేట్ భవనాలను నిర్మించాల్సి ఉన్నా కొన్ని జిల్లాల్లో ఇంకా స్థల సేకరణ కూడా పూర్తికాకపోవడంపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంకెంతమాత్రం పనులు నత్తనడకన నడవరాదని, ప్రతి నెలా క్రమం తప్పకుండా ప్రగతి నివేదికలను పంపాల్సిందేనని, వాటిపై సమీక్ష జరుగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. కొత్త జిల్లాల్లో నూతన కలెక్టరేట్ భవన సముదాయాల నిర్మాణం బాధ్యతలను ప్రభుత్వం రోడ్డు భవనాల శాఖకు అప్పగించింది. భూ సేకరణ బాధ్యతలను ఆయా జిల్లాల కలెక్టర్లకు అప్పజెప్పింది. 26 జిల్లాల్లో నిర్మించాల్సిన నూతన కలెక్టరేట్ భవనాల్లో 22 జిల్లాల్లో భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యి ఆరు నెలలైంది. మిగిలిన నాలుగు జిల్లాల్లో ఇటీవలే కొలిక్కి వచ్చింది. ఒక వైపు ఆర్ అండ్ బి శాఖ, మరో వైపు ప్రభుత్వం ఎప్పటికప్పుడు కలెక్టరేట్ భవ న సముదాయాల నిర్మాణ ప్రగతిపై సమీక్షలు నిర్వహిస్తూనే ఉన్నాయి. అయినా అవి పునాదుల దశ దాటి ముందుకు వెళ్లలేకపోతున్నాయి. నాలుగు జిల్లాల్లో కలెక్టరేట్‌ల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సేకరించడంలో జిల్లా అధికారులు విఫలం కావడంతో రెండు నెలల క్రితమే ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. స్థలాన్ని సేకరించి కలెక్టరేట్ కార్యాలయాల నిర్మాణాన్ని తక్షణమే ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం నుండి ఒత్తిడి పెరగడంతో నూతన కలెక్టరేట్లను నిర్మిస్తున్న 26 జిల్లాల్లో కలెక్టర్లు స్పందించి ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. ప్రభుత్వ ఆమోదం తర్వాత ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భవనాలు ఏ స్టేజ్‌లో ఉన్నాయో తెలుపుతూ ప్రభుత్వానికి ఆర్ అండ్ బి శాఖ తాజాగా ఓ నివేదికను అందజేసింది. ఇలాంటి నివేదికలు ఇకపైనా నెల నెలా అందించాలని ఆదేశించింది.

పనుల సాగుతున్న తీరిది : ఆసిఫాబాద్ జిల్లాలో రూ.32.57 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న కలెక్టరేట్ సముదాయం నాలుగు బ్లాకుల్లో రెండు పాక్షికంగా పూర్తికాగా మరో రెండు పునాది దశలోనే ఉన్నాయి. శివారు ప్రాంతమైన జానకాపూర్ వద్ద 29.80 ఎకరాల్లో ఈ భవనం నిర్మితమవుతోంది. నిర్మల్ జిల్లాలో 25 ఎకరాల భూమిని డిసెంబర్ 20న ప్రభుత్వానికి ఆర్అండ్‌బిశాఖ అప్పగించింది. మంచిర్యాల జిల్లా సైట్ ప్రభుత్వం క్లియరెన్స్ ఇవ్వడంతో అక్కడ నిర్మాణ పనులు ప్రారంభం కావాల్సి ఉంది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, పెద్దపల్లి జిల్లాల్లో బేస్‌మెట్ స్థాయిలో భవన నిర్మాణాలు సాగుతున్నాయి. ఈ జిల్లాల్లో ఒక్కో కలెక్టరేట్ భవనం రూ.31.20లక్షల వ్యయంతో నిర్మితమవుతోంది. సిరిసిల్ల, జగిత్యాల,జనగామ జిల్లా కలెక్టరేట్ల పనులు పునాది దశలోనే ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా కొంగర కలాన్‌లో నిర్మిస్తున్న కలెక్టరేట్ కాంప్లెక్స్ పనులు ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ కాంప్లెక్స్ భవనాన్ని బూత్‌పూర్ రోడ్డులో 22 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణమవుతోంది. ఇతర జిల్లాల్లోనూ పనులు నిదానంగా సాగుతున్నాయి.

ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే

అమరావతి: ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని ఆర్థిక మంత్రి యనమల కేంద్రాన్ని డిమాండ్ చేశారు. 2017 తరువాత మిగతా రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కొనసాగించరని ఆయన పేర్కొన్నారు.ప్రత్యేక ప్యాకేజీకి తాము ఒప్పుకున్నట్లు ఆయన చెప్పారు. ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకు గతంలో మాదిరిగానే నిధులు ఇస్తున్నారని ఆయన చెప్పారు. ఎపికి రావాల్సిన నిధులు పూర్తిస్థాయిలో రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా ఎపికి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయాలని ఆయన కేంద్రాన్ని కోరారు. యనమల సోమవారం ఢిల్లీకి బయల్దేరారు. సోమవారం సాయంత్రం అరుణ్‌జైట్లీ, బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాలతో భేటీ అవుతారు. ఈ భేటీలో పలు అంశాలపై చర్చించనున్నారు.

అనాథ పిల్లల మధ్య సిఎం జన్మదిన వేడుకలు

భోపాల్: మధ్యప్రదేశ్ సిఎం శివరాజ్ సింగ్ చౌహాన్ సోమవారం తన జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. సోమవారం నాటితో ఆయన 59వ పడిలోకి అడుగుపెట్టారు. భోపాల్‌లోని అనాథ ఆశ్రమంలో ఆయన తన పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు.



బస్సుకు నిప్పపెట్టిన మావోయిస్టులు

- ప్రయాణికులు క్షేమం
- ఎన్‌కౌంటర్‌కు ప్రతీకార చర్యేనంటున్న పోలీసులు
- తొలిసారి జరిగిన ఘటన

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ– ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో శుక్రవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్ అనంతరం మావోయిస్టులు ప్రతీకార చర్యలకు పూనుకున్నారు. ఛత్తీస్‌గడ్‌లోని డోర్నపాల్ జిల్లా కుత్తి వద్ద హైదరాబాద్ నుంచి జగదల్‌పూర్‌కు వెళ్తు న్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆర్‌టిసి బస్సును సోమవారం రాత్రి మావోయిస్టులు దగ్ధం చేశారు. ప్రయాణికులను బస్సు నుంచి కింది దింపేసిన తరువాత బస్సుపై పెట్రోల్ చల్లి నిప్పంటించినట్లు ప్రయాణిస్తున్నవారు ఆ రాష్ట్ర పోలీసులకు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వానికి వ్యతిరేకంగా,టిఆర్‌ఎస్‌కి వ్యతిరేకంగా మావోయిస్టులు నినాదాలు చేశారని వివరించారు. బస్సు దాదాపు పూర్తిగా దగ్ధమయ్యే వరకు మావోయిస్టులు అక్కడే ఉన్నారని పేర్కొన్నారు. ప్రయాణీకులంతా నడుచుకుంటూ వెళ్ళి సమీపంలో ఉన్న సిఆర్‌పిఎఫ్ పోలీసు క్యాంప్‌లో తలదాచుకున్నారు. రాత్రి సమయం కావడంతో ఘటనా స్థలానికి ఇంకా పోలీసులు చేరుకోలేదు. మంగళవారం ఉదయం పూర్తి వివరాలు తెలుస్తాయని తెలంగాణకు చెందిన ఓ పోలీసు అధికారి తెలిపారు. మూడు రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 10 మావోయిస్టులు మృతి చెందడం, టిఆర్‌ఎస్ పార్టీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని మావోయిస్టు అగ్రనేత జగన్ తీవ్ర స్థాయిలో హెచ్చరిస్తూ పత్రికా ప్రకటన చేయడం, రాష్ట్ర పోలీసులు భద్రతా చర్యలపై దృష్టి సారిస్తున్న సమయంలో తెలంగాణ ఆర్‌టిసి బస్సును మావోయిస్టులు దగ్ధం చేయడం చర్చనీయాంశమైంది. ఊహించినట్లుగానే మావోయిస్టులు ప్రతీకార చర్యలను మొదలుపెట్టారనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మావోయిస్టుల చేతుల్లో బస్సు దగ్ధం కావడం ఇదే తొలిసారి.

వర్క్ పర్మిట్ల ముప్పు తప్పదా?

- హెచ్1బి వీసాల ఆధారితులలో ఆందోళన



వాషింగ్టన్ : అమెరికాలో విదేశీ ఉద్యోగులు, ప్రత్యేకించి భారతీయ ఉద్యోగుల హెచ్ 1 బి వీసాల సంక్షోభం కొనసాగుతోంది. నైపుణ్యపు విదేశీ ఉద్యోగుల జీవితభాగస్వాముల వర్క్‌పర్మిట్ల రద్దు అంశాన్ని ప్రస్తుతానికి వాయిదా వేసుకుంటున్నట్లు ట్రంప్ అధికార యంత్రాంగం తెలిపింది. అయితే ఈ పాలసీ మార్పులో జాప్యం కేవలం దాటవేతగా ఉంటుందని, అయితే అనుకున్న విధంగా హెచ్1 బి వీసా ఉద్యోగుల ఆధారితులకు ఉద్యోగ అనుమతికి గండి పడుతుందని ఐటి పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఈ వర్క్ పర్మిట్ల రద్దు ప్రక్రియ ఇప్పటికీ నిలిచిపోయి ఉండొచ్చునని కానీ భవిష్యత్తులో దీనిని అమలు చేస్తారని ఈ వర్గాలు తెలిపాయి. వర్క్ పర్మిట్ల జీవిత భాగస్వాముల వర్క్ పర్మిట్ల రద్దు ప్రతిపాదనను టెక్ ఇండస్ట్రీ వ్యతిరేకించింది. మరో వైపు సేవ్ జాబ్స్ యుఎస్‌ఎ వారు వర్క్ పర్మిట్లను వ్యతిరేకిస్తూ కోర్టుకు వెళ్లారు. ఈ దశలో గత నెల 28న న్యాయస్థానంలో వాదనలు జరిగాయి . ఈ సందర్భంగా అంతర్గత భద్రతా వ్యవహారాల శాఖ డిహెచ్‌టి తమ వాదనలో ప్రస్తుతానికి పూర్తి స్థాయిలో ఆర్థిక వ్యవహారాల విశ్లేషణ జరుగుతోందని, అప్పటివరకూ ఈ వర్క్ పర్మిట్ల రద్దు నిర్ణయం ఏదీ ఉండదని తెలిపింది. అయితే అసలు వర్క్ పర్మిట్ల జారీని చట్టసభల ఆమోదం లేకుండా ఏ విధంగా జారీ చేస్తారని సేవ్ జాబ్స్ వారు వాదిస్తున్నారు. బరాక్ ఒబామా సమయంలో తీసుకువచ్చిన హెచ్1 బి వీసాల జీవితభాగస్వాముల వర్క్‌పర్మిట్ల నిబంధనను రద్దు చేయాలని డిహెచ్‌ఎస్ యోచిస్తోంది. అమెరికా ఫస్ట్ నినాదంతో ఉన్న ట్రంప్ ఆలోచనలకు అనుగుణంగా దేశీయ అంతర్గత భద్రతా విభాగం ఈ నిర్ణయం ఖచ్చితంగా అమలు చేస్తుందని టెక్ కంపెనీలు భావిస్తున్నాయి. ఈ నిర్ణయం వల్ల నిపుణులైన విదేశీ ఉద్యోగులు అమెరికా కంపెనీలలో చేరేందుకు ప్రతిబంధకాలు ఏర్పడుతాయని, వారి జీవిత భాగస్వాములకు ఆటంకం ఏర్పడుతుందని , వారికి ఇప్పుడు దక్కుతున్న హెచ్ 4 వీసాలకు గండిపడుతుందని ఆందోళన చెందుతున్నాయి. అమెజాన్, ఫేస్‌బుక్, గుగూల్ వంటివి సభ్యులుగా ఉన్న ఐటి పరిశ్రమ మండలి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆండీ హాలాటెయి స్పందిస్తూ వర్క్ పర్మిట్లరద్దు తప్పదనే అభిప్రాయపడ్డారు. ప్రస్తుతానికి అమెరికా అధికార యంత్రాంగం వారి ఆర్థిక రంగ విశ్లేషణ వాదనలను రూపొందించుకొంటోందని , మొత్తం మీద వారి ఆలోచనలకు అనుగుణంగానే ఈ విశ్లేషణలు ఉండవచ్చునని తెలిపారు.

ప్రతీ వార్డుకు ఒక బ్యాలెట్ బాక్స్

- లక్ష దాటనున్న వార్డుల సంఖ్య



మన తెలంగాణ/హైదరాబాద్ : ఈసారి జరగబోయే పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో ప్రతీ వార్డుకు ఒక బ్యాలెట్ బాక్స్ ఏర్పాటు కానుంది. సర్పంచి, వార్డు మెంబర్ ఎన్నికకు వేర్వేరు రంగుల బ్యాలెట్ పత్రాలు ఉంటున్నప్పటికీ వాటిని ఒకే బాక్సులో వేయాలి. కౌంటింగ్ సమయంలో సిబ్బంది వీటిని వేరు చేసి లెక్కిస్తారు. ఇంతకు ముందు జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్యను బట్టి రెండేసి వార్డులను కలిపి ఒక పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసి ఒక బ్యాలెట్ బాక్స్‌ను ఏర్పాటు చేసే సంప్రదాయం ఉండేది. అయితే ఈసారి మాత్రం వార్డుల్ని కలపకుండా విడి విడిగా ఒక్కో వార్డుకు ఒక్కో పోలింగ్ స్టేషన్‌ను ఎంపికచేసి బ్యాలట్‌బాక్సును కేటాయించేలా రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ఈ రకంగా చూస్తే ఈసారి బ్యాలట్ బాక్సుల సంఖ్య పెరగనుంది. పొరుగు రాష్ట్రాల నుంచి బాక్సులను సమకూర్చుకుంటున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారి ఒకరు వివరించారు. ఇంతకాలం పంచాయతీలు, వాటిలోని వార్డుల ఆధారంగా బ్యాలెట్ బాక్స్‌లను సమకూర్చుకుంటూ ఉండేది. బ్యాలట్ బాక్సుల కొరత కారణంగా రెండు, మూడు వార్డులకు కలిపి ఒకే పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేసేది. కానీ ఇకనుంచి జరిగే పంచాయతీ ఎన్నికల్లో మాత్రం ఈ పాత సంప్రదాయానికి బదులుగా ఏ వార్డు కావార్డులోనే ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన ప్రకారం ఈ సంవత్సరం కొన్ని కొత్త పంచాయతీలు ఉనికిలోకి రానున్నాయి. సుమారు నాలుగువేల పంచాయతీలు పెరుగుతున్నందున కనీసంగా ఇరవై వేల వార్డులు చేరనున్నాయి. దీంతో మొత్తం వార్డుల సంఖ్య దాదాపు లక్ష దాటుతుందని ఎన్నికల సంఘం అంచనా వేస్తోంది. ఈ మేరకు బ్యాలెట్ బాక్స్‌లను సమకూర్చుకునే పని ఇప్పటికే ప్రారంభమైంది. తమిళనాడు, కర్ణాటకల నుంచి బ్యాలట్ బాక్సులను తెప్పించుకుంటోంది. జూలై 31తో ప్రస్తుత పంచాయతీల పాలక వర్గాల కాలపరిమితి ముగుస్తున్నందున సకాలంలో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేందుకు వీలుగా ఎన్నికల సంఘం పనుల్ని వేగంగా చేస్తోంది. మొత్తం పంచాయతీల సంఖ్య 12,641 కావచ్చని పంచాయతీరాజ్ శాఖ అధికారులు అంచనావేశారు.

మావోయిస్టుల మృతదేహాలు అప్పగింత





- స్వగ్రామాలకు తీసుకెళ్లిన బంధువులు
- తరలింపు వ్యవహారాన్ని పర్యవేక్షించి ఎఎస్‌పి

మన తెలంగాణ/భద్రాచలం: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచిన తొమ్మిది మంది మావోయిస్టుల మృతదేహాలను పోలీసులు సోమవారం సాయంత్రానికి బంధువులకు అప్పగించారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలోని పూజారా కాంకేర్ అటవీ ప్రాంతంలో చోటు చేసుకున్న ఎదురుకాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి హైకోర్టు ఆదేశాల మేరకు ఫ్రిజర్లలో భద్రపరిచారు. గురువారం ఉదయం 6 గం. ప్రాంతంలో ఆ అటవీప్రాంతంలో చోటు చేసుకున్న ఎన్ కౌంటర్లో మొత్తం పది మంది మావోయిస్టులు మృతి చెందిన సంగతి పాఠకులకు విధితమే. కాగా గురువారం నుండి సోమవారం సాయంత్రం వరకు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీ వద్ద ప్రత్యేక పోలీస్ బలగాలను పెట్టి బందోబస్తు నిర్వహించారు. బంధువులు మృతదేహాలను పూర్తి ప్రభుత్వ ఖర్చులతో ప్రత్యేక అంబులెన్స్‌ల ద్వారా తరలించారు. నాలుగు రోజుల పాటు ఫ్రిజర్ బాక్సుల్లో మృతదేహాలు ఉన్నప్పటికీ ఆసుపత్రి ప్రాంగణం అంతా దుర్గంధం వెదజల్లడంతో రోగులతో పాటు ఇతరులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బంధువుల గుర్తింపు, మృతదేహాల తరలింపు వ్యవహారాన్ని ఎఎస్‌పి సునీల్ దత్త దగ్గరుండి పర్యవేక్షించారు. పట్టణ సిఐ సత్యనారాయణ రెడ్డితోపాటు పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బంధువులకు అప్పగించాం



ఎన్‌కౌంటర్లో మృతి చెందిన మావోయిస్టులు మృతదేహాలను వారి వారి బంధువులకు అప్పగించామని ఎఎస్‌పి సునీల్ దత్ మన తెలంగాణకు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ ప్రాంతం నుండి మృతదేహాల కోసం గిరిజనులు రావడంతో పూర్తిగా నిర్ధారించుకున్న తర్వాత ప్రత్యేక అంబులెన్స్‌ల్లో వాటిని తరలించినట్లు తెలిపారు.

ప్రధాని ఆధార్ వివరాలివ్వలేం

న్యూఢిల్లీ: వ్యక్తిగత సమాచారం కిందకు రావడంలో ప్రధాని ఆధార్, ఓటర్ గుర్తింపు కార్డుల వివరాలు ఇవ్వలేమన్న ప్రధాన మంత్రి కార్యాలయం (పిఎంఒ) నిర్ణయాన్ని కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) సమర్థించింది. సమాచార హక్కు చట్టం కార్యకర్త సోని ఎస్ ఎరామథ్ ప్రధాని నరేంద్ర మోదీ ఆధార్, ఓటరు గుర్తింపు కార్డుల వివరాలు ఇవ్వాలని పీఎంవోను సమాచార హక్కు చట్టం కింద కోరారు. ప్రధాని ప్రమాణ స్వీకారానికి సంబంధించిన వివరాలనూ ఆయన అడిగారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగంలోని అధికరణలకు అనుగుణంగానే ప్రమాణ స్వీకారం చేశారని పీఎంవో ప్రజా సమాచార అధికారి తెలిపారని సీఐసీ వెల్లడించింది. సమాచార హక్కు చట్టం 2005 సెక్షన్ 8(1)(జే) ప్రకారం మినహాయింపులు ఉన్నందున ప్రధాని ఆధార్, గుర్తింపు కార్డుల సమాచారం ఇవ్వలేమన్న పీఎంవో నిర్ణయాన్ని తాము సమర్థిస్తున్నట్టు ప్రధాన సమాచార కమిషనర్ ఆర్కే మాథుర్ తెలిపారు. ప్రజోపయోగం కానప్పుడు, ఈ సమాచారం వ్యక్తిగత గోప్యత కిందకు వస్తుంది కాబట్టి పైన తెలిపిన సెక్షన్ ప్రకారం సమాచారం ఇవ్వకున్నా ఫర్వాలేదు. తామిచ్చిన వివరణలతో సమాచార హక్కు చట్టం కార్యకర్త సంతృప్తి చెందారని ఇకపై ఇందులో కమిషన్ జోక్యం అవసరం లేదన్నారు.



విభజన చట్టంలోని అంశాలపై సుప్రీంలో పొంగులేటి పిటిషన్

మనతెలంగాణ/న్యూఢిల్లీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలు ఇచ్చినపుడు వాటిని అమలు చేసే బాధ్యత ఆ ప్రభుత్వాలదే కదా అని పిటిషనర్ ను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఎపి విభజనచట్టంలోని షెడ్యూలు 10, 11, 12,13లలో పొందుపరిచిన వాటితోపాటు పలు అంశాలు అమలు కావడం లేదని తెలంగాణ శాసన మండలి లో కాంగ్రెస్ డిప్యూటీ లీడర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ పై సోమవారం జస్టిస్ సిక్రీ, జస్టిస్ అశోక్ భూషణ్ లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటీషనర్ తరఫున న్యాయవాది శ్రావణ్ కుమార్ వాదనలు వినిపించారు. విభజన చట్టంలోని హామీలు అమలు కావడం లేదని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా సుప్రీం ధర్మాసనం జోక్యం చేసుకొంటూ.... విభజన చట్టంపై ఇప్పటికే 20పైగా కేసులో సుప్రీంకోర్టులో పెండింగ్ లో ఉన్నాయి కదా అని ప్రశ్నించింది. ఈ కేసులన్ని విభజన చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలు అయినవని, కాని తన పిటిషనర్ చట్టంలోని హామీలు అమలు చేయడం లేదు కాబట్టి కోర్టుకు వచ్చామని పిటిషనర్ తరఫు న్యాయవాది శ్రావణ్ స్పష్టం చేశారు. ఈ కేసులో ప్రతివాదులైన కేంద్ర హోం శాఖ, ఆర్థిక, జలవనరులు, మానవ వనరుల అభివృద్ధి శాఖలతో పాటు, ఎపి, తెలంగాణ ప్రభుత్వాలకు పిటీషన్ కాపీలు పంపాలని సుప్రీం ఆదేశించింది. ఈ కేసు విచారణను రెండు వారాలపాటు వాయిదా వేసింది.

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ



మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశం పొం దిన ప్రతిభ గల ఎస్‌సి గురుకుల విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. ఎస్‌సి గురుకుల విద్యా సంస్థల సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత ల్యాప్‌టాప్ పంపిణీ నిర్వహించినట్లు సొసైటీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తెలిపారు. ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాలు ఢిల్లీ విశ్వవిద్యాలయం, నేషనల్ లా యూనివర్శిటీలు, ఇతర ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందిన 17 మంది ఎస్‌సి గురుకుల విద్యార్థులకు సోమవారం ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. ఈ ఒక్క ఏడాదిలోనే 40 మంది గురుకుల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను ఉచితంగా పంపిణీ చేసినటుల ప్రవీణ్ కుమార్ తెలిపారు. సాంఘీక సంక్షేమ గురుకుల విద్యార్థులుకు ఉచిత ల్యాప్‌టాప్ పంపిణీ పథకాన్ని చేపట్టిన తెలంగాణ ప్రభుత్వానికి స్వర్ణలత ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. మహేంద్ర హిల్స్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి అయిన స్వర్ణ లత ప్రస్తుతం గుజరాత్‌లోని నేషనల్ లా యూనివర్శిటీలో లా కోర్సు అభ్యసిస్తున్నారు. ఎస్‌సి విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశం పట్ల కెసిఆర్, మంత్రి జగదీష్‌రెడ్డిలకు డా.ప్రవీణ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

బిటి పత్తి విత్తన ప్యాకెట్ ధర రూ. 725!

మన తెలంగాణ/హైదరాబాద్ : బిటి పత్తి విత్తన ప్యాకెట్ ధర రూ. 725 మించరాదని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. మోన్‌శాంటోకు రాయల్టీ ఉండకూడదని నొక్కి చెప్పింది. ఢిల్లీలో బిటి పత్తి విత్తన ధరపై కేంద్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఈ సమావేశంలో విత్తన, సేంద్రియ ధ్రువీకరణ సంస్థ సంచాలకులు డాక్టర్ కె. కేశవులు పాల్గొన్నారు. గత ఏడాది రూ. 800 బిటి పత్తి విత్తన ప్యాకెట్ ధర ఉండగా దానికి రాయల్టీ రూ. 49 కలిపి మొత్తంగా రూ. 849 నిర్ణయించడంతో రైతులకు ఆర్థిక భారంగా మారిందన్నారు.ఈసారి రాయల్టీ లేకుండా రూ. 725కే పత్తి విత్తన ప్యాకెట్ ఇవ్వాలని, ఒకవేళ రాయల్టీ కలిపితే మోన్‌శాంటో కంపెనీ కూడా రైతుకు వచ్చే నష్టానికి బాధ్యత వహించి పరిహారం ఇచ్చేలా చూడాలన్నారు. బిజి–1, బిజి–2 పత్తి విత్తన ధరల్లో తేడా ఉండరాదని కేశవులు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్ర అధికారులకు చెప్పారు.ఆశ్రయ పంట విత్తనం నాణ్యతలో తేడా ఉండకూడదని కూడా ఆయన కోరారు.

కెటిఆర్‌ను సిఎం చేసేందుకే థర్డ్ ఫ్రంట్

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రధాని మోడిపై తాను ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని ముఖ్యమంత్రి కెసిఆర్ పదేపదే చెబుతున్న నేపథ్యంలో ఇక ఈ అంశాన్ని ఆయన విజ్ఞతకే వదిలేయాలని బిజెపి రాష్ట్ర కోర్ కమిటీ నిర్ణయించింది. కెసిఆర్ తన కుమారుడు మంత్రి కెటిఆర్‌ను ముఖ్యమంత్రిగా చేసేందుకే జాతీయ స్థాయిలో థర్డ్‌ఫ్రంట్ అనే కొత్త నాటకానికి తెర లేపారని కోర్ కమిటీ తెలిపింది. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ అధ్యక్షతన కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలోని తాజా పరిణామాలు, సిఎం కెసిఆర్ చేసిన వ్యాఖ్యలు, బిజెపి చేపట్టిన నిరసన కార్యక్రమాలపై చర్చ జరిగింది. ఎన్నికల సమయంలో టిఆర్‌ఎస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, దీంతో ప్రజలు టిఆర్‌ఎస్ పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఈ సమావేశం అభిప్రాయపడింది. ప్రజలను గందరగోళంలోకి నెట్టేందుకే సిఎం కెసిఆర్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని కోర్ కమిటీ తెలిపింది. రాష్ట్రంలో నిరుద్యోగం, దళితులు మూడెకరాల భూమి, డబుల్‌బెడ్‌రూమ్, మద్యం, ఎస్‌సి, ఎస్‌టి, బిసి,మైనార్టీ సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా బిజెపి అలుపెరగని పోరాటాలను కొనసాగించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

రైతు ఆత్మహత్యలు ఆపలేక కేంద్రంపై నెపం : రమణ



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు ఆపలేక నెపాన్ని కేంద్రంపై నెట్టాలని సిఎం కె. చంద్రశేఖర్‌రావు చూస్తున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రమణ విమర్శించారు. ఎకరాకు రూ. 4 వేలు పెట్టుబడి ప్రకటించినా రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు ఆగడం లేదన్నారు. ఈ నెల 4వ తేదీన ఒక్క రోజునే వివిధ జిల్లాల్లో ఏడుగురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ఎన్‌టిఆర్ భవన్‌లో సోమవారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో రమణ సమావేశమయ్యా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు చేసిందేమి లేదని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు చెప్పారు. త్వరలోనే 119 నియోజకవర్గ పార్టీ ఇంఛార్జీలను నియమించుకుంటామన్నారు. పార్టీ ఇచ్చిన బాధ్యతలను నాయకులు నిర్వహిస్తున్న తీరుపై చర్చించేందుకు త్వరలోనే కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.

ఉస్మాన్‌సాగర్ సుందరీకరణకు రూ. 100కోట్లు

మన తెలంగాణ/హైదరాబాద్: ఉస్మాన్‌సాగర్ (గండిపేట) సుందరీకరణ నిమిత్తం రూ. 100 కోట్ల నిధులకు ప్రభుత్వం పరిపాలన అనుమతులను మంజూరు చేసింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి అరవిందకుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. హెచ్‌ఎండిఎ నుంచే ఈ నిధుల ఖర్చు చేయనున్నారు. పర్యాటక రంగం, రెవెన్యూ, నీటిపారుదల శాఖ, జలమండలి, టిఎస్‌ఎస్‌పిడిసిఎల్, అటవీశాఖలతో కూడిన టాస్క్ ఫోర్స్ కమిటీ గండిపేట సుందరీకరణకు ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించనుంది. గండిపేట పరిసర ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచడంతో పాటు అందంగా తీర్చిదిద్దనున్నారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ఫుడ్ కోర్ట్, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్, ఫుడ్‌కోర్టులు తదితరాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులను కార్యదర్శి అరవింద్‌కుమార్ ఆదేశించారు.

13న తెలంగాణ బంద్‌కు మద్దతు

మన తెలంగాణ/హైదరాబాద్: ఎస్‌సి వర్గీకరణ బిల్లును ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే ఆమోదించాలని కోరుతూ ఈనెల 13న ఎంఆర్‌పిఎస్ చేపట్టనున్న తెలంగాణ బంద్‌కు సిపిఐ (ఎం–ఎల్) న్యూ డెమోక్రసి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. వర్గీకరణ కోసం తెలుగు రాష్ట్రాలలో గత 24 సంవత్సరాలుగా ఆందోళనలు కొనసాగుతున్నాయని, ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు కె.గోవర్ధన్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జాతీయ రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తానని చెబుతున్న కెసిఆర్ ఎస్‌సి వర్గీకరణ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు.

వ్యవసాయ బడ్జెట్‌కు న్యాయ చిక్కులు

- సాధారణ బడ్జెట్‌లోనే పాధాన్యత
- మహిళ బడ్జెట్ కూడా ఉండకపోవచ్చు!

మన తెలంగాణ/ హైదరాబాద్ : వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ పెట్టాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకుంది. రాజ్యాంగపరమైన చిక్కులతో పాటు శాసనసభ నియమావళిలోని నిబంధనలు ప్రత్యేక బడ్జెట్ పెట్టడానికి అనుకూలించకపోవడమే కారణమని ప్రభుత్వం పేర్కొనింది. వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్న ముఖ్యమంత్రి కెసిఆర్ గతేడాది జూలై 2వ తేదీన ప్రగతి భవన్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రానున్న ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయం కోసం ప్రత్యేక బడ్జెట్‌ను పెడుతున్నట్లు పేర్కొన్నారు. గత నెల మూడవ వారంలో జరిగిన సమావేశంలో సైతం వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ పెడుతున్నందువల్ల ముసాయిదాను తయారుచేయాల్సిందిగా ఆర్థికశాఖ అధికారులను ఆదేశించారు. సాధారణ బడ్జెట్‌తో పాటు వ్యవసాయ బడ్జెట్ కూడా ఉంటుందని భావించినప్పటికీ సోమవారం ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో మాత్రం ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్ ఆలోచనను విరమించుకున్నట్లు స్పష్టం చేసింది. రాజ్యాంగ నిబంధనలు, అసెంబ్లీ నియమావళి ప్రకారం శాఖలవారీగా ప్రత్యేక బడ్జెట్ పెట్టడానికి అవకాశం లేదని పేర్కొనింది. మంత్రులు హరీష్‌రావు, పోచారం శ్రీనివాసరెడ్డి, ఈటల రాజందర్, మహేందర్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, చీఫ్ విప్‌లు సుధాకర్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, ఆర్థిక సలహాదారు జిఆర్ రెడ్డి, ముఖ్య కార్యదర్శులు నర్సింగ్ రావు, రామకృష్ణారావు, పార్థసారథి, వ్యవసాయ శాఖ కమిషనర్, అసెంబ్లీ కార్యదర్శి తదితరులతో ప్రగతిభవన్‌లో సోమవారంసమీక్ష నిర్వహించిన సందర్భంగా ఈ నిర్ణయం జరిగినట్లు ప్రభుత్వం ఆ ప్రకటనలో స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తొలి నుంచీ వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఈసారి బడ్జెట్‌లో వ్యవసాయదారుల కోసం మరిన్ని కార్యక్రమాలు, పథకాల కోసం నిధులను కేటాయించనున్నట్లుముఖ్యమంత్రి పేర్కొన్నారని ప్రకటన స్పష్టం చేసింది. ప్రభుత్వానికి ఒకే బడ్జెట్ ఉండాలని, శాఖలవారీగా ప్రత్యేక బడ్జెట్లను ప్రవేశపెట్టడానికి రాజ్యాంగ నిబంధనలు అంగీకరించవని అధికారులు ఈ సమావేశంలో స్పష్టత ఇచ్చారు. శాసనసభ నియమావళిలోని 150వ నిబంధన ప్రకారం ఆదాయ, వ్యయాలు మాత్రమ బడ్జెట్ పరిధిలోకి వస్తాయని, ఇతర ప్రణాళికలు, వివరణలన్నీ పద్దుల కిందకే వస్తాయని స్పష్టత ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వంసైతం రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్‌లోనే కలిపి ప్రవేశపెడుతున్నట్లు సిఎంకు అధికారులు వివరించారు. ఈ కారణంగానే వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ పెట్టాలన్న ఆలోచనను విరమించుకున్నట్లు సిఎం స్పష్టం చేశారని ప్రకటన పేర్కొనింది. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఒకసారి వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు వివాదాస్పదమైందని అధికారులు గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో సాధారణ బడ్జెట్‌లోనే వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను, ప్రవేశపెడుతున్న పథకాలను,వాటికి చేస్తున్న కేటాయింపులను వివరించాలని అధికారులకు సిఎం సూచించారు. ఈసారి 'మహిళా బడ్జెట్ (జెండర్ బడ్జెట్)ను కూడా ప్రవేశపెట్టే ఆలోచన ఉన్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో అది కూడా ఉండకపోవచ్చని స్పష్టమైంది.





కెసిఆర్‌కు విచారణలు ఎదుర్కొనక తప్పదు

మన తెలంగాణ/హైదరాబాద్:తనపై ఉన్న సిబిఐ కేసుల నుంచి బయట పడేందుకే సిఎం కెసిఆర్ మూడోకూటమి ప్రయత్నాలు చేస్తున్నారని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. సిఎం కెసిఆర్ చేసిన తప్పులపై రాబోయే రోజుల్లో విచారణలు ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. గాంధీభవన్ సోమవారం ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనపై ఉన్న మూడు సిబిఐ కేసులపై సిఎం కెసిఆర్ ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి ఎన్నికలు, జిఎస్‌టి బిల్లు, నోట్ల రద్దు వంటి అంశాలపై బిజెపికి బేషరతుగా మద్దతిచ్చారని, దీని వెనుక అసలు సిబిఐ కేసులేనని చెప్పారు. రాష్ట్రంలో ఫాసిస్ట్ ప్రభుత్వాన్ని నడుపుతున్న కెసిఆర్ దేశవ్యాప్తంగా రాజకీయాల్లో మార్పు గురించి మాట్లాడటం సిగ్గుచేటు అని అన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలంటూ అంబేద్కర్ ను కించపరిచేలా కెసిఆర్ మాట్లాడారని ఆరోపించారు.

కాంగ్రెస్‌ది తుస్సు యాత్ర

- ఎంఎల్ఎ శ్రీనివాస్‌గౌడ్

మన తెలంగాణ/ హైదరాబాద్: దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు తెస్తానంటున్న సిఎం కెసిఆర్ ప్రకటనను తెలంగాణలోని అందరూ పార్టీల కతీతంగా స్వాగతించాలని టిఆర్‌ఎస్ ఎంఎల్ఎ వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ వ్యక్తి శక్తిగా మారబోతున్నారని పేర్కొన్నారు. టిఆర్‌ఎస్ ఎల్‌పి కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ది బస్సు యాత్ర కాదని, తుస్సు యాత్ర అని అన్నారు. రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఒక ఎంఎల్ఏతో రాజీనామా చేయించాలని, అలా చేస్తే ఉప ఎన్నికల్లో తామే గెలుస్తామని అన్నారు. ఎక్కడో గెలిస్తే బిజెపి నేతలు ఇక్కడ సంబరాలు చేసుకుంటున్నారని, వారు వాపు ను చూసి బలుపు అనుకుంటున్నారన్నారు.

అసైన్డ్ భూముల అప్పగింతపై కలెక్టర్‌కే అధికారం

మన తెలంగాణ/హైదరాబాద్: అసైన్డ్ భూములను భూమిలేని నిరుపేదలకే తిరిగి అప్పగించడంపై ఇప్పటికే స్పష్టమైన నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల అర్హతలను ఖరారు చేయడంపై జిల్లాల కలెక్టర్లకే పూర్తి అధికారాలను కట్టబెట్టింది. రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ ఈ మేరకు సోమవారం సర్క్యులర్ మెమొ (నెం. 4233) జారీ చేశారు. భూ పరిపాలన ఛీఫ్ కమిషనర్ కార్యాలయం గతేడాది డిసెంబరులో రాసిన లేఖను పరిగణనలోకి తీసుకున్న రెవిన్యూ శాఖ ఇందుకోసం గతేడాది డిసెంబరు 31వ తేదీని కటాఫ్ తేదీని నిర్ణయించింది. ప్రస్తుతం అసైన్డ్ భూమిని అనుభవిస్తున్నవారు, వ్యవసాయంతో పాటు నివాసానికి ఇంటిని నిర్మించుకున్నవారిని అధ్యయనం చేసి భూమిలేని నిరుపేదలుగా నిర్ధారించినట్లయితే వారికే తిరిగి అసైన్ చేస్తూ జిల్లా కలెక్టర్ నిర్ణయం తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో తివారీ స్పష్టం చేశారు. భూములను అసైన్ చేయడానికి మళ్ళీ 'అసైన్‌మెంట్ రివ్యూ కమిటీ'కి అప్పగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. గతంలో ప్రభుత్వం భూమిలేని నిరుపేదలకు అసైన్డ్ భూములను కేటాయించినా చాలా చోట్ల ఇతరులు కొనుగోలు చేశారు. దీంతో వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2007లో ప్రత్యేక ఉత్తర్వులను జారీ చేసి 2007 జనవరి 29 వరకు అసైన్డ్ భూములను కొనుకున్నవారు భూమిలేని నిరుపేదలకే వారికే అప్పగించవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కటాఫ్ తేదీని జూన్ 2, 2014కు సవరిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఆ కటాఫ్ తేదీని ఇటీవల డిసెంబరు 31,2017వరకు పొడిగించింది. సిసిఎల్ఏ చేసిన విజ్ఞప్తి మేరకు రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తాజా ఉత్తర్వులను జారీ చేసి జిల్లా కలెక్టర్లే లబ్ధిదారుల స్థితిగతులను పరిశీలించి ఆ భూములను అప్పగించాలని స్పష్టం చేశారు.

ఆటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అజయ్‌మిశ్రా

మన తెలంగాణ/హైదరాబాద్: ఆటవీ, పర్యావరణశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న రజత్‌కుమార్‌ను కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ మేరకు ఎన్నికల ప్రధానాధికారిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయనను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అటవీ శాఖ బాధ్యతలను ప్రస్తుతంవిద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న అజయ్ మిశ్రాకు అప్పగించారు.తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు అజయ్ మిశ్రా అటవీశాఖకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను నిర్వర్తించనున్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి రజత్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

రాజ్యసభ ఎన్నికలకు నోటిఫికేషన్

- 12వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- 10న టిఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించే అవకాశం

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలకు జరిగే ఎన్నికల్లో పోటీ చేసేందుకు తొలిరోజున ఒక్క నామినేషన్ కూడా దాఖ లు కాలేదు. ఈ ఎన్నికలకు సోమవారంనాడు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 12వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. నామినేషన్ వేయాలంటే ఒక అభ్యర్థిని ప్రతిపాదిస్తూ పది మంది ఎంఎల్‌ఎలు నామినేషన్ పత్రాలపై సంతకాలు చేయాలి. ఈ ఎన్నికలకు అసెంబ్లీ కార్యదర్శి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారు. నామినేషన్ల గడువు ముగిసిన అనంతరం ఈనెల 13న నామినేషన్లను పరిశీలిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 15 వరకు అవకాశంకల్పించారు. ఆతర్వాత అవసరమైతే ఈ నెల 23న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తారు.

టిఆర్‌ఎస్‌కే మూడు : రాష్ట్రంలో ఖాళీ కానున్న మూడు స్థానాలను అధికార టిఆర్‌ఎస్ పార్టీనే దక్కించుకోనుంది. టిఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలకు ఉన్న ఎంఎల్‌ఏల బలంతో ఈ స్థానాలను సులువుగా దక్కించుకునే అవకాశం ఉంది. అయితే, తమకు సరిపడ ఎంఎల్‌ఏలు లేనప్పటికీ ఒక అభ్యర్థిని పోటీ పెట్టాలనే ప్రతిపాదనపై కాంగ్రెస్ పార్టీలో చర్చ జరుగుతుంది. దీనిపై సిఎల్‌పిలో ముఖ్య నాయకులు సుముఖంగా లేనప్పటికీ అధిష్టానంతో సంప్రదించాలని పిసిసి భావిస్తుంది. ఆ స్థానం నుండి అమరవీరుల కుటుం బ సభ్యుల్లో ఒకరిని పెట్టాలని యోచిస్తుంది. ఇక టిఆర్‌ఎస్ అభ్యర్థులను ఈ నెల 10వ తేదీన ప్రకటించే అవకాశమున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మూడు స్థానాల్లో ఒకటి టిఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోగినపల్లి సంతోష్‌రావుకు ఖాయం అయింది. ఒక స్థానం యాదవులకు ఇస్తామని ఇప్పటికే సిఎం ప్రకటించారు. దీనికి మాజీ ఎంఎల్‌ఏలు నోముల నర్సింహయ్య, జైపాల్ యాదవ్, గొర్రెలు, మేకల పెంపకందారుల కార్పొరేషన్ చైర్మన్ రాజయ్య యాదవ్, వరంగల్ జిల్లాకు చెందిన విద్యా సంస్థల చైర్మన్ సుందర్ రాజు యాదవ్, కరీంనగర్ జెడ్‌పి చైర్‌పర్సన్ తుల ఉమల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మూడో స్థానం బిసి లేదా మైనారిటీలలో ఒకరికి ఇవ్వాలని భావిస్తున్నారు. మాజీ ఎంపి మందా జగన్నాథం పేరు కూడా వినిపిస్తోంది. ఇటీవల ఆయనను కెసిఆర్ పిలిపించి మాట్లాడినట్లు తెలిసింది.

యూరియా బస్తా 45 కిలోలే!

- ఈ నెల నుంచే అమలు
- పన్నులు కలపకుండా 242 రూపాయలకు అమ్మకం

న్యూఢిల్లీ: అత్యధిక రాయితీతో లభించే యూరియా ఎరువునే సాధారణంగా రైతులు ఉపయోగిస్తుంటారు. అయితే ఇదివరకు 50 కిలోల బస్తాల్లో లభించే యూరియా ఇకపై 45 కిలోల బస్తాల్లో లభించనుంది. ఇది ఈ నెల నుంచే అమలులోకి రానుంది. ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు, సమతుల్యతను పాటించేందుకు ఈ చర్య చేపట్టారు. 45 కిలోల యూరియా బస్తా పన్నులు కలపకుండా రూ. 242కే అమ్మనున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం ప్రకటించింది. టన్నుకు రూ. 5360 లెక్కన ప్రభుత్వం ఈ ధరను నిర్ణయించింది. ఉత్పత్తి ధర, గరిష్ఠ చిల్లర ధరలో ఉండే తేడాను కేంద్ర ప్రభుత్వమే భరించనుంది. 50 కిలోల పాత యూరియా బస్తాలను రెండు నెలల్లో వదిలించుకోవాలని ప్రభుత్వం ఎరువుల కంపెనీలను ఆదేశించినట్లు ఎరువుల మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి తెలిపారు. 'సాధారణంగా రైతులు హెక్టారు భూమి లెక్కన ఎరువుల బస్తాలను వాడుతుంటారు. 50 కిలోల బస్తాలను తగ్గించమని కోరినప్పుడు రైతులు వినలేదు. అందుకనే ప్రభుత్వం 45 కిలోల బస్తా ఆలోచన చేసింది. దీని ద్వారా యూరియా ఎరువు వాడకాన్ని కొంత మేరకు తగ్గించాలని ఆలోచిస్తోంది' అని ఆ అధికారి తెలిపారు. 2018 మార్చి 1 నుంచి 45 కిలోల యూరియా బస్తా అమ్మకాలుంటాయని ఆ ప్రభుత్వ ప్రకటనలో పేర్కొన్నారు. 25 కిలోలకు మించకుండా తక్కువ రాశుల్లో కూడా డీలర్లు యూరియా అమ్మేందుకు ప్రభుత్వం అనుమతించింది. డీలర్లు 2 కిలోల యూరియాకు రూ. 1.50, 5 కిలోల యూరియాకు రూ. 2.25, 10 కిలోల యూరియాకు రూ. 3.50, 25 కిలోల యూరియాకు రూ. 5 చొప్పున చార్జీ చేయొచ్చు. యూరియాకు వార్షిక సబ్సిడీ రూ. 40,000 కోట్లుగా ఉంది. భారత్ దేశీయంగా 24 మిలియన్ టన్నుల యూరియాను ఉత్పత్తి చేస్తోంది. దేశీయ డిమాండ్ అవసరాలకనుగుణంగా గత ఏడాది నుంచి 6 మిలియన్ టన్నులను దిగుమతి చేసుకుంటోంది.



యాంత్రీకరణకు రూ.522 కోట్లు

- పెట్టుబడికి రూ. 9056 కోట్లు...
- వరినాట్లు వేసే యంత్రాలకు ప్రాధాన్యత
- ప్రభుత్వానికి ప్రతిపాదించిన రాష్ట్ర వ్యవసాయశాఖ

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న 2018–19 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో వ్యవసాయ పెట్టుబడి పథకానికి రూ. 9056 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.522కోట్లుకేటాయించనుంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ పూర్తి స్థాయిలో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆర్థిక శాఖకు పంపింది. సిఎం కె. చంద్రశేఖర్ రావు సూచనల మేరకు వానాకాలం సీజన్‌కు ఎకరాకు రూ. 4 వేల చొప్పున దాదాపు 1.65 కోట్ల ఎకరాలకు పెట్టుబడి ఇవ్వనున్నారు. ఇందుకు మొత్తంగా రూ.6600 కోట్లు అవుతోంది. కేటాయింపుల ప్రతిపాదనలు చూస్తే ఇక యాసంగికి మిగిలేది రూ. 2456 కోట్లు. ఈ లెక్క ప్రకారం యాసంగిలో పెట్టుబడి చెల్లించేది కేవలం 61.30 లక్షల ఎకరాలకు మాత్రమే. యాంత్రీకరణ ప్రతిపాదిత మొత్తంలో అధికంగా సబ్సిడీపై వరినాట్లు వేసే యంత్రాలకే ప్రాధాన్యత ఉంటుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్రంలో ప్రతి మండలానికి 10 చొప్పున దాదాపు 5 వేల నాట్లు వేసే యంత్రాలను 50 శాతం సబ్సిడీతో ఇచ్చే యోచనలో ప్రభుత్వం ఉంది. ప్రతి 5 ఎకరాలకు వ్యవసాయ పనిముట్లు, యంత్రాల వివరాలను వ్యవసాయ శాఖ లెక్క తీస్తోంది. క్లస్టర్ వారీగా వివరాలు అందిన తరువాత ఎక్కడ ఏ యంత్రాలు సమకూర్చాలో నిర్ణయించనున్నారు. అలాగే ప్రస్తుతం ఉన్న వ్యవసాయ యాంత్రీకరణ బడ్జెట్‌లో అత్యధికంగా ట్రాక్టర్ల పంపిణీకే వినియోగించారు. అయితే రానున్న ఆర్థిక సంవత్సరంలో ట్రాక్టర్లను తగ్గించే సూచనలు కనిపిస్తున్నాయి. గత ఏడాది యాంత్రీకరణకు కేటాయించిన బడ్జెట్ రూ. 336 కోట్లుగా ఉంది. ప్రస్తుతం పంటలు వేసే దగ్గర నుంచి పంట కోత వరకు ప్రతి చోటా రైతులు వ్యవసాయ కూలీల సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. వరి నాట్లు వేసే సమయంలో, కోత సందర్భంగా చుట్టు పక్కల గ్రామాల్లో నుంచి అధిక మొత్తం చెల్లించి కూలీలను తెచ్చుకుని పనులు చేయించుకుంటున్నారు. విత్తనాలు, ఎరువుల కోసం అయ్యే ఖర్చు కంటే కూలీలకే అధికమని ఇటీవల పంటల వ్యయ, ధరల కమిషన్ (సిఎసిపి)కు పంపిన నివేదికలో వ్యవసాయ శాఖ పేర్కొంది. యాంత్రీకరణ పథకాన్ని 'తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి' కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమలు చేయనున్నారు.



అటకెక్కిన పాలీహౌస్‌లు

ఉద్యాన శాఖలో పాలీహౌస్, నెట్‌హౌస్‌లకు నిర్మాణానికి కేటాయింపులు అంతంత మాత్రంగానే ఉండనున్నాయి. వీటికి ఉద్యానశాఖ రూ.49.53 కోట్లు మాత్రమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. ఇప్పటి వరకు రూ. 350 కోట్లతో మొత్తంగా 1150 ఎకరాలలో పాలీహౌస్‌లు నిర్మించారు.

'రేరా'చట్టంపై అధ్యయన కమిటీ

మన తెలంగాణ/హైదరాబాద్: మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలు అమలు చేస్తున్న రియల్ ఎస్టేట్ (రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్) యాక్ట్‌ను అధ్యయనం చేయాలని మున్సిపల్ శాఖ నిర్ణయించింది. దీనికి సంబంధించి ఆ రాష్ట్రాలకు వెళ్లి అక్కడ అమలులో ఉన్న 'రేరా' చట్టం, పరిపాలన, విధానపరమైన అంశాలతో పాటు వాటి తదితర విషయాలను తెలుసుకునేందుకు ముగ్గురు ఉన్నతాధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది.రేరా అమలు తీరుపై ఇప్పటికే మున్సి పల్ శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ పలు మార్లు సమీక్ష నిర్వహించారు. అయితే రేరా అమలులో పరిపాలన, విధానపరమైన అంశాలపై అధ్యయనంచేసేందుకు జిహెచ్‌ఎంసి చీఫ్ సిటీప్లానర్ ఎస్. దేవేందర్ రెడ్డి, ఎస్. డైరక్టర్ ప్లానింగ్ నుంచి ఎస్. బాలకృష్ణ, పట్టణ గ్రామీణ, ప్రణాళిక డైరక్టర్ కె. విద్యాధర్‌రావులతో కమిటీని ఏర్పాటు చేసినట్లు అరవింద్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బృందం రెండు రాష్ట్రాలలో పర్యటించి తమ నివేదికను రెండు వారాల్లో ప్రభుత్వానికి అందజేయాలని ఆయన ఆదేశించారు.

"మన సిద్ధాంతాలు, లక్ష్యాలు, సూత్రాలను విస్మరించిన చోటే మనకు వైఫల్యాలు ఎదురవుతాయి. – మార్క్స్"

మెర్కెల్‌తో మళ్లీ ఎస్‌పిడి దోస్తీ

సంపాదకీయం

యురోపియన్ యూనియన్ (ఇయు)లో అత్యంత ప్రభావశాలిగా ఉన్న జర్మనీలో కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై ఐదు మాసాలకు పైగా కొనసాగుతున్న అనిశ్చితికి తెరపడింది. జర్మనీ ఛాన్సలర్‌గా కన్సర్వేటివ్ పార్టీ అధినేత అంగెలా మెర్కెల్ నాల్గవ పదవీకాల ప్రమాణ స్వీకారానికి మార్గం సుగమమైంది. గత ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న సోషల్ డెమొక్రటిక్ పార్టీ(ఎస్‌పిడి)ఎన్నికల్లో తీవ్రంగా నష్టపోయిన కారణాన తాము ప్రతిపక్షంలో కూర్చోవాలని నిర్ణయించుకోవటంతో రాజకీయ అనిశ్చితి ఏర్పడింది. మిశ్రమ ప్రభుత్వం కొరకు రెండు చిన్న పార్టీలతో మెర్కెల్ కొనసాగించిన చర్చలు వాటి గొంతెమ్మ కోర్కెల కారణాన సఫలం కాలేదు. జర్మనీ పరిస్థితి ఏమవుతుంది, మళ్లీ సార్వత్రిక ఎన్నికలకు వెళ్లటం తప్ప మార్గం లేదా అని జర్మన్‌లే కాదు ఇయు ఉత్కంఠతతో వేచిచూస్తున్న తరుణంలో ఎస్‌పిడి మనసు మార్చుకుంది. మెర్కెల్ ప్రభుత్వంలో చేరాలా, వద్దా అనే అంశంపై ఎస్‌పిడి తమ పార్టీ సభ్యుల ఓటింగ్ తీసుకుంది. నాయకులు ఊహించినదానికన్నా అధిక మెజారిటీతో–మూడింట రెండువంతుల తోడ్పాటుతో ప్రభుత్వంలో చేరేందుకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. అయితే ప్రతిపక్షంగా పనిచేస్తూ పార్టీని పునర్నిర్మాణం చేయాలని కోరుకుంటున్న యువజన విభాగం మాత్రం అసంతృప్తి వ్యక్తం చేసింది.

సెంటర్–లెఫ్ట్ పార్టీగా పరిగణించబడే ఎస్‌పిడి దీర్ఘకాలం జర్మనీని పాలించిన పార్టీ . మితవాద పార్టీగా గుర్తింపు ఉన్న క్రిష్టియన్ డెమొక్రటిక్ పార్టీ నాయకురాలు అంగెలా మెర్కెల్ 2005లో అధికారంలోకి వచ్చారు. 2013 ఎన్నికల అనంతరం ఏర్పడిన రాజకీయ అనిశ్చితిలో కన్సర్వేటివ్ పార్టీ, ఎస్‌పిడి గ్రాండ్ అలయెన్స్ ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. అయితే ఐదున్నర మాసాల క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మెర్కెల్ పార్టీకి మెజారిటీ లభించలేదు, ఎస్‌పిడి తీవ్రంగా నష్టపోయింది. పచ్చి మితవాద జాతీయోన్మాద పార్టీ అయిన ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ(ఎఎఫ్‌డి) అనే పార్టీ తొలిసారి బలమైన శక్తిగా పార్లమెంటులో ప్రవేశించింది. ఇప్పుడు తిరిగి పాత గ్రాండ్ అలయెన్స్ ప్రభుత్వ పునరుద్ధరణతో అది ప్రధాన ప్రతిపక్షం కానుంది.

ఎస్‌పిడి నిర్ణయం కొరకు ఉత్కంఠతతో ఎదురుచూసిన కన్సర్వేటివ్ పార్టీ, జర్మన్ వ్యాపారవర్గం, ఇయు నాయకత్వం ఊపిరిపీల్చుకున్నాయి. 'మన దేశం మంచికొరకు ఎస్‌పిడితో కలిసి తిరిగి పనిచేయటానికి ఎదురు చూస్తున్నాను' అని మెర్కెల్ ఎస్‌పిడిని స్వాగతించారు. 'అమెరికా వాణిజ్య యుద్ధం ప్రారంభిస్తున్నది. చైనా మన పారిశ్రామిక నాయకత్వాన్ని సవాలు చేస్తున్నది. మనం అనవసరమైన అంతర్గత సమస్యలో చిక్కుకున్నామని' భావించిన జర్మన్ పారిశ్రామిక వేత్తలు ఎంతో సంతోషించారు. కాగా ఎస్‌పిడి నిర్ణయం 'యూరప్‌కు శుభవార్త' అని అభివర్ణించారు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యూల్ మక్రాన్.

బ్రిటిషర్ల బ్రెగ్జిట్ తీర్పుతో ఇయు నుంచి బ్రిటన్ వైదొలిగే ప్రయత్నాలు వేగవంతం కావటం, మరికొన్ని సభ్యదేశాల్లో ఆర్థిక సంక్షోభం, డొనాల్డ్ ట్రంప్ 'అమెరికాఫస్ట్' కార్యక్రమంతో ఇయు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నది. ఇప్పుడు అందులో మిగిలిన అభివృద్ధి చెందిన పెద్ద దేశాలు జర్మనీ, ఫ్రాన్స్‌లే. ఛాన్సరల్ అంగెలా మెర్కెల్ కొంతకాలంగా ఇయులో కీలక పాత్ర పోషిస్తున్నారు. అందువల్ల ఆమె నాయకత్వం కొరకు ఇయు ఎదురు చూస్తున్నది. జర్మనీలో రాజకీయ అనిశ్చితి కొనసాగితే అది ఇయుకు కూడా చేటు చేస్తుంది. అందువల్ల ఇయు నాయకులు కూడా ఎస్‌పిడి నాయకత్వంపై ఒత్తిడి చేసి ఉండవచ్చు. నాయకత్వం పునరాలోచన చేసి పార్టీ సభ్యులను ఒప్పించటానికి కొంత సమయంపట్టి ఉంటుంది. రెండు చిన్న పార్టీలతో సంకీర్ణ ప్రభుత్వం కొరకు మెర్కెల్ నెలల తరబడి జరిపిన చర్చలు విఫలం కావటం ఆమెతో ఎస్‌పిడి బేరసారాల శక్తిని పెంచి ఉంటుంది. ఆ పార్టీ ముగ్గురు పురుషులు, ముగ్గురు మహిళలను మంత్రివర్గంలోకి నామినేట్ చేయనుంది. ఆర్థికమంత్రిత్వశాఖ ఆ పార్టీకి దక్కనున్నట్లు ప్రచారంలో ఉంది. ఏమైనా, జర్మనీలో సుస్థిర ప్రభుత్వం యూరప్ భవిష్యత్‌కు ఎంతో ముఖ్యం.

స్మృతి ఇరానీ....అదే కహానీ

చూపు

ఒక ప్రయివేటు కంపెనీకి దాదాపు మూడుకోట్ల రూపాయలు ఇమ్మంటే కుదరదని దూరదర్శన్ అంటుందా? స్మృతి ఇరానీకి కోపం వచ్చింది. అంతే ప్రసారభారతిలో పనిచేసే ఉద్యోగులకు జీతాలు అందకుండా నిధులు ఆపేసింది. ఇంతకు ముందు ఇలా ఉద్యోగుల జీతాలు ఆపేసి కక్షసాధించిన మంత్రులు ఎవరైనా ఉన్నారా? కేంద్రప్రభుత్వం నుంచి రావలసిన నిధులు రాకపోవడం వల్ల ప్రసారభారతి కంటింజెన్సీ నిధుల నుంచి జనవరి, ఫిబ్రవరి నెలల జీతాలు చెల్లించారు. ఈ ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఏప్రిల్ వరకు ఇలాగే కొనసాగితే ప్రసారభారతి వద్ద కంటింజెన్సీ నిధులు కూడా అయిపోతాయి. ఇక జీతాలుండవన్నమాట.

ఫైనాన్స్ మినిస్టర్ అరుణ్ జైట్లీ కూడా ఇలాంటి పనే కదా చేసింది. రిజర్వు బ్యాంకు వడ్డీ రేటులు ఆయనకు నచ్చలేదు. ఆ బ్యాంకు ఉద్యోగులకు జీతాలు చెల్లించడం కష్టమయ్యే స్థితి తెచ్చాడు.

కేంద్ర ప్రభుత్వం 2,800 కోట్ల రూపాయలు ఈ సంవత్సరం ప్రసారభారతికి కేటాయించింది. సమాచార శాఖ నుంచి ఈ నిధులు నెలనెలా 5000 మంది ఉద్యోగుల జీతాలు చెల్లించడానికి విడుదల చేయాలి. కాని ప్రతినెల సమాచార శాఖ ఏదో ఒక లొల్లి పెడుతూనే ఉందన్న ఫిర్యాదులు వినిపిస్తూనే ఉన్నాయి. డిసెంబరు తర్వాతి నుంచి అస్సలు నిధులు విడుదల చేయడమే మానేసింది. ఈ సమస్యకు కారణమేమిటంటే, స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న ప్రసారభారతిని నడుపుతున్నది సూర్యప్రకాష్. సమాచార శాఖమంత్రి ఇరానీ తీసుకున్న కొన్ని నిర్ణయాలను ఆయన మొహమాటం లేకుండా ప్రశ్నించాడు. ఒక కార్యక్రమాన్ని అనవసరంగా ఔట్ సోర్స్ చేసి ఒక ప్రయివేటు కంపెనీకి 2.92 కోట్ల రూపాయలు చెల్లించాలని మంత్రి పంపిన ప్రతిపాదనను ప్రసారభారతి తిరస్కరించింది. అంతకు ముందు మంత్రి ఇద్దరు జర్నలిస్టులను ఎడిటోరియల్ పోస్టుల్లో చేర్చుకోవాలని రికమెండేషను పంపింది. కాని వారి జీతాలను ప్రసారభారతి భరించలేని స్థాయిలో నిర్ణయించడంతో దానిని కూడా ప్రసారభారతి నో చెప్పేసింది. ఈ ఇద్దరు జర్నలిస్టులను సెర్చి కమిటీ నామినేట్ చేసేలా స్మృతి ఇరానీయే ఒత్తిడి తీసుకొచ్చినట్లు కూడా తెలుస్తోంది. అందులో ఒకరు ఆమెకు అనధికారిక మీడియా సలహాదారుగా పనిచేస్తున్నారు.

ప్రసారభారతి బోర్డు మీటింగ్ ఫిబ్రవరి 15వ తేదీన జరిగింది. అక్కడ సమాచార శాఖ ప్రతినిధిగా వచ్చిన అలీ రిజ్వి బాహాటంగానే చెప్పినట్లు వినకపోతే జీతాలు ఆపేస్తామని బెదిరించాడట. దాంతో ఒళ్ళు మండిన సూర్యప్రకాష్ బడ్జెటు కేటాయింపును ఆపేస్తాననడానికి నీకెంత ధైర్యం అని నిలదీయడమే కాదు, దూరదర్శన్, ఆకాశవాణి లో పనిచేసే ఉద్యోగుల నెల జీతాలు బడ్జెటులో కమిట్ మెంట్లు, మీ జేబుల్లోంచి ఇవ్వడం లేదని ఘాటుగా జవాబిచ్చారట కూడా.

ఈ కొత్త గొడవ రావడంతో ఇంతకు ముందు జర్నలిస్టులను ఎడిటోరియల్ పోస్టుల్లో నియమించాలన్న వ్యవహారం వెనక్కి వెళ్ళింది. గోవాలో ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియాకు సంబంధించి షూటింగ్ చేసి ఫుటేజి ఇచ్చినందుకు ఒక ప్రయివేటు కంపెనీకి దాదాపు మూడుకోట్ల రూపాయలు ఇమ్మని మంత్రి ఇరానీ చెప్పడంతో ప్రసారభారతిలో ఆగ్రహావేశాలు కనబడుతున్నాయి. ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభమైనప్పటి నుంచి దూరదర్శన్ మాత్రమే కవరేజి చూస్తోంది. కాని మోడీ ప్రభుత్వం వచ్చాక, ముఖ్యంగా స్మృతి ఇరానీ సమాచారశాఖ మంత్రి అయిన తర్వాత, 2017 నుంచి దూరదర్శన్ ను ఈ కవరేజి నుంచి తప్పించింది. దానికి కారణాలు కూడా చెప్పలేదు. ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహణను కూడా సమచారా శాఖ డైరెక్టరేటు నుంచి ఫిల్మ్ డెవలప్ మెంటు కార్పోరేషనుకు మార్చింది. ఈ ఫిల్మ్ డెవలప్ మెంటు కార్పోరేషను ఫిల్మ్ ఫెస్టివల్ కవరేజికి హక్కులు ఒక ప్రయివేటు సంస్థకు అప్పజెప్పింది. యస్ఓఎల్ ప్రొడక్షన్ కంపెనీ ముంబయికి చెందినది. ఈ కంపెనీ నడుపుతున్న వాళ్ళు ఇంతకు ముందు స్మృతి ఇరానీ యాక్టరుగా ఉన్నప్పటి నుంచి మిత్రులు. తన మిత్రులకు సంబంధించిన ప్రయివేటే కంపెనీకి ఈ కవరేజి హక్కులు కట్టబెట్టడం గురించి ఆమెను ప్రశ్నించినా జవాబు లేదు. ఫిల్మ్ ఫెస్టివల్‌లో కవరేజి చేసినందుకు 2.92 కోట్లు ఇవ్వాలని మంత్రిణి గారి ఆదేశం. అసలు ఈ ప్రయివేటు కంపెనీకి ఇవ్వవలసిన అవసరమేముంది. దూరదర్శన్ స్వయంగా ఆ కవరేజి చూసుకుంటుంది. రిపబ్లిక్ డే, ఇంటర్నేషనల్ యోగా డే వంటి భారీ సన్నివేశాలను కవర్ చేసిన అనుభవం, సామర్థ్యం దూరదర్శన్ కు ఉంది. ఇందుకు కనీసం 40 కెమెరాలు అవసరమవుతాయి. ఫిల్మ్ ఫెస్టివల్ మొత్తం 15 కెమెరాలతో షూటింగ్ జరిపే ఘట్టం. అందువల్ల దూరదర్శన్ ఇలాంటి ఔట్ సోర్సింగ్ కోసం చెల్లింపు చేయలేదు. దానివల్ల ఆడిట్ అభ్యంతరాలు వస్తాయని ప్రసారభారతి అధికారుల వాదన.

స్మృతి ఇరానీ పంపిన ప్రతినిధి రిజ్వి బోర్డు మీటింగులో ఈ చెల్లింపు చేయాలని గట్టిగా చెప్పాడు. బోర్డు తిరస్కరించింది. మంత్రికి కోపం వచ్చింది. స్మృతి ఇరానీ సమాచార శాఖకు రాగానే అడిషనల్ సెక్రటరీ జయశ్రీ ముఖర్జీని తొలగించింది. ఎందుకంటే జయశ్రీ ఆమె చెప్పినట్లు తలూపే అధికారి కాదు కాబట్టి. ఆ తర్వాత తనకు తలూపే అధికారి రిజ్విని తెచ్చుకుంది. సీనియర్ ఇన్ఫర్మేషన్ అధికారి భారతీ వైద్ బదిలీ కూడా అలాంటిదే. చిరాకు వచ్చిన భారతీ చివరకు ఉద్యోగానికి రాజీనామా చేసింది. స్మృతి ఇరానీ రాగానే ప్రారంభించిన "మతిలేని బదిలీల" పై అధికారులు ప్రధానికి మెమొరాండం ఇచ్చారు. ఐఐయస్ కేడరులో దాదాపు పాతికశాతం ఈ మతిలేని బదిలీలకు బలయ్యారు. మంత్రికి ఎవరిమీదనైనా కోపం వస్తే వెంటనే బదిలీ చేస్తారని ఇప్పుడు అందరూ జోకులు చేసుకునే పరిస్థితి వచ్చింది. ఒక అధికారయితే "ఆమె వండర్ ల్యాండ్ లో మహారాణిలా అనుకుంటుంది. పాతికేళ్ళ నా సర్వీసులో ఇంత మతిలేని అహంభావిని ఎన్నడూ చూడలేదు" అన్నాడని ది వైర్ పత్రిక రాసింది. ఐఐయస్ అధికారుల అసోసియేషన్ అధ్యక్షుడు అనింద్య సేన్ గుప్తను కూడా ఆమె బదిలీ చేసింది. తాను చేస్తున్న మతిలేని బదిలీల గురించి మోడీకి ఫిర్యాదు చేశాడని ఆయనపై బదిలీ వేటు పడింది. దూరదర్శన్ డైరెక్టరు పదవి నుంచి పబ్లికేషన్ డివిజన్ కు పంపించారు. ఆమె 2017లో సమాచారశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి సూపర్ సెన్సార్ లా వ్యవహరిస్తోందని, భారత ప్రభుత్వ విజయగాథలు చూపించడం లేదంటూ దూరదర్శన్ పై ఒత్తిడి తీసుకొస్తుందని అధికారులు విమర్శిస్తున్నారు. ఏది ఏమైనా ఇప్పుడు సమాచార శాఖ మంత్రి స్మృతి ఇరానీపై ప్రసారభారతి పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధమైనట్లు కనిపిస్తోంది. ఆమె ఉన్నత విద్యాశాఖలో ఉన్నప్పుడు జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం విద్యార్థులపై జాతి వ్యతిరేకులన్న ముద్ర వేస్తూ నడిపించిన బాగోతమూ బహిర్గతం కావచ్చు.



✽ స్వాతి చతుర్వేది

సిరియా : ఐరాస గాజుకన్ను



వాహెద్
7093788843

సిరియాలో ఈ ఘోరకలి నేటిది కాదు. 2011 నుంచి కొనసాగుతోంది. నిజం చెప్పాలంటే ఇరాక్‌లో మాదిరిగా ప్రపంచదేశాలు అమెరికా ఒంటెద్దు పోకడను ఈ సారి ఒప్పుకోలేదు కాని, లేకపోతే ఇరాక్ మాదిరిగా, అఫ్గనిస్తాన్ మాదిరిగా, లిబియా మాదిరిగా ఎప్పుడో నేలమట్టమైపోయి, ఆ శిధిలాల్లో ఎంతమంది పసిపిల్లలు సమాధయ్యారన్న వార్తలు కూడా బయటకు పొక్కేవి కావు. ఇరాక్‌లో దాదాపు 5 లక్షల మంది పసిపిల్లల మరణాలకు కారణమైనప్పటికీ సగర్వంగా మానవహక్కుల గురించి అమెరికా చెప్పుకోగలుగుతుంది.

సాధారణ పౌరులు ఆ ప్రాంతం వదిలి వెళ్లడానికి వీలుగా 30 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. సిరియా నియంత బషారుల్ అసద్ ఈ పట్టణంపై సైన్యాలను నడిపించాడు. రష్యా యుద్ధవిమానాలు ఈ సైన్యానికి అండగా బాంబులు కురిపించాయి. దాదాపు 550 మంది సాధారణ పౌరులు మరణించారని వార్త. కాల్పుల విరమణ ఒప్పందాన్ని తుంగల్లో తొక్కుతూ సిరియా, రష్యా దేశాలు దాడులను కొనసాగిస్తున్నాయని అమెరికా ఆరోపించింది. కాని రష్యా వాదన మరోలా ఉంది. కాల్పుల విరమణ సందర్భంగా మానవీయ సహాయానికి ఉద్దేశించిన మార్గాలపై తిరుగుబాటు దళాలు దాడులు చేశాయని, ప్రతిచర్య తప్పదని స్పష్టం చేసింది. ఆ ప్రాంతంలో అల్ ఖాయిదాకు సంబంధించిన టెర్రరిస్టు సంస్థలు జబత్ ఫతే అల్ షామ్ వంటి వాటిపై దాడులు కొనసాగిస్తామని ప్రకటించింది. మరోవైపు టర్కీ కూడా అమెరికా ద్వంద్వప్రమాణాలు పాటిస్తుందని ఆరోపించింది. టర్కీ కూడా సిరియా పట్టణం ఆఫ్రీన్ పై దాడులు చేస్తోంది. ఐక్యరాజ్యసమితి కాల్పుల విరమణ ఒప్పందానికి ఇది విరుద్ధమంటూ అమెరికా చేసిన ఆరోపణను టర్కీ తిప్పి కొట్టింది. ఈ తీర్మానంలో ఆఫ్రీన్ ప్రస్తావనే లేనప్పుడు టర్కీ ప్రస్తావన ఎందుకు తెస్తున్నారని నిలదీసింది. ఇటీవల టర్కీ చాలా తీవ్రమైన హెచ్చరికలు అమెరికాకు చేసిందన్నది కూడా గుర్తుంచుకోవాలి. టెర్రరిస్టులు ఎవరైనా ఒక్కటే. మంచి టెర్రరిస్టులు, చెడ్డ టెర్రరిస్టులు లేరు. అమెరికా మతి లేకుండా మాట్లాడుతోంది. ఈ ద్వంద్వ ప్రమాణాలకు మేం ఒప్పుకునేది లేదని స్పష్టం చేసింది.

అమెరికా, పాశ్చాత్య సంస్థల నుంచి వచ్చే వార్తలకు, రష్యా, మధ్య ప్రాచ్య వార్తా సంస్థలు చెప్పేదానికి పొంతన ఉండడం లేదు. రష్యా దారుణాలకు పాల్పడుతుందని పాశ్చాత్య మీడియా వార్తలు చూపిస్తుంటే, అమెరికా, పాశ్చాత్య దేశాల అమానుష విధానాల గురించి రష్యా మీడియా చెబుతుంది. ఎవరిని నమ్మాలో తెలియని ఒక అయోమయం.


అసలు సిరియాలో ఏం జరుగుతోందన్నది మాట్లాడే ముందు సిరియాలో ఎవరి అధికారం ఉంది, ఎవరి నియంత్రణలో ఉందన్నది ముందు మాట్లాడుకోవాలి. మార్చి 2011 నుంచి సిరియాలో అంతర్యుద్ధం కొనసాగుతోంది. ఇప్పటి వరకు దాదాపు నాలుగున్నర లక్షల మంది మరణించారు. పదిలక్షల మంది గాయపడి ఉంటారు. దాదాపు కోటి ఇరవై లక్షల మంది నిరాశ్రయులయ్యారు. అంటే దేశజనాభాలో సగం మంది ఇల్లూ వాకిలి వదిలి శరణార్థులయ్యారు. ఇప్పుడు దారుణమైన దాడులకు సంబంధించి వార్తలు వస్తున్నది తూర్పు ఘౌటా పట్టణం నుంచి. ఈ పట్టణం తిరుగుబాటు దారుల నియంత్రణలో ఉంది. రాజధాని డమస్కస్ కు దగ్గరగా ఉన్న పట్టణం కాబట్టి దీన్ని తిరిగి హస్తగతం చేసుకోవాలని సిరియా ప్రభుత్వం దాడులు చేస్తోంది. ఈ ప్రాంతంలో దాదాపు నాలుగు లక్షల మంది ప్రజలున్నారు. ఇప్పటికీ దాదాపు నాలుగు సంవత్సరాలుగా సిరియా ప్రభుత్వం ఈ పట్టణాన్ని దిగ్బంధం చేసి ఉంచింది. ఉత్తర సిరియాలో ఆఫ్రీన్ పట్టణంపై సిరియా నియంత బషారుల్ అసద్ సైన్యాలు కూడా టర్కీ దాడులను ఎదిరిస్తున్నాయి. అక్కడ కుర్దు వైపిజి మిలిషియాను అంతం చేయాలని టర్కీ ప్రయత్నిస్తోంది. ఈ పట్టణం కుర్దు మిలిషియా నియంత్రణలో ఉంది. కుర్దు మిలిషియా అసద్ సైన్యాల సహాయం కోరింది. కుర్దులకు, సిరియా ప్రభుత్వానికి మధ్య సైనిక ఒప్పందం ఉంది. అందువల్ల సిరియా ప్రభుత్వం వారికి సహాయంగా సైన్యాన్ని పంపించింది. కాని విచిత్రమేమంటే, సిరియా అధ్యక్షుడు అసద్ ను గద్దె దించాలని కోరుతున్న అమెరికా కుర్దులకు సహాయం చేస్తోంది. ఇదొక అయోమయ పరిస్థితి. ఎవరు ఎవరికి శత్రువో ఎవరు మిత్రుడో తెలియని ఒక గందరగోళం అక్కడ నెలకొని ఉంది. అమెరికా ప్రత్యేక దళాలు అంటే అమెరికన్ సైనికులు కాదు, కుర్దు మిలిషియాకు అమెరికా శిక్షణ, ఆయుధాలు ఇచ్చి నియమించిన దళాలు టర్కీ పై పోరాడుతున్నాయి.

అసలు సిరియా ప్రభుత్వం, అంటే బషారుల్ అసద్ నియంత్రణలో ఉన్న భూభాగం అలెప్పో, లటాకియా, టార్టస్, హమా, హమ్స్, డమస్కస్, పాల్మిరా, అబూ కమాల్ పట్టణాలు మాత్రమే. సిరియాలో ఐయస్ ఐయస్ అదుపులో కూడా కొంత భూభాగముంది. రఖ్ఖా పోరాటం తర్వాత ఐయస్ఐయస్ చాలా భూభాగం కోల్పోయింది. అబూకమాల్ లో కొంత భూభాగం ఇప్పటికీ ఈ ఉగ్రవాద సంస్థ అదుపులోనే ఉంది. దీనికి పశ్చిమాన సిరియా ప్రభుత్వ దళాలు చుట్టుముట్టి ఉంటే తూర్పున కుర్దు దళాలు చుట్టుముట్టి ఉన్నాయి. ఈ దిగ్బంధం కొనసాగుతోంది.

ఐయస్ఐయస్ వంటి ఉగ్రవాద సంస్థపై ప్రపంచంలో ఉగ్రవాదంపై యుద్ధం ప్రకటించిన అమెరికా, నాటో దళాలు ఎందుకు విజయం సాధించలేకపోతున్నాయన్నది ఆలోచించవలసిన ప్రశ్న. ఇటీవల ఇస్రాయీల్ పార్లమెంటులో అక్కడి పార్లమెంటు సభ్యురాలే ఇస్రాయీల్ చవగ్గా చమురు ఐయస్ఐయస్ నుంచి కొంటుందని ఆరోపించింది. ఐయస్ఐయస్ లో ఇస్రాయీల్ గూఢచార సంస్థ మొస్సాద్ ఏజంట్లే ఉన్నారన్న వార్తలు బలంగా వస్తున్నాయి. లిబియాలో పట్టుబడిన ఐయస్ఐయస్ ఉగ్రవాది మొస్సాద్ ఏజంటని తేలింది. అసలు ఐయస్ఐయస్ అంటేనే ఇస్రాయీల్ సీక్రెట్ ఇంటిలిజెన్స్ సర్వీస్ అన్న ఆరోపణలు కూడా బలంగా ఉన్నాయి.

ఐయస్ఐయస్ అధినేత బగ్దాదీకి శిక్షణ ఇచ్చింది మొస్సాద్ అనీ, ఆయన యూదుడన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇవన్నీ పక్కన పెడితే ఇస్రాయీల్ తన ప్రయోజనాల కోసం లెబనాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తత కొనసాగించడానికి ఐయస్ఐయస్ ను వాడుకుంటుందన్న వాదనలు కూడా బలంగా ఉన్నాయి. కాబట్టి సిరియాలో ఐయస్ఐయస్ ను పూర్తిగా తుడిచేయడానికి అమెరికా నిజంగా ప్రయత్నిస్తుందా అన్నది అనుమానాస్పదం.

హృదయవిదారకమైన వార్తలు సిరియా నుంచి వస్తున్నాయి. పసిపిల్లల ఆర్తనాదాల వీడియోలు వస్తున్నాయి. ఏమీ చేయలేని దుస్థితిలో ఉన్నాం. నిజానికి ఏమీ చేయలేని దుస్థితి ఐక్యరాజ్యసమితి ఏర్పాటులోనే ఉంది. ఎన్ని తీర్మానాలు ఐక్యరాజ్యసమితిలో వీటో అయ్యాయి. అగ్రరాజ్యాలకు వీటో హక్కు ఎందుకు లభిస్తోంది. భారతదేశం హాఫిజ్ సయీద్ గురించి మాట్లాడితే చైనా వీటో ఎందుకు చేస్తుంది. ఇస్రాయీల్ కోసం అమెరికా వీటో అధికారం ఎందుకు ఉపయోగిస్తుంది. అగ్రరాజ్యాల అడుగులకు మడుగులొత్తే బానిస సంస్థగా ఐక్యరాజ్యసమితిని ఏర్పాటు చేశారన్నది కాదనలేని యదార్థం. బడుగు బలహీనదేశాల్లో ప్రజల ఆర్తనాదాలను వినడమే కాని ఏమీ చేయలేని సంస్థగానే ఐక్యరాజ్యసమితి నేటి వరకు నిరూపించుకుంది.



ఐయస్ఐయస్ వంటి ఉగ్రవాద సంస్థపై ప్రపంచంలో ఉగ్రవాదంపై యుద్ధం ప్రకటించిన అమెరికా, నాటో దళాలు ఎందుకు విజయం సాధించలేకపోతున్నాయన్నది ఆలోచించవలసిన ప్రశ్న. ఇటీవల ఇస్రాయీల్ పార్లమెంటులో అక్కడి పార్లమెంటు సభ్యురాలే ఇస్రాయీల్ చవగ్గా చమురు ఐయస్ఐయస్ నుంచి కొంటుందని ఆరోపించింది. ఐయస్ఐయస్ లో ఇస్రాయీల్ గూఢచార సంస్థ మొస్సాద్ ఏజంట్లే ఉన్నారన్న వార్తలు బలంగా వస్తున్నాయి. లిబియాలో పట్టుబడిన ఐయస్ఐయస్ ఉగ్రవాది మొస్సాద్ ఏజంటని తేలింది. అసలు ఐయస్ఐయస్ అంటేనే ఇస్రాయీల్ సీక్రెట్ ఇంటిలిజెన్స్ సర్వీస్ అన్న ఆరోపణలు కూడా బలంగా ఉన్నాయి. ఐయస్ఐయస్ అధినేత బగ్దాదీకి శిక్షణ ఇచ్చింది మొస్సాద్ అనీ, ఆయన యూదుడన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇవన్నీ పక్కన పెడితే ఇస్రాయీల్ తన ప్రయోజనాల కోసం లెబనాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తత కొనసాగించడానికి ఐయస్ఐయస్ ను వాడుకుంటుందన్న వాదనలు కూడా బలంగా ఉన్నాయి. కాబట్టి సిరియాలో ఐయస్ఐయస్ ను పూర్తిగా తుడిచేయడానికి అమెరికా నిజంగా ప్రయత్నిస్తుందా అన్నది అనుమానాస్పదం.

పడగనీడన మహిళా సాధికారత



విమల

సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకి ఇంకా ఆర్థిక, రాజకీయ, సాంఘిక సమానత్వాలు లేవు. ప్రపంచంలో ప్రతి ముగ్గురు స్త్రీలలో ఒక స్త్రీ పురుషుల చేతుల్లో లైంగిక, శారీరక, మానసిక హింసకి అనుదినం గురి అవుతూనే వుంది. పసిపిల్లలపైన అత్యాచారాలు, స్త్రీల ను లైంగిక బానిసలుగా మార్చేందుకు వారిని ట్రాఫికింగ్ కు గురిచేయడం మన దేశంలో చాలా పెరిగింది. స్త్రీలను వ్యాపార సరుకుగా చూడటం, వాళ్ల శ్రమని కారుచౌకగా దోచుకోవడం మొదటి నుండీ వున్నా, మన దేశంలో ప్రవేశపెట్టిన ప్రపంచీకరణ, నూతన ఆర్థిక విధానాలు, విధ్వంసక అభివృద్ధి నమూనాలు మహిళ పరిస్థితిని దారుణంగా దిగదార్చాయి.

మరో వంక స్త్రీల సమానత్వ ఆకాంక్షలను, లైంగికత్వాన్ని నియంత్రించేందుకు కులం, మతం తమ వంతు పాత్రను పోషిస్తున్నాయి. మతతత్వం, అభివృద్ధి, అణిచివేతల కలయికలతో సాగుతున్న ఒక ప్రమాదకరమైన పాలన అంతిమంగా సమాజపు అంచులకు నెట్టివేయబడ్డ సమూహాలపై పాశవిక హింసకి, వారి స్థితి మరింత దిగజారడానికే దారితీస్తుంది. స్త్రీలపై బ్రాహ్మణీయ పితృస్వామిక అణిచివేత బహుముఖ రూపాలలో కొనసాగుతుంది. మతతత్వ రాజకీయాలు ప్రజాస్వామిక, సమానత్వ విలువలకు వ్యతిరేకమైనవి. మహిళలలో మత ఛాందస వాదాన్ని, తిరోగమన, పురుషాధిపత్య భావజాలాన్నీ ప్రవేశపెట్టే, ప్రవచనాలకు, వ్రతాలు, నోములకు, ప్రభుత్వాలే స్పాన్సరర్స్‌గా వ్యవహరించడం ప్రమాదకరం. ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాల్సిన అంశం.



స్త్రీల పోరాటాల ఫలితంగా చేసిన చట్టాలన్నింటికీ తూట్లు పొడిచి, ఎంతో కాలంగా మహిళలు డిమాండు చేస్తున్న మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుంటూ మహిళల సాధికారత గురించి ప్రభుత్వాలు మాట్లాడటం కన్నా హాస్యాస్పదం మరొకటి లేదు. జండర్ సమానత్వం గురించి మొదట తెలుసుకోవాల్సింది, పురుషులు, పాలకులు.

దేశంలో అభివృద్ధి పేరిట విస్థాపనకు గురైన ఆరు కోట్ల జనాభాలో నలభైశాతం మంది ఆదివాసీలున్నారు. మిగిలిన వారిలో దళితులు, పేదలు ఎక్కువగా ఉన్నారు. జీవనాధారాలను, ఉపాధిని, గ్రామాలను, భూములను నివాసాలను కోల్పోతున్న ప్రజల సంఖ్య రానున్న కాలంలో ఇరవై కోట్లకు చేరుకోనున్నదని ఒక అంచనా! ఈ పరిస్థితులు మహిళలపై చూపుతున్న ప్రభావాన్ని అంచనా వేయడం ఇవ్వాల్టి తక్షణ అవసరం.

మారుతున్న మన దేశ పరిస్థితులలో మహిళలపై అమలవుతున్న హింస, అణిచివేత తీసుకొంటున్న నూతన రూపాలను గుర్తిస్తూ, అందుకు తగినట్లు మహిళా సంఘాలు తమ పోరాట మార్గాలను ఎంచుకోవడం, ఐక్యంగా ముందుకు సాగటమే ఈ మార్చ్ ఎనిమిది అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవపు స్ఫూర్తి.

✽ విమల





ఆత్మీయతకు చిరునామా ఐ ఫోకస్

అక్కడ ప్రతి ఒక్కరూ నాయకులుగా తయారవుతారు. ఓడిపోయిన వాళ్లు కుంగిపోరు ...ఓటమి కారణాలను విశ్లేషించుకుంటారు. అందరికీ సాయం చేస్తూ అందరితోపాటే తామూ ఎదగాలనుకుంటారు.. ప్రతి వ్యక్తీ వారివారి అనుభవాలను పంచుకుంటారు...వీటన్నింటి వేదికే హైదరాబాద్‌లోని బాగ్అంబర్‌పేటలో ఉన్న ఐ ఫోకస్. పోటీ ప్రపంచంలో సంతోషకరమైన జీవితాలను సమస్యల సుడిగుండంలా మలుచుకుంటోంది యువత. వారిలో మార్పు కోసం ప్రయత్నిస్తున్న సంస్థే ఐ ఫోకస్. సామాజిక బంధుత్వం కావాలనుకొనే ఎవరికైనా స్వాగతం పలుకుతోంది సంస్థ...



కళ్ల ముందు అన్యాయం జరుగుతున్నా, సమస్య కనబడుతున్నా మనకెందుకునే అనుకొనేవారే ఎక్కువ. మానవత్వంలేదని కాదుగానీ అందుకు సమయంలేదనే వారే అధికంగా కనిపిస్తుంటారు. కనీసం వారి గురించి వారైనా సరిగ్గా అర్థం చేసుకుంటారా అంటే అదీ లేదు. చిన్న సమస్య రాగారే బెంబేలెత్తిపోతుంటారు. ఆత్మవిశ్వాసం లేకపోవడం ఇప్పటి యువతలోని ప్రధాన సమస్య. దీన్ని గుర్తించి మానవ విలువల్ని పెంచి సమాజానికి నిజమైన వ్యక్తుల్ని , నాయకుల్ని అందించాలనే దృక్పథంతో పనిచేస్తుంది ఐ ఫోకస్. విద్యార్థుల్లో ఏకాగ్రత, ఉద్యోగుల్లో ఆత్మవిశ్వాసం, వ్యాపారుల్లో నైపుణ్యం, విలువలు, పౌరుల్లో సమాజంపై బాధ్యతలు పెంచడానికి అవగాహన కల్పిస్తోంది.

విశాఖపట్నంలోని భీమిలీలో ఉండే ఆధ్యాత్మిక గురువు శివానంద మూర్తి ఆలోచనలకు ప్రతిరూపమే ఈ సంస్థ. ఆయన సూచనల ప్రకారం ఆయన అనుచరులు కొందరు 2005 లో యువత కోసం ఐఫోకస్‌ను ఏర్పాటుచేశారు. సమర్థత, సమగ్రత, భారతీయత అనే భావాలతో, యువతరం ఎంత కలిసి కట్టుగా ఉంటే అంత బలం అంటున్నారు సంస్థ నిర్వాహకులు. ఐ ఫోకస్‌లో చేరాలంటే ఎటువంటి నియమనిబంధనలు లేవు. ఎవరైనా చేరొచ్చు. వయసు అడ్డుకాదు. కుల మత ప్రాంత భేదాలు లేవు. ఇందులో నాలుగు రకాల సభ్యులుంటారు. బాలవికాస్, టీన్ వికాస్, యువ వికాస్, మనోవికాస్, బ్రిగేడియర్ స్థాయికి కూడా వెళ్లొచ్చు. ఇక్కడ చదువులు, లక్ష్యాలు, కెరీర్ పాఠాలు, స్టార్టప్ కిటుకులు వంటివే కాదు. జీవన పాఠాలు, అనుభవజ్ఞుల సాంగత్యం, సందేహాల నివృత్తి, చక్కటి వ్యక్తిత్వ వికాసానికి అవకాశం లభిస్తుంది. చేరడానికి ఫీజులుండవు. ప్రతి సాయంత్రం తరగతులు నిర్వహిస్తారు. అదీ సరదా సంభాషణల్లాగే ఉంటుంది. బృందంలో కలిసిపోయేతత్వం అలవర్చుకోవడం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం చాలా సులువు. ఐ ఫోకస్‌లో అడుగుపెట్టగానే మొదట నేర్చుకునే పాఠం మనసారా నవ్వుకోవడం, కొత్తగా వచ్చిన వాళ్లల్లో రెండు మూడు రోజుల్లోనే బిడియం పోతుంది. సభ్యుల్లో ఇమిడిపోతారు. కుటుంబంలోని ఆత్మీయ వాతావరణం ఇక్కడ కనిపిస్తుంది. అన్నయ్య, అక్కయ్య, తమ్ముడు ఇలా ఉంటాయి ఇక్కడి పిలుపులు. సంస్థ సొసైటీ పరిధిలోనే అనేక స్టార్టప్‌లు మొదలుపెట్టారు కొందరు యువతీ యువకులు. సమూహంగా కూర్చుని స్వేచ్ఛగా మాట్లాడుకుంటారు. ఎవరి లోపాలను వాళ్లు బహిరంగంగా చెప్పుకుంటూ సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తుంటారు.

వర్క్‌షాపులు జరుగుతుంటాయి. ప్రతి నెలా మొదటి ఆదివారం సమావేశమౌతారు. దాన్ని సూపర్ సండే అంటారు. ఐటీ నిపుణులు, పారిశ్రామికవేత్తలు, సినిమా సెలబ్రిటీలతోపాటు డాక్టర్లు, ఇంజినీర్లు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, జర్నలిస్టులు, లాయర్లు ఇలా అన్ని రంగాలకు చెందిన వాళ్లూ ఉంటారు. మంచి సలహాలు విలువైన సూచనలు విజయరహస్యాలను కలబోసుకుంటారు. వయసుల వారీగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. ఐ ఫోకస్‌లో స్ఫూర్తి పొందినవారు సామాజిక కార్యక్రమాల్లో పనిచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



విరామం ఉంచండి...



భోజనం చేసిన వెంటనే చాలా మంది కొన్ని పొరపాట్లు చేస్తుంటారు. దీంతో తెలియకుండానే అనారోగ్యంపాలవుతుంటారు. అన్నం తినడానికి ముందు తర్వాత ఏమేం చేయాలో చేయకూడదో ఓసారి తెలుసుకుందాం...

భోజనం చేయగానే నడిస్తే మంచిదని చిన్నప్పటి నుంచీ వింటున్నాం. కానీ తినగానే నడిస్తే పోషకాలను గ్రహించడంలో జీర్ణవ్యవస్థ విఫలమౌతుంది. అందువల్ల తిన్న గంట తర్వాత నడవడం మేలు.

తినగానే స్నానం చేయొద్దు. కాళ్లు , చేతుల్లో రక్తప్రసరణ పెరుగుతుంది. దీని వల్ల పొట్ట చుట్టూ రక్తప్రసరణ తగ్గి జీర్ణవ్యవస్థ పనితీరు మందగిస్తుంది.

భోజనంకాగానే వెంటనే టీ తాగొద్దు. తేయాకులో ఉండే ఆమ్లాలు ఆహారంలో ఉండే మాంసకృత్తులను శరీరం వినియోగించకుండా అడ్డుకుంటాయి.

భోజనం చేసేముందుగానీ, చేశాకగానీ పండ్లు తినకూడదు. పొట్ట పెరుగుతుంది. రెండింటికీ మధ్య రెండు మూడు గంటల విరామం ఉండాలి.

అన్నం తిన్న వెంటనే నిద్రపోకూడదు. అలా చేస్తే తిన్న ఆహారం జీర్ణం కాదు. సమస్యలు తలెత్తుతాయి.

పైనాపిల్ ప్యాక్



మేని మెరుపుకోసం మహిళలు చేయని ప్రయత్నం ఉండదు. కాస్మోటిక్ క్రీమ్స్ దగ్గర నుంచి పార్లర్ల చుట్టూ ప్రదక్షిణలు చేసి చేసి తమ అందాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తూనే ఉంటారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా మెరుపు తాత్కాలికమే అవుతున్నప్పుడు మరింత జాగ్రత్త అవసరం. దానికోసం కాస్త సమయం కేటాయిస్తే చాలు.. నిగారించే మెరుపు మీ సొంతమైపోతుంది. ప్రయత్నించండి.

కావాల్సినవి : పైనాపిల్ గుజ్జు; 3టేబుల్ స్పూన్లు, కొబ్బరి పాలు, 2 టేబుల్ స్పూన్స్, స్వచ్ఛమైన తేనె పావు స్పూన్.

తయారీ :

ముందుగా పైనాపిల్ గుజ్జును ఓ గిన్నెలోకి తీసుకోవాలి. అందులో కొబ్బరి పాలు, తేనె కలుపుకొని బాగా మెత్తగా చేసుకోవాలి. తరువాత చల్లని నీళ్లతో ముఖం కడుక్కుని ఓ 3,4 నిమిషాలు ఆవిరి పట్టుకోవాలి. మెత్తటి గుడ్డతో ముఖం తుడుచుకుని ఈ మిశ్రమన్ని రాసుకోవాలి. అరగంట తరువాత గోరువెచ్చని నీళ్లతో ముఖం కడుక్కుంటే సరిపోతుంది. ఇలా వారం రోజులు క్రమం తప్పకుండా చేస్తే ముఖానికి మంచి మెరుపు, నిగారింపు వస్తుంది.

ఇలా సర్దుకోండి...

బీరువాలో ఎన్ని దుస్తులున్నా ...సమయానికి ఏం వేసుకోవాలో అర్థంకాక తలలు పట్టుకునేవాళ్లు చాలామందే ఉంటారు. గందరగోళంగా గజిబిజిగా పెట్టుకుంటే ఇలాంటి సమస్య తప్పదుమరి. బట్టలన్నీ పొందికగా సర్దుకుంటే పరిష్కారం దొరుకుతుంది.

* వస్త్రాల రకాలు, రంగులను బట్టి వేర్వేరుగా సర్దుకోండి.
* కొన్ని డ్రస్సులను ఎప్పుడోగానీ వేసుకోం. పడేయాలంటే మనసొప్పదు. అలాంటివాటిని అప్పుడప్పుడూ వేసుకుని తీసేయడం మంచిది.
* అన్ని రకాల దుస్తులనూ ఒకే దగ్గరపెడితే తికమక పడతారు. ఆఫీసుకీ, వేడుకలకూ, రోజూ వేసుకోవడానికీ ..ఇలా విభజించుకొని సర్దుకోవాలి. బట్టలు కొనడానికి వెళ్లేటపుడు ఏరకం దుస్తులు మీ దగ్గర ఉన్నాయో అర్థం అవుతుంది. ఏది అవసరమో అదే కొనే వీలుంటుంది.
* రంగులవారీగా సర్దుకుంటే దుస్తుల ఎంపిక సులభమౌతుంది. ఒక్కోసారి ఒకే రంగు ఉన్న బట్టలను కొనేస్తుంటాం. ఇంటికొచ్చాక అయ్యో అనుకునేకంటే ఇలా సర్దుకుంటే బాగుంటుంది.
* చున్నీలు, లెగ్గింగ్‌లను విడిగా సర్దిపెట్టుకోవాలి. కొత్తగా టాప్ కొంటే ఏవి సరిపోతాయో వెంటనే తెలుస్తుంది.
* హ్యాంగర్లకు లింక్స్ మార్కెట్లో దొరకుతున్నాయి. వాటిని తగిలించుకుంటే ఒకదానికే రెండు జతల బట్టల్ని తగిలించుకోవచ్చు.



బెదిరిస్తున్న వారి పేర్లు బయటపెట్టు

మన తెలంగాణ/హైదరాబాద్ : రైతులకు కనీస మద్దతు ధర అడిగినందుకు తనను అరెస్టు చేస్తామని బిజెపి ప్రభుత్వం బెదిరిస్తుందని పదే పదే చెబుతున్న సిఎం కెసిఆర్, బెదిరిస్తున్న వారి పేర్లను ప్రజలకు తెలియజేయాలని బిజెపి నాయకులు ఎన్. ఇంద్రసేనారెడ్డి డిమాండ్ చేశారు. ప్రధాని మోడి, హోంమంత్రి రాజానాథ్ సింగ్ నుంచి ఫోన్లు వచ్చాయా..? .లేదా ఇంకేవరైనా నేతలు బెదిరించారా వెంటనే సమాధానమివ్వాలని, లేదంటే బెదిరించిన వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సర్వేలో టిఆర్‌ఎస్ ఓడిపోతున్నట్లు సంకేతాలు వచ్చాయని, ఓటమి భయంతోనే కెసిఆర్ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కేవలం సానుభూతి కోసమే ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

సుప్రీంలో కార్తీ పిటిషన్

ఢిల్లీ : ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో ఇడి తనకు జారీ చేసిన సమన్లపై మాజీ కేంద్రమంత్రి పి.చిదంబరం తనయుడు కార్తీ చిదంబరం సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరగనుంది. సిబిఐ నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ ఆధారంగా సమన్లు జారీ చేసే అధికారం ఇడికి లేదని కార్తీ తన పిటిషన్‌లో కోర్టుకు విన్నవించారు.



బిసి గురుకులాలకు రూ.20 కోట్లు

మన తెలంగాణ / హైదరాబాద్ :గురుకుల విద్యాసంస్థల సొసైటీకి ప్రభుత్వం రూ. 20 కోట్లు మంజూరు చేసింది. బిసి గురుకుల పాఠశాలలు / జూనియర్ కాలేజీలకు ఈ నిధులను ఖర్చు చేస్తారు. ఈ మేరకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి బి.వెంకటేశం సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ గురుకుల విద్యాసంస్థల సొసైటి సహాయ పథకం కింద 2017—18 బడ్జెట్ నుండి ఈ నిధులు విడుదల చేశారు. \

క్రీడల్లో తెలంగాణ పోలీసులు భేష్



మన తెలంగాణ/హైదరాబాద్:శాంతి భద్రతల పరిరక్షణ సమర్ధవంతంగా నిర్వహించడంతో పాటు క్రీడల్లోను ప్రతిభాపాటవాలు చాటుకున్న తెలంగాణ పోలీసు సిబ్బంది అభినందనీయులని డిజిపిమహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. చెన్నైలో గత నెల 24—28 తేదీల్లో జరిగిన ఆల్ ఇండియా పోలీసు డ్యూటీ మీట్—2017లో పతకాలు సాధించిన పోలీసు సిబ్బందిని ఆయన తన కార్యాలయంలో సోమవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ..ఆల్ ఇండియా పోలీసు డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీసు లు సత్తా చాటడం గర్వంగా ఉందన్నారు. ఇదే ప్రతిభాపాటవాలు మునుముందు కూడా కొనసాగించాలన్నారు. నిరంతరం విధినిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బందికి క్రీడలు మానసిక ఒత్తిడులను దూరం చేస్తాయన్నారు. పోలీసు శాఖ క్రీడాకారులను ప్రోత్రహిస్తుందన్నారు. పోలీసు డ్యూటీమీట్‌లో తెలంగాణ పోలీసులుతొమ్మిది పతకాలు సాధించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పోలీసు కమిషనర్ వి.వి.శ్రీనివాస్‌రావుతో పాటు పతకాలు సాధించిన పోలీసులతో పాటు పలువురుఅధికారులు ఉన్నారు.

మౌలానా నసీరుద్దీన్ అరెస్టు, విడుదల

సిరియాలో దాడులు ఆపాలంటూ డిమాండ్

మన తెలంగాణ/హైదరాబాద్ : వాహిదత్—ఇ—ఇస్లామి సంస్థ అధ్యక్షుడు మౌలానా నసీరుద్దీన్‌ను సైదాబాద్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి సాయంత్రం వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. సిరియా దేశానికి ఇరాన్ ఇస్తున్న మద్దతును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బంజారాహిల్స్‌లోని ఇరాన్ కాన్సులేట్ కార్యాలయంను ముట్టడించేందుకు వెళ్తుండగా పోలీసులు ఆయన్ని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ, ఇరాన్ ఇస్తున్న మద్దతు వల్లనే సిరియాలో తమ వర్గానికి చెందిన ప్రజలు మృత్యువాత పడుతున్నారని, అక్కడ జరుగుతున్న అల్లర్లకు పరోక్షంగా ఇరాన్ బాధ్యత వహించాలని, వెంటనే సిరియాలో అల్లర్లను ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. గుజరాత్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను రెచ్చగొడుతున్నాడనే నేరంపై నసీరుద్దీన్‌ను 2004లో గుజరాత్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అప్పట్లో అతను నడిపిస్తున్న టిటిఎస్‌ఐ సంస్థను ప్రభుత్వం నిషేధించింది. ఏడేళ్లపాటు అక్కడి సబర్మతి జైలులో గడిపిన నసీరుద్దీన్ 2011లో విడుదలై వచ్చారు. అప్పటి నుంచి వాహిదల్—ఇ—ఇస్లామి సంస్థను ఏర్పాటు చేసి నడిపిస్తున్నారు. అయితే ఇటీవల సిరియాలో జరుగుతున్న అల్లర్లపై ఆయన కలత చెందారు. అల్లర్లను ఆపాలంటూ సిరియాకు ఇస్తున్న మద్దుతను ఇరాన్ ఉపసంహరిచుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



మనతెలంగాణ/న్యూఢిల్లీ: ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర, జై కెసిఆర్, జై భారత్ నినాదంతో పెద్దపల్లి జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ ఆధ్వర్యంలో పలువురు అభిమానులు, కార్యకర్తలు సోమవారం సిఎం కెసిఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. దేశానికి కెసిఆర్ దిక్సూచిగా మారాలంటూ నాయకులు నినాదాలు చేశారు. అనంతరం పెద్దపల్లి గ్రంధాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ మాట్లాడుతూ జాతీయ పార్టీలతో సాధ్యం కానిది ప్రాంతీయ పార్టీలతో సాధ్యం అయ్యేలా చేయగల సత్తా ఉన్న నేత సిఎం కెసిఆర్ అని అన్నారు. వివిధ రాష్ట్రాలు, కేంద్రం మన్నలు పొందిన ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. ఆయన సారధ్యానికి వివిధ పార్టీలు కూడా మద్దతు పలుకుతున్నాయని తెలిపారు.

పోస్టుల భర్తీపై హైకోర్టులో వాదనలు

మన తెలంగాణ/హైదరాబాద్: ట్రాన్స్‌కో,మెడికల్ శాఖల్లోవివిధ పోస్టుల భర్తీ సమయంలో తాత్కాలిక, ఒప్పంద కార్మికులకు ప్రాధాన్యత ఇస్తూ వెయిటేజీ మార్కులు ఇవ్వడాన్ని సవాల్ చేసిన పలు రిట్ పిటిషన్లపై సో మవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. నేడు సమయం సరిపోకపోవడంతో కేసు ప్రాధాన్యత దృష్ట్యా బుధవారం సమగ్రంగా విచారణ కొనసాగిస్తామని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మి లతో కూడిన డివిజన్ బెంచ్ ప్రకటించింది. తాత్కాలిక, ఒప్పంద ప్రాతిపదికపై ఉద్యోగాలు చేసేవారికి వెయిటేజీ మా ర్కులు ఇస్తే పోటీపరీక్షల్లో ప్రతిభ చూపేవారికి తీరనిఅన్యాయం జరుగుతుందన్నది పిటిషనర్ల లాయర్ వాదన. సుప్రీంకోర్టు కూడా పోటీపరీక్ష ల్లో అందర్నీ సమానంగానే చూడాలని,వెయిటేజీ మార్కులు ఇవ్వడం చె ల్లదని చెప్పిందని ఆయన చెప్పారు.విచారణ7వ తేదీకి వాయిదా పడింది.

నిఘా, కూంబింగ్

(మొదటిపేజీ తరువాయి)

చేయడంతో కలెక్టర్ కార్యాలయాల భద్రతపై డిజిపి మహేందర్‌రెడ్డి ఆయా జిల్లాల ఎస్‌పిలు, కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. భద్రత లేని కార్యాలయాల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. కలెక్టర్లు, తహసీల్దార్లు, ఇతర ప్రభుత్వ విభాగాలకు చెందిన ముఖ్య అధికారులతో పాటు టిఆర్‌ఎస్ పార్టీ నేతలను పోలీసులు అప్రమత్తం చేశారు. ఒకప్పుడు మావోయిస్టు ప్రాబల్యం ఉన్న ప్రాంతాలలో పర్యటించే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రచారం చేసే సమయాన్ని చూసి మావోయిస్టులు తెగబడే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్‌వర్గాలు ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. ఈ నేపథ్యంలో పోలీసులు మావోయిస్టుల కదలికలపై మరింత దృష్టి సారించారు. ముఖ్యంగా సరిహద్దులో నిఘాతో పాటు కూంబింగ్‌ను మరింత పటిష్ఠ పరిచేందుకు పోలీసు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. దీంతో పాటు పట్టణ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ నగరంపై కూడా దృష్టి సారించారు. ఇలాంటి ఎన్‌కౌంటర్లు జరుగడం, మావోయిస్టుల నుంచి హెచ్చరికలు వస్తాయని ముందే ఊహించిన ప్రభుత్వం మూడేళ్ల క్రితమే మంత్రులకు ఏ ప్రభుత్వంలో లేనివిధంగా ముందు వెనకాల పోలీసు ఎస్కార్టును ఏర్పాటు చేసింది.

అధికారంలోకి వస్తే అభయహస్తం పునరుద్ధరణ

- ఏక కాలంలో రైతు రుణాలు మాఫీ
- కొడుకును సిఎం చేసేందుకే 'మూడవ ఫ్రంట్'
- పిసిసి అధ్యక్షుడు ఉత్త్‌మ్‌కుమార్‌రెడ్డి



మన తెలంగాణ/నందిపేట (నిజామాబాద్ జిల్లా): అధికారంలోకి వచ్చి నాలుగేళ్లైనా ఏనాడు రైతును గురించి మాట్లాడని సిఎం కెసిఆర్‌కు ఎన్నికలు సమీపిస్తుండడంతోనే వారి కష్టాలు కనబడుతున్నాయా అని టిపిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాచైతన్య బస్సుయాత్ర సోమవారం నందిపేట మండల కేంద్రానికి చేరింది.ఈ యాత్రకు నందిపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ,ఎన్‌ఎస్‌యుఐ ఆధ్వర్యంలో సుమారు వేల బైక్‌లతో దాస్‌నగర్ నుండి నందిపేట వరకూ ర్యాలీ నిర్వహించి భారీ స్వాగతం పలికారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బారీ బహిరంగసభలో ఉత్తమ్‌కుమాన్‌రెడ్డి మాట్లాడుతూప్రగతిభవన్ పేరుతో విలాసవంతమైన ఇల్లు కట్టుకుని ఖరీదైన కార్లతో తిరుగుతూ రాష్ట్రాన్ని నలుగురూ కలిసి దోచుకతింటున్నారన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే రైతులకు మే నెల నుండి ఎకరాకు 4 వేల ఇస్తామంటూ రైతులను మోసం చేసేందుకు మైండ్ గేమ్ ఆడుతున్నాడని అన్నారు. రైతులపై అంతగా ప్రేమే ఉంటే నాలుగేళ్ళుగా ఎందుకు పెట్టుబడి సహాయం అందించలేదని ప్రశ్నించారు.లంచం అడిగితే చెపుతో కొట్టండని చెప్పిన నీవు రైతు మద్దతు ధర కొరకు నిలదీస్తే ఎందుకు సంకెళ్ళు వేయించావని,అప్పుడు నీకంటికి వారు రైతుల్లా కనబడలేదా అని ప్రశ్నించారు. డిసెంబర్ తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, పార్టీ అధికారంలోకి రాగానే అభయహస్తం పథకాన్ని పునరుద్ధరించి వారికి రూ.500 నుండి 1000కి పెం చుతామన్నారు. మహిళా సంఘాలకు లక్ష రూపాయల రివాల్వింగ్ ఫండ్ ఇస్తామన్నారు. రైతులకు ఏకకాలంలో 2 లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామన్నారు. వరి, మొక్కజొన్న, సజ్జలకు వేలకు తగ్గకుండా మద్ద తు ధరను అందిస్తామన్నారు. సోయాకు 3 వేలకు తగ్గకుండా, ఎర్రజొన్నకు 3వేలు, పత్తి కి 6వేలు, పసుపు, మిర్చికి 10వేలకు తగ్గకుండా మద్ద తు ధరను అందిస్తామన్నారు. మేము చేస్తున్న ఈ బస్సుయాత్ర కు మంచి స్పందన వస్తుందని రానున్న ఎన్నికల్లో 9 అసెం బ్లీ నియోజకవర్గాలతో పాటు 2 పార్లమెంటు నియోజకవర్గాలుకూడా గెలుచుకుంటామని ఆయన దీమా వ్యక్తం చేశారు.

ఢిల్లీ డ్రామా : బంగారు తెలంగాణ చేస్తానని చెప్పి తెలంగాణాను బర్‌బాత్ చేసావ్...ఇంక ఢిల్లీలో ఏం పీకుతావ్ అంటూ ఎఐసిసి కార్యదర్శి వి. హనుమంతరావ్ సిఎం కెసిఆర్ ఉద్దేశించి ఎద్దేవా వేశారు. తండ్రి చేసిన తప్పిదాలు కొడుకు కెటిఆర్ ఎత్తిచూపితే ఇక రాష్ట్ర ప్రజలు తనను ఎక్కడ చీదరించుకుంటారోనని కొడుక్కి సిఎం సీటు ఇచ్చేందుకు ఢిల్లీ డ్రామా ఆడుతున్నాడన్నారు. డైలాగులతో నాలుగేళ్ళు తెలంగాణ ప్రజలను మోసం చేసిన కెసిఆర్ పెద్ద అబద్దాల కోరన్నారు. బంగారు తెలంగాణ చేస్తానని తాగుబోతుల తెలంగాణ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి ఆకుల లలిత, షబ్బీర్ అలీ, మాజీ స్పీకర్ సురేష్‌రెడ్డి , మాజీ మంత్రులు సుదర్శన్, గడుగు గంగాధర్ మండల పార్టీ అధ్యక్షులు నర్సాగౌడ్, పెంట ఇంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

బిజెపి ప్రగతిభవన్ ముట్టడి యత్నం



మన తెలంగాణ/హైదరాబాద్: ప్రధాని నరేంద్రమోడీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సిఎం కెసిఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బిజెపి నాయకులు హైదరాబాద్‌లో సోమవారం ప్రగతి భవన్ ముట్టడి యత్నం చేశారు. ముట్టడికి ప్రయత్నించిన బిజెపి శ్రేణు లను పోలీసులు అరెస్టు చేశారు. కాగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మ ణ్, బిజె ఎల్పి నేత జి.కిషన్‌రెడ్డి, ఎంఎల్‌ఎ రాజా సింగ్‌లను హౌస్ అరెస్ట్ చేశారు. ఎంఎల్‌సి ఎన్.రాంచంద్రరావును ముందుగా హౌస్‌అరెస్ట్ చేసి ఆ తర్వాత ఆయనను అదుపులోనికి తీసుకున్నారు. కాగా ప్రగతిభవన్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించిన ఎంఎల్‌ఎ చింతలరాంచంద్రారెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ బద్దం బాల్‌రెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి,చాయదేవి తదితరులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు అక్కడే రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. అనంతరం పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. ఆ తర్వాత వివిధ ప్రాంతాల నుంచి ప్రగతిభవన్ వైపు వచ్చేందుకు ప్రయత్నించిన కప్పర ప్రసాద్, కళావతి, అరుణజ్యోతి తదితరులను పోలీసులు అరెస్టు చేశారు.

క్షమాపణ చెప్పేంత వరకు పోరాటం ఆగదు : లక్ష్మ ణ్

తెలంగాణ రాష్ట్రాన్ని నియంతృత్వ ప్రభుత్వం రాజ్యమేలుతోందని, ప్రజా సమస్యలపై నిలదీస్తే టిఆర్‌ఎస్ ప్రభుత్వం అణచివేతకు పాల్పడుతోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మ ణ్ ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో చలో ప్రగతి భవన్‌కు పిలుపునిస్తే బిజెపి కార్యకర్తలను, నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. ప్రశ్నించేవారే ఉండొద్దనే ఉద్దేశంతోనే సిఎం కెసిఆర్ ప్రతిపక్షాల గొంతులను నొక్కుతున్నారని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోనే ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, రాష్ట్ర సమస్యలనే తీర్చలేని కెసిఆర్, ఇక దేశాన్ని ఎలా ఉద్ధరిస్తారని ప్రశ్నించారు. మోడికి కెసిఆర్ క్షమాపణ చెప్పవరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు.

కెసిఆర్‌ను తెరపైకి తెచ్చింది బిజెపియే

మన తెలంగాణ/ హైదరాబాద్ : ప్రధాని మోడీకి వ్యతిరేకంగా ఎపి సిఎం చంద్రబాబు కూటమి కడతారనే భయం తోనే తెలంగాణ సిఎం కెసిఆర్‌ను బిజెపి తెరపైకి తెచ్చిందని కాంగ్రెస్ ఎంఎల్‌ఎ ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. బిజెపి రహస్య ఎజెండాలో భాగంగానే సిఎం కెసిఆర్ జాతీయ రాజకీయాలను తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. గాంధీ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి తమతో పొత్తు వద్దనుకుంటుంది అని ఇటీవలే చంద్రబాబునాయుడు ప్రకటన చేశారని, వెంటనే రాజకీయ సమీకరణలు చోటు చేసుకున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఐదారు శాతం ఓటు బ్యాంకు ఉన్న కాంగ్రెస్‌తో టిడిపి కలుస్తుందని ఇంటలిజెన్స్ నిఘా వర్గాలు కేంద్రానికి వెల్లడించాయన్నారు. కాంగ్రెస్‌కు దక్షిణాదిలో వందకు పైగా సీట్లు వచ్చే అవకాశముంటే,బిజెపికి 30 నుంచి 40 సీట్లు వచ్చే అవకాశముందని, ఇలాంటి సమయంలో చంద్రబాబు కూటమి కడితే తమకు కష్టమని బిజెపి అధిష్ఠానం భావించిందని చెప్పారు. అందుకే కెసిఆర్‌ను ఫ్రంట్ పేరుతో ముందుకు తీసుకొచ్చే ప్రయ త్నం చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు సిఎంకెసిఆర్ మూడవ ప్రత్యామ్నాయం అంటున్నారని అన్నారు.

లక్ష్మ ణ్ హౌస్ అరెస్టు



మన తెలంగాణ/ముషీరాబాద్ : ప్రధాన మంత్రి నరేంద్రమోడి పై సిఎం కెసిఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ప్రగతిభవన్ ముట్టడిలో భాగంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, ముషీరాబాద్ నియోజకవర్గం శాసనసభ్యుడు లక్ష్మ ణ్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేసారు. చిక్కడపల్లిలోని తన కార్యాలయంలో సోమవారం ఉదయం 8:30 గంటల నుంచే లక్ష్మ ణ్ కార్యాలయాన్ని దిగ్బంధించిన పోలీసులు ఆయన్ను బయటకు రానివ్వకుండా కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే డాక్టర్.కె.లక్ష్మ ణ్ మీడియాతో మాట్లాడుతూ సీఎం కెసిఆర్ తన ప్రసంగంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడిపై వ్యాఖ్యలు చేసినా కూడా చేయలేదనడంలో అర్థం లేదన్నారు.

రాష్ట్రాల పరిధిలో కోటా

(మొదటిపేజీ తరువాయి)

పట్టుబట్టడంతో పాటు, ఇతర పార్టీలు వేరు వేరు అంశాలపై ఆందోళన నిర్వహించడంతో సభ మంగళవారానికి వాయిదా పడింది. అనంతరం టిఆర్‌ఎస్ ఎంపిలు జితేందర్ రెడ్డి, వినోద్‌లు మాట్లడుతూ రిజర్వేషన్ల అంశంపై మంగళవారం కూడా పార్లమెంట్‌లో ఆందోళన కొనసాగుతుందని ప్రకటించారు. ఉదయం 10.30 గంటలకు పార్లమెంట్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేయనున్నట్లు వారు చెప్పారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను కేటాయించుకునే హక్కు రాష్ట్రానికే ఉండాలని జితేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. దానికోసం ఆర్టికల్ 16(4)ను సవరణ చేయాలన్నారు. రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టుకు ఎలాంటి సంబంధం లేనందున ఈ సమస్యకు పరిష్కారం పార్లమెంటే చూపాలని కోరారు. ఆర్టికల్ 16(4)ను సవరిస్తూ రిజర్వేషన్ల అమలుపై పూర్తి అధికారం రాష్ట్రాలకే ఇవ్వాలని ఆయన కోరారు. రాజస్థాన్, హర్యానా, ఎపిలు కూడా రిజర్వేషన్‌పై తీర్మానాలు ఇచ్చాయని చెప్పారు. 70 ఏళ్లలో బిజెపి, కాంగ్రెస్ దేశానికి నష్టం చేశాయని స్పష్టం చేశారు. దేశ అభివృద్ధికి ప్రత్యామ్నాయం అవసరం అనేదే సిఎం కెసిఆర్ ఆలోచన అని పేర్కొన్నారు. విభజన చట్టంలోని బయ్యారం స్టీల్ ప్లాంట్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఎయిమ్స్ సహా చాలా అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని, రానున్న రోజులలో వాటి సాధన కోసం పార్లమెంటులో పోరాటం చేస్తామని ప్రకటించారు. కేంద్రం రాష్ట్రానికి ఏం ఇస్తుందో స్పష్టంగా చెప్పాలి, రోజుకో డ్రామా ఆడడం సరికాదని మండిపడ్డారు. వినోద్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా చదవులు, ఉద్యోగాల్లో ఒక్కో రాష్ట్రానికి ఒక్కో విధంగా రిజర్వేషన్లు ఉన్నాయని అన్నారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత తెలంగాణలో మైనార్టీలు, ఎస్‌టిల సంఖ్య పెరిగిందని, అందవల్ల వారికి రిజర్వేషన్లు పెంచాలని అసెంబ్లీలో తీర్మానం చేసి గవర్నర్‌కు పంపామని వెల్లడించారు. రాజ్యాంగంలోని 9 షెడ్యూల్లో ఈ అంశాన్ని పొందుపర్చాలని కేంద్రాన్ని కోరామన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనపై ఇప్పటి వరకు కేంద్రం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ సవరణ చేసి ఈ అంశాన్ని 9వ షెడ్యూల్‌లో పొందుపర్చాలని డిమాండ్ చేశారు. కానీ, కేంద్రం ఈ అంశంపై సానుకూలంగా లేనందున రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేసి పంపిన తీర్మానాన్ని కేంద్రం నొక్కి పెట్టినందునే ఈ అంశంపై లోక్‌సభలో వాయిదా తీర్మానం ప్రవేశపెట్టామని జితేందర్ రెడ్డి వెల్లడించారు. తమ నిరసనలనతో సోమవారం రెండుసార్లు స్పీకర్ సభను వాయిదా వేశారన్నారు. సిఎం కెసిఆర్ సమక్షంలో జరిగిన భేటీలో రిజర్వేషన్ల అంశంపై పోరాడాలని నిర్ణయించామని, రానున్న రోజుల్లో రిజర్వేషన్ల అంశంపై స్పష్టత వచ్చే వరకు సక్‌సభను స్తంభింప చేస్తామని ప్రకటించారు. ఇదిలా ఉండగా, బిజెపి, కాంగ్రెస్ పార్టీలు దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాయని టిఆర్‌ఎస్ ఎంపి కవిత ట్వీట్ చేశారు. విభజన హామీలపై ఆంధ్రప్రదేశ్ సభ్యులు ఆందోళన చేశారని, అదే విధంగా కావేరీ జలాల వివాదంపై తమిళనాడు ఎంపిలు తమ నిరసనను వినిపించారని కవిత తెలిపారు. ఈ సమస్యలపై ప్రధాని నరేంద్ర మోడీ స్పందించాలని కవిత డిమాండ్ చేశారు.

మంతనాలు..మేధామథనాలు

(మొదటిపేజీ తరువాయి)

నిపుణులతోనూ సమావేశం కావాలని భావిస్తున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. హైదరాబాద్‌తో మొదలుపెట్టి ఢిల్లీ, కోల్‌కతా, ముంబాయి, చెన్నయ్, బెంగుళూరు తదితర నగరాల్లోనూ సమావేశాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నాయి. వివిధ రంగాలకు చెందినవారితో భేటీలు కావాలని నిర్ణయించినందువల్ల ఇందుకోసం ప్రత్యేకంగా సమన్వయకర్తలు (కోఆర్డినేటర్స్)ను కూడా ఇప్పటికే నియమించినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. జాతీయ స్థాయిలోనే ప్రత్యామ్నాయ రాజకీయ ఫ్రంట్ కాబట్టి వివిధ రాష్ట్రాల్లోనూ పర్యటించి అక్కడి ప్రాంతీయ పార్టీ నేతలను కలవడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రత్యామ్నాయ ఫ్రంట్‌కు ఒక నిర్దిష్ట రూపు తీసుకురావడానికి, ఎజెండా తయారీకి, భవిష్యత్ ప్రణాళికకు కసరత్తు ప్రారంభించారు. ఇందుకోసం వరుస సమావేశాలను నిర్వహించాలని, ప్రతీ రంగాన్ని స్పృశించాలని భావిస్తున్నారు. తొలుత పదవీ విరమణ చేసిన కేంద్ర సివిల్ సర్వీసు అధికారుల (ఐఏఎస్, ఐపిఎస్, ఐఎఫ్‌ఎస్, ఐఆర్‌ఎస్ తదితర సర్వీసులు)తో సమావేశమై దీర్ఘకాలం పాటు వివిధ రాష్ట్రాల్లో, దేశ రాజధానిలో, వివిధ సంస్థల్లో ఉన్నత హోదాల్లో పనిచేసిన అనుభవం, పథకాల రూపకల్పన, వాటి అమలు, లభించిన ఫలితాలు, లోపాలు, సవరణకు ఉన్న అవకాశాలు.. ఇలా అనేక కోణాల నుంచి చర్చించనున్నారు. నూతన ఫ్రంట్ ఎజెండా తయారీలో ఇవన్నీ కీలకాంశాలు కానున్నందున తొలుత వీటిపై దృష్టి సారిస్తున్నారు. ఆ తర్వాత సైనిక, వాయు, వైమానిక రంగాల్లోని అధికారులు, ఉన్నత ఉద్యోగులతో కూడా సమావేశమై క్షేత్రస్థాయి ఇబ్బందులు, ప్రస్తుతం అందుతున్న సౌకర్యాలు, అదనంగా అవసరమైనవి, మార్పులు చేర్పుల అవసరం.. ఇలా అనేక విషయాలను చర్చించనున్నట్లు సమాచారం. న్యాయ వ్యవస్థకు సంబంధించి న్యాయ నిపుణులు, పేరు గడించిన న్యాయవాదులు, రాజ్యాంగ నిపుణులు.. ఇలా పలువురితో భేటీ కానున్నారు. అఖిల భారత రైతు సంఘాల ప్రతినిధులతో పాటు వివిధ రాష్ట్రాల్లోని రైతుసంఘాల ప్రతినిధులతోనూ సమావేశమై వ్యవసాయరంగానికి సంబంధించిన అంశాలపై చర్చించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులతోనూ, పారిశ్రామికవేత్తలతోనూ, వాణిజ్యమండళ్ళ ప్రతినిధులతోనూ, కార్మిక సంఘాల ప్రతినిధులతోనూ సమావేశం కానున్నారు. అనేక ర్గాల ప్రతినిధులతో వరుస సమావేశాల నిర్వహణకు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభమయ్యాయని, ఇందుకోసంసమన్వయకర్తలను కూడా నియమించినట్లు సిఎం కార్యాలయ వర్గాలు తెలిపాయి. దేశ రాజకీయ వ్యవస్థనే సమూలంగా మార్చాలన్న ఆలోచనకు అనుగుణంగా ప్రతీ వర్గానికి చెందిన ప్రతినిధులతో మాట్లాడి మొత్తం దేశానికి అవసరమైన ఎజెండాను రూపొందించే బాధ్యతతో కార్యాచరణ రూపుదిద్దుకుంటోంది. ఆర్థిక అంశాలకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన కార్యదర్శులు, ఉన్నతాధికారులతో ప్రత్యేకం సమావేశాలు నిర్వహించనున్నారు.

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

సమావేశాలు ప్రారంభమవుతాయి. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వానికి పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇదే చివరి సారి అవుతుంది. వచ్చే ఏడాది కేవలం ప్రభుత్వ నిర్వహణ వ్యయాలు,జీతభత్యాల కోసం ఓటాన్ అకౌంట్‌ను మాత్రమే ప్రతిపాదించే అవకాశం ఉంటుంది. దీంతో ఈసారి బడ్జెట్‌లో అన్ని వర్గాలకు తాయిలాలను ఇచ్చే అవకాశముంది. వివిధ వర్గాలకు ఇచ్చే పెన్షన్‌ను పెంచనున్నట్లు, అలాగే నిరుద్యోగ భృతి ఇవ్వనున్నట్లు ఇప్పటికే సంకేతాలు వెలువడ్డాయి.

8 లేదా 9న క్యాబినెట్ భేటీ?

బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఈ నెల 8 లేదా 9వ తేదీలలో రాష్ట్ర మంత్రివర్గం భేటీ కానుంది. ఈ సమావేశంలో గవర్నర్ ప్రసంగంతో పాటు, బడ్జెట్ సమావేశాలలో ప్రవేశపెట్టే పలు బిల్లుల ముసాయిదాపై క్యాబినెట్ ఆమోద ముద్ర వేయనుంది. నూతన పంచాయతీరాజ్ బిల్లును కూడా బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నారు. ఈ సమావేశాలు జరిగే సమయంలోనే రాజ్యసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో క్యాబినెట్ భేటీలో దీనిపై కూడా చర్చించే అవకాశం ఉంది. ఈ నెల 10 లేదా 11వ తేదీలలో టిఆర్‌ఎస్ శాసనసభాపక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ఇటీవల జరిపిన నియోజకవర్గాల వారీ సర్వేల వివరాలు, రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

మిసా భారతికి బెయిల్ మంజూరు

ఢిల్లీ: మనీల్యాండరింగ్ కేసులో బిహార్ మాజీ సిఎం, ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్‌యాదవ్ కుమార్తె మీసాభారతికి,ఆమె భర్తకు సోమవారం బెయిల్ మంజూరైంది. సిబిఐ ప్రత్యేక కోర్టు మిసాభారతికి, ఆమె భర్తకు బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. మిసాభారతికి బెయిల్ మంజూరు కావడంపై ఆర్‌జెడి శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

సిఎంకు కొత్త బస్సు

(మొదటిపేజీ తరువాయి)

సునీల్‌శర్మ బాధ్యతలు నిర్వర్తించే ఈ కమిటీలో మరో ఏడుగురు అధికారులను సభ్యులుగా నియమిస్తూ కమిటీ ఏర్పాటైంది. కొత్త బస్సును సమకూర్చుకోడానికి సంబంధించి సాధారణ పరిపాలన శాఖకు ప్రతిపాదనలు పంపాలని ఈ కమిటీ నిర్ణయించింది. ముఖ్యమంత్రి కెసిఆర్ అధికారిక పర్యటనలకు ప్రస్తుతం వినియోగిస్తున్న బుల్లెట్ ప్రూఫ్ బస్సుకు కొత్తది అదనంగా ఉంటుంది. చత్తీస్‌ఘడ్ రాష్ట్ర సరిహద్దులో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్, మావోయిస్టు కార్యకలాపాలు తెలంగాణలో మళ్ళీ చోటుచేసుకునే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్‌వర్గాల నుంచి అందిన హెచ్చరికల నేపథ్యంలో ముక్యమంత్రి భద్రత కోసం ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. హోంశాఖ ముఖ్య కార్యదర్శి రాజీవ్ త్రివేది, ఆర్‌టిసి సంయుక్త ఎండి రమణారావు, ఇంటెలిజెన్స్ ఐజి నవీన్‌చంద్, ఇంటెలిజెన్స్ అండ్ సెక్యూరిటీ వింగ్ చీఫ్ ఎంకె సింగ్, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి అర్విందర్‌సింగ్, రవాణాశాఖ కమిషనర్‌లు సభ్యులుగా ఉండే ఈ కమిటీ నూతన బుల్లెట్ ప్రూఫ్ బస్సు తయారీపై ఈ సమావేశంలో కూలంకషంగా చర్చించింది. సుమారు ఏడు కోట్ల రూపాయలు ఖర్చు కావచ్చని అంచనా వేసిన ఈ కమిటీ రెండు నెలల వ్యవధిలో సమకూర్చుకోవాలని నిర్ణయించింది. ఇందుకోసం టెండర్లను ఆహ్వానించాలని భావించింది.ముఖ్యమం త్రి జిల్లాల అధికారిక పర్యటన నిమిత్తం ప్రస్తుతం వాడుతున్న బుల్లెట్ ప్రూ ఫ్ బస్సుకు మూడేళ్ళ క్రితం సుమారు నాలుగున్నర కోట్ల రూపాయలను వెచ్చించింది. చండీఘడ్‌కు చెందిన జెసిపిఎల్ కంపెనీ ఈ బస్సును తయారుచేసింది. కొత్త బుల్లెట్ ప్రూఫ్ బస్సు రూపకల్పనలో పాటించాల్సిన భద్ర తా ప్రమాణాలు, సమకూర్చాల్సిన సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక భద్రతా పరికరాలు తదితర పలు అంశాలపై ఈ కమిటీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంది. ముఖ్యమంత్రితో పాటు అధికారులు, భద్రతాసిబ్బంది తదితరులు కనీసం పన్నెండు మంది కూర్చునే సదుపాయంతో పాటు మినీ కాన్ఫరెన్సు హాల్, వైఫై సౌకర్యం,మరుగుదొడ్డి వసతి తదితరాలన్నీ ఉంటాయి.

వరంగల్ ఐటి మేటి

(మొదటిపేజీ తరువాయి)

దేశమో కాదని, కొత్తగా ఆలోచించడమే టెక్నాలజీ అని, అది కూడా పది మందికి ఉపాధి కల్పించేదిగా ఉండాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఐటి రంగాన్ని ప్రొత్సహిస్తోందన్నారు. యువత ఉద్యోగాల కోసం ఇతర దేశాలకు వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి కల్పించేదిగా ఉండాలన్నారు. వరంగల్ రానున్న రోజులలో ఐటి హబ్‌గా అభివృద్ధి చెందుతోందని, ఇక్కడే వేలాది మందికి ఉపాధి లభించబోతున్నదని, ఐటి రంగంలో శిక్షణ ఇవ్వడానికి ఇక్కడే టాస్క్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి మాట్లాడుతూ హైదరాబాద్‌ను ప్రపంచంలో అన్ని రంగాలలో అభివృద్ధి చేందే విధంగా ఐటి శాఖ మంత్రి కృషి చేస్తున్నారని, అదేవిధంగా రానున్న రోజులలో హైదరాబాద్ తరహాలో వరంగల్‌ను కూడా ఐటి రంగంలో అభివృద్ధి చేయాలని ఐటి మంత్రికి కడియం సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ గద్దల పద్మ, వరంగల్ ఎంపి పసునూరి దయాకర్, వరంగల్ నగర మేయర్ నన్నపునేని నరేందర్, ఎంఎల్‌సి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఎల్‌ఎలు అరూరి రమేష్, బానోత్ శంకర్‌నాయక్, తాటికొండ రాజయ్య, జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌ఆర్ విద్యా సంస్థల అధినేత వరదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధిలో దేశానికి రోల్‌మోడల్‌గా తెలంగాణ

మన తెలంగాణ/నవాబ్‌పేట్ : తెలంగాణా రాష్ట్రంలో గత దశాబ్దాలుగా నోచుకోని అభివృద్ధి కెసిఆర్ నాయకత్వంలోని తెలంగాణా ప్రభుత్వం కేవలం మూడున్నర సంవత్సరాలలో చేసి చూపించి అభివృద్ధిలో దేశానికి రోల్ మోడల్‌గా మారిందని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి పేర్కోన్నారు. సోమవారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాల్లో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదటగా మండల పరిధిలోని తీగల్‌పల్లి గ్రామంలో డబుల్ బెడ్‌రూంల నిర్మాణ పనులకు శంకుస్థాపన అనంతరం సిద్దోటం గేటు నుండి గ్రామంలోకి బిటి రోడ్డు పనులను ప్రారంభించారు. అక్కడినుండి కాకర్లపహాడ్ గ్రామంలో పార్టీ పతాకావిష్కరణ చేసి రుద్రారం గ్రామ శివార్లో డబుల్‌బెడ్‌రూంల నిర్మాణ పనులకు, రుద్రారం నుండి కొండాపూర్ గ్రామానికి బిటి రోడ్డు పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం కొండాపూర్ గ్రామంలో కమ్యూనిటీ భవనం, మండల కేంద్రంలో యువజన సంఘం మహిళా సమాఖ్య, కల్లుగీత కార్మికుల భవనాల పనులకు శంకుస్థాపనలు చేశారు. ఇప్పటూరు గ్రామంలో సబ్‌స్టేషన్, బిటి రోడ్డు పనులు,పాఠశాల అదనపు గదులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు ఎంపిపి శ్రీనయ్య, జెడ్‌పిటిసి ఇందిరాదేవి, బాలానగర్ జెడ్‌పిటిసి ప్రభాకర్‌రెడ్డి, మాడెమోని నర్సిములు, మార్కెట్ చైర్మన్ ముత్యాల రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో చెరుకు పంట దగ్ధం

మన తెలంగాణ/కోహీర్ : విద్యుదాఘాతంతో కోతకు వచ్చిన చెరుకు పంట, నీటి తడిని అందించే డ్రిప్ సామగ్రి పూర్తిగా కాలి బూడిదైన సంఘటన సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని రాజినెల్లి గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన ఈడిగి అమృతమ్మ, వెంకట్‌రామ్‌లు సర్వేనంబర్ 46 ఆలో 3 ఎకరాల 26 గుంటలు, సర్వే నంబర్ 46లో 1ఎకరం 33 గుంటల్లో డ్రిప్ ద్వారా చెరుకు తోటను సాగుచేశారు. చెరుకు కోతకు సిద్ధంగా ఉన్న తరుణంలో రాత్రి షార్ట్ సర్క్యూట్ మూలంగా చెరుకు తోటకు నిప్పంటుకుంది. చెరుకు తోట పూర్తిగా ఎండిపోయి ఉన్నందున మంటలు రేగుతూ ఉప్పెనలా ఎగిసిపడ్డాయి. చెరుకు తోట సాగుకు ఉపయోగిస్తున్న డ్రిప్, పైపులు, ల్యాటర్స్, ప్లాస్టిక్ పైపులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. గ్రామస్థులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చి మంటలను ఆర్పారు. అయితే అప్పటికే చెరుకు తోట, డ్రిప్ సామగ్రి కాలిపోయాయి. దీంతో బాధితులు ఆర్థికంగా నష్టాలకు గురికాక తప్పలేదు. సోమవారం ఉదయం మండల కేంద్రమైన కోహీర్‌లో బాధితులు తహసీల్దార్‌కు ఈ విషయమై వినతి పత్రం అందచేస్తూ తమకు కలిగిన నష్టాన్ని పూడ్చేలా చర్యలు తీసుకోవాలని, అప్పులు చేసి పంటను సాగుచేశామని, పంట పూర్తిగా కాలిపోవడంతో పెట్టిన పెట్టుబడులు బూడిదలో పోసిన పన్నీరయ్యాయని, ప్రభుత్వ సహకారం అందేలా చూడాలని కోరారు.

ఉత్తరాది పెత్తనంతోనే దక్షిణాది రాష్ట్రాల వెనుకంజ

మన తెలంగాణ/ హైదరాబాద్/ సోమాజిగూడ : దక్షణ భారత దేశంపై ఉత్తర భారతీయల ఆధిపత్యం వలనే దక్షణ భారత దేశం అభివృద్ధికి నోచుకోవడం లేదని దక్షణ భారత జెఎసి చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ ఆరోపించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి దక్షిణాది రాష్ట్రాలపై ఉత్తరాది పెత్తనం కొనసాగిస్తూ అభివృద్ధి చెందకుండా కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ముఖ్య మంత్రి కేసీఆర్ చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నట్టు తెలిపారు. ఆదాయం కేంద్రానికి చేకూర్చేది దక్షిణాది అయితే పెత్తనం చేసేది ఉత్తరాది వారు కావ డం వలన దక్షిణాది రాష్ట్రాలు కేంద్రం వద్ద ముష్టెత్తుకోవాల్సి వస్తుందని మండిపడ్డారు. కేంద్ర వైఖరిపై విసుగు చెందిన కెసిఆర్ తీసుకున్న నిర్ణయానికి సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. వైస్‌చైర్మన్ జి.షీబా రాజేందర్, కార్యదర్శిమహ్మద్‌జుబేర్, కోశాధికారి వరప్రసాద్, సాయి కార్తీక్ పాల్గొన్నారు.

అధికారుల చర్యతో రైతుకు గుండెపోటు

మృతదేహంతో ధర్నా నిర్వహించిన ప్రజలు

మన తెలంగాణ/కుల్కచర్ల : రైతు సాగు చేస్తున్న భూమిని స్వాధీనం చేసుకొని శాఖపరమైన చర్యలు తీసుకోవడంతో రైతు గుండెపోటుతో మృతి చెందాడు. అటవీ శాఖ అధికారుల తీరుపై మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తూ మృతదేహంతో చౌరస్తాపై ధర్నా నిర్వహించారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల పరిధిలోని చౌడాపూర్ గ్రామానికి చెందిన నర్సింహులు (50) గత కొన్ని సంవత్సరాలుగా అటవీ ప్రాంతం పక్కన ఉన్న భూమిని సాగు చేసుకుంటున్నాడు. అటవీ శాఖ అధికారులు సాగు చేస్తున్న భూమి ప్రభుత్వ పరిధిలోనిదంటూ శాఖపరమైన చర్యలు తీసుకున్నారు. దీంతో మనోవేదన చెందుతూ గుండెపోటు వచ్చి సోమవారం మృత్యువాత పడ్డాడు. దీంతో రైతులు, నాయకులు చౌరస్తాలో నర్సింహులు మృతదేహంతో ఆందోళన నిర్వహించి, తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. సుధాకర్ రెడ్డి, నాగరాజు, రాందాస్, మాసయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

మన తెలంగాణ / ఘట్‌కేసర్ (మేడ్చల్ జిల్లా) : మేడ్చల్ జిల్లాలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కీసర మండలం దమ్మాయిగూడ గ్రామానికి చెందిన వికాస్‌రెడ్డి (19), అవుషాపూర్ అనురాగ్ కళాశాలలో బిటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల ముగిసిన తర్వాత ఇంటికి వెళుతున్న క్రమంలో, అవుషాపూర్ జాతీయ రహదారి పై ఉన్న బస్ స్టాప్ వద్ద నిలుచున్నాడు. పికెట్ డిపోకు చెందిన బస్సు వచ్చింది. విద్యార్థులు అందరూ ఎక్కుతున్నారు.ఈ లోగా డ్రైవర్ నిర్లక్ష్యంగా ముందుకు నడిపించడంతో బస్సు ఎక్కుతున్న వికాస్‌రెడ్డి జారి బస్సు వెనుక చక్రాల కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై వికాస్‌రెడ్డి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బస్సు ఢీకొని..

మన తెలంగాణ/మేడ్చల్ జిల్లా : రోడ్డు ప్రమాదంలో పాఠశాల విద్యార్థి మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గౌడవెల్లి ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న గాదె వంశీ(13) పాఠశాల ముగిసిన తర్వాత నడుచుకుంటూ బాసిరెగడీలోని తన ఇంటికి వెళ్తుండగా మార్గ మధ్యంలో సాయివైష్ణవి జూనియర్ కళాశాలకు చెందిన బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా బస్సు నడిపించడంతో ఢీకొట్టింది. దీంతో వంశీకి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.

మూడో ప్రత్యామ్నాయం అవసరమే

కాంగ్రెస్, బిజెపిలు దేశాన్ని దోచుకుంటున్నాయి : డిప్యూటీ సిఎం కడియం శ్రీహరి

మన తెలంగాణ/వరంగల్‌బ్యూరో : దేశాన్ని కాంగ్రెస్, బిజెపి దోచుకుంటున్నాయని, ప్రజలకు సరియైన దశ,దిశా నిర్దేశం చేసే మూడో ప్రత్యామ్నాయం రావాల్సిన అవసరం ఉందని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. అందుకే ముఖ్యమంత్రి కెసిఆర్ మూడో ఫ్రంట్ రావాలని కోరుకుంటున్నారన్నారు. కెసిఆర్ వెంట తెలుగు ప్రజలు ఉండి మద్దతు తెలపాలని కడియం విజ్ఞప్తి చేశారు. వరంగల్ రూరల్ జిల్లా పరకాల నియోజకవర్గ కేంద్రంలో రాష్ట్ర ఐటి, పురపాలకశాఖ మంత్రి కెటిఆర్, పరకాల ఎంఎల్‌ఎ చల్లా ధర్మారెడ్డితో కలిసి వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా కెసిఆర్ పగ్గాలు చేపట్టిన నాలుగేళ్లలోనే ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇచ్చిన ఘనత తెలంగాణ రాష్ట్రానికే దక్కుతుందన్నారు. మరి దేశంలో 24గంటల కరెంటు ఎందుకు ఇవ్వరని ఆయన ప్రశ్నించారు. అదే విధంగా సాగుకు రైతులకు వ్యవసాయ పెట్టుబడి ఇవ్వనున్న మొట్టమొదటి రాష్ట్రం కూడా తెలంగాణయేనని కడియం అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులను ఆదుకునేందుకు రుణమాఫీని అమలు చేసిందని, కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రుణమాఫీని ఎందుకు చేయడంలేదన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా వచ్చే నెలలో పూర్తిగా ఇంటింటికీ రక్షిత తాగునీరు రానున్నదని ఆయన అన్నారు. ఐటి, పురపాలకశాఖ మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ సిఎం కెసిఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. గత



పాలకుల పాలనలో రైతులు ఎన్నో కష్టాలు పడ్డారన్నారు. వచ్చే జూన్ నాటికి ఇంటింటికికీ తాగునీరు అందిస్తామని, తెలంగాణ పుణ్యానే ప్రజలకు తాగు, సాగునీరు, 24 గంటల కరెంటు లభిస్తుందన్నారు. పరకాల ఎంఎల్‌ఎ చల్లా ధర్మారెడ్డి, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ గద్దల పద్మ, వరంగల్ ఎంపి పసునూరి దయాకర్, గ్రేటర్ వరంగల్ మేయర్ నన్నపునేని నరేందర్, ఎంఎల్‌ఎలు అరూరి రమేష్, తాటికొండ రాజయ్య, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పెద్ది సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తీరు మారని గురుకులాలు

- విద్యార్థులకు తప్పని వేధింపులు
- సౌకర్యాల లేమితో అవస్థలు
- బెల్లంపల్లిలో తరగతుల బహిష్కరణ, ధర్నా
- ఎంఎల్‌ఎను అడ్డుకున్న విద్యార్థులు



బెల్లంపల్లిలో ధర్నా చేస్తున్న గురుకుల పాఠశాల విద్యార్థులు

మన తెలంగాణ/మంచిర్యాల ప్రతినిధి : గురుకులాల్లో ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌ల తీరు మారడం లేదు. పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలని మెనూ ప్రకారం భోజనం పెట్టాల ని విద్యార్థులు అడిగితే వారిని వేధింపులకు గురి చేయడం పరిపాటిగా మారింది.ఉన్నత విద్యకు బాటలు వేయాల్సిన గురుకులాలు విద్యార్థులకు ఇబ్బందికరంగా మారతున్నాయి. ఓవైపు వార్డెన్ , ప్రిన్సిపాల్‌ల వేధింపులు భరించలేక విద్యార్థులు ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలు పాల్పడుతున్నప్పటికీ వారి తీరు మారడం లేదు. జిల్లాలో వరుసగా జరుగుతున్న సంఘటనలు గురుకుల పాఠశాలల లోపాలను బహిర్గతం చేస్తున్నాయి. మంచిర్యాల జిల్లాలో మంచిర్యాల, చెన్నూర్, లక్షెట్టిపేట, జైపూర్, బెల్లంపల్లిలలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. మందమర్రి పట్టణంలో గురుకుల పాఠశాల మంజూరైనప్పటికీ పక్కా భవనం లేని కారణంగా చెన్నూర్ పట్టణంలోనే బాలికల గురుకుల పాఠశాల భవనంలోనే కొనసాగిస్తున్నారు. అదే విధంగా కోటపల్లి మండలానికి బాలుర గురుకుల పాఠశాల మంజూరైనప్పటికీ అక్కడ సైతం పక్కా భవనం లేకపోవడంతో దీనిని జైపూర్ మండల కేంద్రంలోని ఒక అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. లక్షెట్టిపేటలో బాలికలు బెల్లంపల్లిలో బాలబాలికలకు వేర్వేరుగా రెండు గురుకుల పాఠశాలల పక్కా భవనంలో కొనసాగుతున్నాయి. మంచిర్యాలలో గత ఏడాది బాలుర గురుకుల పాఠశాలను ప్రారంభించగా భవనం లేని కారణంగా పాఠశాలను అద్దెభవనంలో కొనసాగిస్తున్నారు. తాజాగా సోమవారం బెల్లంపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులు సౌకర్యాలు కల్పించాలని, అదే విధంగా ప్రిన్సిపాల్, వార్డెన్‌ల వైఖరితో విసిగి పోయిన విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. సోమవారం బెల్లంపల్లిలోని తెలంగాణ గురుకుల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుల, ప్రిన్సిపాల్‌ల వేధింపులకు నిరసనగా తరగతులను బహిష్కరించి ధర్నా నిర్వహించారు. విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న బెల్లంపల్లి ఎంఎల్‌ఎ దుర్గం చిన్నయ్య నెన్నెల వైపు వెళ్తూ గురుకుల పాఠశాల వద్ద ఆగారు. దీంతో విద్యార్థులు ఎంఎల్‌ఎను చుట్టుముట్టి సమస్యలపై నిలదీసి, అడ్డుకున్నారు. ఈమేరకు స్పందించిన ఎంఎల్‌ఎ మాట్లాడుతూ పాఠశాలలోని సమస్యలను పరిష్కరిస్తామని ప్రిన్సిపాల్, వార్డెన్‌ల వైఖరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే వారిని సస్పెండ్ చేస్తామని హామీ ఇచ్చారు.

గురుకులాల్లో జరిగిన ఘటనలు

గత సంవత్సరం గురుకుల పాఠశాలల్లో ఎన్నో సంఘటనలు జరిగినప్పటికి అధికారుల తీరు మారడం లేదు. గురుకుల పాఠశాలల్లో అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ప్రిన్సిపాల్, వార్డెన్‌లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గత ఏడాది జూలై 14న జైపూర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి రాకేష్ రెండో అంతస్తు నుంచి జారీ పడి మృతి చెందాడు. జూలై 27న చెన్నూర్ గురుకులంలో మెట్లపై నుంచి జారిపడగా ఆకాంక్ష అనే విద్యార్థినీకి తీవ్ర గాయాలయ్యాయి. జూలై 28న జైపూర్ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థిని అఖిల తీవ్ర జ్వరంతో మృతి చెందింది. సెప్టెంబర్ 9న లక్షెట్టిపేట బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినుల మధ్య జరిగిన గొడవతో ఇద్దరు బాలికలు పురుగుల మందు తాగిన పరిస్థితి చోటు చేసుకుంది. ఇందులో సాయినిధి (14) మృతి చెందగా మరో విద్యార్థిని శిరీష ప్రమాదం నుంచి బయటపడింది. సెప్టెంబర్ 11న చెన్నూర్ గురుకులంలో హారతి అనే విద్యార్థినిని పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా వెంటనే ఆసుపత్రికి తరలించడంతో ప్రమాదం తప్పింది. గురుకులాల్లో వరుసగా జరుగుతున్న ఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు అధికారుల అలసత్వం, సిబ్బంది పర్యవేక్షణ లోపం కారణంగా విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.

మళ్లీ మొదటికి వచ్చిన సంగీత కేసు

సంగీతపై మరిది, మామ దాడి : పిఎస్‌లో ఫిర్యాదు కేసు నమోదు

మన తెలంగాణ/ బోడుప్పల్ : సుమారు రెండు నెలల పాటు తన అత్తింట్లోకి వెళ్లడానికి పోరాటం చేసి చివరకు కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల తో అత్తింట్లోకి ప్రవేశించిన పులకండ్ల సంగీతను ఆదివారం రాత్రి ఇంట్లో ఉండగా ఆమె మామ, మరిది దాడి చేశారని మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సంగీత తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం సాయంత్రం సమయంలో తను తన కుతురు అభిదను చుడడానికి తన తమ్ముడు రంజీత్ రెడ్డి వచ్చాడని అదే సమయంలో తన భర్త శ్రీనివాస్ రెడ్డి తమ్ముడు శ్రీధర్‌రెడ్డి, తన మామ బాల్ రెడ్డిలు తాను ఉంటున్న గదిలోకి వచ్చి తన తమ్ముడు ఇంటికి



ఎందుకు వచ్చావని దాడి చేశారని దానిని అడ్డుకునేందుకు వెళ్లిన తనపై దాడి చేసి పిడిగుద్దులు కురిపించారని ఆమె తెలిపింది. తనను చంపాలనే కుట్రతోనే మరిది, మామ బాగా తాగి వచ్చి భౌతిక దాడికి పాల్పడినట్లు తెలిపింది. కాగా, సంగీతపై దాడి చేసిన మరిది శ్రీధర్‌రెడ్డి, మామ బాల్ రెడ్డిపై మేడిపల్లి పిఎస్‌లో సంగీత ఫిర్యాదు చేసింది. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు మేడిపల్లి అడిషనల్ సిఐ అనుదీప్ తెలిపారు.

చదువులోనూ వెట్టిచాకిరీ

- మూటలు మోస్తున్న విద్యార్థులు

మన తెలంగాణ/పెద్దేముల్ (వికారాబాద్ జిల్లా) : చదువుకోవాలంటే వెట్టి చాకిరీ చేయాల్సిందే, లేదంటే ఒక పూట భోజనం బంద్.. ఇదీ ఓ వసతి గృహం వార్డన్ నిర్వాకం. తమ పిల్లలకు గుణాత్మక విద్యను అందిస్తారని ఆశించిన పేద ప్రజలు పిల్లలను ప్రభుత్వ వసతి గృహాలకు పంపిస్తున్నారు. అయితే వారి పేదరికాన్ని ఆసరా చేసుకున్న వసతి గృహ నిర్వాహకులు చిన్నారులతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారు. దీంతో అలసి పోయిన చిన్నారులు ఒక్క పూట భోజనం పెట్టరని భయపడి వార్డన్ చెప్పిన పనులు చేస్తున్నారు. వెట్టి చాకిరీని నిర్మూలనకు గాను పిల్లలతో పనులు చేయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని



హెచ్చరిస్తు న్న అధికారులు, పోలీసులు మౌనంగా ఉంటున్నా రు. దీంతో పెద్దేముల్‌లోని బిసి వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

తెలంగాణ జిల్లా రాజపత్రము
విశేష పత్రము
అధికారిక ప్రకటన

గెజిట్ నెం. ఎం.ఎం.డి.07 | మేడ్చల్-మల్కాజ్‌గిరి | మంగళవారం, 27 ఫిబ్రవరి, 2018

ఫైల్ నెం. జి2/887/2016 | తేది: 26-02-2018

ఫారం - 'సి'

(సెక్షన్ 11 క్రింద 10ఎ మినహాయింపు ఇచ్చినప్పుడు)
(రూల్ 6/12 చూడుడు)

తెలంగాణ ప్రభుత్వము/ జిల్లా కలెక్టరు మేడ్చల్-మల్కాజ్‌గిరి గారు ప్రజోపయోగార్థము అనగా ఓవర్ హెడ్‌ట్యాంకు, నీటి సంపు, ఏవైతే జంటనగరాలలో ఎం.ఎం.టి.ఎస్ కారిడార్ నిర్మాణము సమయములో ఎలైన్‌మెంట్‌లో వచ్చిన వాటిని పున: నిర్మించుటకు గాను మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, ఘట్‌కేసర్ మండలము, యంనంపేట్ గ్రామము సర్వే నెం. 61/2లో 250 చదరపు గజములు అవసరమగునని గుర్తించినారు. కావున ఇట్టి నిర్మాణముల కొరకు యంనంపేట గ్రామము, ఘట్‌కేసర్ మండలము, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని సర్వే నెం. 61/2లో సుమారు 250 చ॥గ॥ విస్తీర్ణమును నోటిపై జరపనైనది.

షెడ్యూలు

జిల్లా : మేడ్చల్-మల్కాజ్‌గిరి | మండలము : ఘట్‌కేసర్ | గ్రామము : యంనంపేట

క్ర.సం.	సర్వే నంబర్	భూమి స్వభావం: టైటిల్	భూమి స్వభావం: భూమి రకం	సేకరణ విస్తీర్ణం ఎ.గు	ఆసక్తి గల వ్యక్తుల పేర్లు చిరునామాలు	సరిహద్దులు సర్వే నెంబర్ ప్రకారం: ఉ	ద	తూ	ప	చెట్లు: రకం/సంఖ్య	నిర్మాణములు: రకం/ విస్తీర్ణం	
1	2	3	4	5	6	7	8	9	10	11	12	
1	6 1/2	పట్టా	ఖుష్కి	250 చ.గం.	పి. వెంకటేశ్వర్లు తండ్రి రాములు ఇ.నెం. 1-24-270, శివరెసిడెన్సి,ఫ్లాట్ నెం.జి-2 ఇందిరానగర్ కాలనీ, లోతుకుంట, సికింద్రాబాదు	ఫ్లాట్ నెం.6 భాగము	ఖాళీ స్థలం	40సెం రోడ్డు	ప్లాటు నెం.5	-	-	-

భూసేకరణలో పారదర్శకం, న్యాయబద్ధమైన నష్టపరిహారం, రిహాబిలిటేషన్ మరియు రిసెటిల్మెంటు చట్టం 2013 కేంద్ర ప్రభుత్వ చట్టం 30/2013లోని సెక్షన్ 11(1) క్రింద మరియు సవరించబడిన న్యాయబద్ధమైన నష్టపరిహారం మరియు భూసేకరణలో పారదర్శకం రిహాబిలిటేషన్ మరియు రీసెటిల్మెంటు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నెం. 21/2017) ప్రకారం ఆసక్తి గల వ్యక్తులందరికి తెలియజేయుడమైనది.

సేకరణ భూమి యొక్క పటము, వివరములు కలెక్టరు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా/ ప్రత్యేక ఉప కలెక్టరు భూ సేకరణ పరిశ్రమలు హైదరాబాదు. మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా కార్యాలయము, ఓ.ఆర్.ఆర్. ప్రక్కన, కీసర యందు ఏదేని పని దినములు/ పని వేళలయందు ఆసక్తి గల వారు పరిశీలించుకొన వచ్చును. తెలంగాణ ప్రభుత్వం/ కలెక్టరు మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా గారు చట్టంలోని సెక్షన్ 12 ప్రకారం కల్పించబడినట్లుగా వారి పనులను నిర్వహించుటకు అవసరమైన అన్ని ఇతరపనులు అనగా భూమి కొలతలు, భూ పరిశీలన, భూమి పొరలను త్రవ్వుటకు గాను, సంబంధిత పనులు చేయుటకు గాను భూసేకరణ అధికారి/ ప్రత్యేక ఉప కలెక్టరు, భూ సేకరణ పరిశ్రమలు, హైదరాబాదు, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వారిని నియమించినారు.

చట్టం యొక్క సెక్షన్ 11(4) క్రింద కలెక్టరు గారి ముందస్తు అనుమతి లేకుండా ఈ ప్రకటన ప్రచురణ తేది నుండి సదరు స్థలములో ఏ వ్యక్తి కూడా భూమి యొక్క ఏమేని లావాదేవీలు అనగా అమ్మకం/కొనుగోలు లేదా తాకట్టు రుణభారాలను చేయరాదు.

భూసేకరణకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు వున్నచో భూ సేకరణ అధికారి/ ప్రత్యేక ఉపకలెక్టరు భూసేకరణ పరిశ్రమలు హైదరాబాదు, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా గారి ముందు చట్టం యొక్క సెక్షన్ 15 క్రింద పేర్కొన్నట్లుగా ఈ ప్రకటన ప్రచురితమైన తేది నుండి 60 (అరవై) రోజులలోపు ఆసక్తిగల వారు దాఖలు చేసుకొనవచ్చును.

సం/- కలెక్టర్
మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా

మెదక్ : రామాయంపేట మండలం లక్ష్మీ మాపూర్ గ్రామ శివారులో చిరుత సంచరిస్తోంది. ఓ ఆవు దూడపై చిరుత దాడి చేసి చంపేసింది. చిరుతపులి సంచారంతో ఈ ప్రాంత ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

ఫారం-7
(చట్టం-30/2013 యొక్క సెక్షన్-19(1) మరియు రూల్-25 యొక్క సబ్ రూల్ (1) చూడగలరు)
తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ శాఖ
రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం, రాజేంద్రనగర్ డివిజన్, రంగారెడ్డి జిల్లా.

గజిట్ నం.ఆర్ఆర్.నం.40 | తేది: 03.03.2018
నం.జి2/870/2002-కలెక్టరేట్ ఫైల్ నం. నం.1/1051/2002 | తేది: 03.03.2018

ఏదైతే, తెలంగాణ ప్రభుత్వం/ కలెక్టర్, రంగారెడ్డి జిల్లా వారు ఎన్‌ఐఆర్‌డి పిఆర్ యొక్క రూరల్ టెక్నాలజీ పార్క్ ప్రాజెక్ట్ యొక్క అభివృద్ధి యొక్క ఏర్పాటు కొరకు ప్రజా అవసరాల కొరకు రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ మండలం, బుద్వేల్ గ్రామంలో సర్వే నం.273లో ఎక.3-03గుంటల విస్తీర్ణపు భూమి అవసరంగా భావిస్తున్నారు.

కావున ఇందుమూలంగా ప్రకటించునది ఏమనగా, రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ మండలం, బుద్వేల్ గ్రామంలో పైన చెప్పిన అవసరార్థం ప్రమాణాలలో ఎక.3-03గుంటలకు కొంతమేర ఎక్కువగాని లేదా తక్కువగాని కొలతలతో భూమి సేకరించబడుచున్నది. దేనిదైతే వివరాలు క్రింది విధంగా ఉన్నవి :

షెడ్యూలు

జిల్లా: రంగారెడ్డి | మండలం: రాజేంద్రనగర్ | గ్రామం: బుద్వేల్

క్ర.సం.	సర్వే నెంబర్	టైటిల్ రకం	భూమి రకం	సేకరణ క్రింద విస్తీర్ణం ఎ.గు.	ఆసక్తి గల వ్యక్తి పేరు & చిరునామా	సరిహద్దులు: ఉ	ద	తూ	ప	చెట్లు: రకం	సంఖ్య	నిర్మాణాలు: రకం	పూర్తి విస్తీర్ణం చ.మీ.
1	273లో	పట్టా	మెట్ట	3-03 గుంటలు	1. సయ్యద్ అబ్దుల్ ఖాదిర్ 2. షఫియుద్దీన్ అహ్మద్ ఖాద్రి హోలీ హోమ్స్ అగ్రో ఫారమ్స్ (అక్రమణ దారు)	316	272 & వి.టి. ఆఫ్ బుద్వేల్	వి.టి ఆఫ్ ప్రేమవతి పేట	273/పి	వెదురు	30	కర్ణాటక హౌస్	142.5
										వేప	37		
										(ఆరోపియా చెట్టి) వేరేటు	6	ఎలివేటెడ్ స్టోన్ హౌస్	145
												ఫిల్టర్ స్లాబ్ హౌస్	64
										ఇండియన్ బీర్ (కానుగు)	6	ఫైర్ సిమెంట్ చానెల్ హౌస్	30
										బబుల్ (తుమ్మ)	4		
										చింత	2	బ్రిక్ టాప్ హౌస్	87
										గంధం	4		
										నీలగిరి	2	వాల్టెడ్ మరియు టోల్ హౌస్	52
										రావి	5		
										బబుల్ (నల్లతుమ్మ)	2		
										మామిడి	7	బంబు హౌస్	70
										సపోట	2		
										సాప్ మామిడి చెట్టు	1		
										జామ	4		
										జాక్‌ఫ్రూట్	1		
										నిమ్మ	5		
										మునగ	1		
										కొబ్బరి	5		
										ఉసిరి	2		
										దానిమ్మ	4		
										తాటిచెట్లు	3		

చట్టం నం. 30/2013 యొక్క విభాగము 15 క్రింద ఇవ్వబడినట్లు విచారణగా మరియు ఆసక్తిగల వ్యక్తి యొక్క ఆక్షేపణ విన్నతరువాత ఈ ప్రకటన చేయబడుచున్నది.

భూమి యొక్క ఒక ప్లాను ఏదేని పనిదినమున రెవెన్యూ డివిజనల్ అధికారి, రాజేంద్రనగర్ డివిజన్, రంగారెడ్డి జిల్లా యొక్క కార్యాలయంలో పరిశీలించవచ్చును.

రెవెన్యూ డివిజనల్ అధికారి, రాజేంద్రనగర్ డివిజన్ | జాయింట్ కలెక్టర్, రంగారెడ్డి జిల్లా | కలెక్టర్, రంగారెడ్డి జిల్లా

తెలంగాణ ప్రభుత్వము, రెవెన్యూ (భూసేకరణ) శాఖ
కలెక్టరు, రంగారెడ్డి జిల్లా

ఫారం-ఎఫ్
జిల్లా కలెక్టరు, రంగారెడ్డి జిల్లా గారి ప్రకటన
(రూలు 7 (5)ని చూడుము)

నెం. జి1/3273/2017 | తేది: 03-03-2018

ప్రాథమిక ప్రకటన

హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ కొరకు మేడిపల్లి గ్రామము, యాచారం మండలము, రంగారెడ్డి జిల్లాకు సంబంధించి ప్రజా ప్రయోజనం కొరకు భూసేకరణకు ఇది వరకు ఇచ్చిన ప్రకటన నెం. జి1/3273/2017, తేది 01-08-2017, ఆంధ్రజ్యోతి, మన తెలంగాణ తెలుగు దినపత్రికలలో తేది 03-08-2017న, ప్రకటన నెం. జి1/3274/2017, తేది 05-08-2017, విశాలాంధ్ర, ఆంధ్రప్రభ తెలుగు దినపత్రికలలో తేది 06-08-2017న ప్రచురించబడినవి. ఆట్టి ప్రకటనలు అనుసరించి ఈ క్రింది చూపబడిన ప్రభావిత వ్యక్తులు (భూయజమానులు మరియు ఇతరులు) వారి క్లైములు సంప్రదింపుల ద్వారా పరిష్కరించుట కొరకు ముందుకు వచ్చిరి. ఇప్పుడు ముందుకు వచ్చిన ప్రభావిత వ్యక్తులు క్రింద చూపబడినారు.

i) భూయజమానులు

క్ర.సం.	భూయజమాని పేరు & చిరునామా	సర్వే నెంబర్	విస్తీర్ణం ఎ.గు.	రిమార్కులు
1	2	3	4	5
1	ముచ్చెర్ల నర్సింహా తండ్రి మైసయ్య	103/3/క	0.10	-
2	ముచ్చెర్ల అంజమ్మ భర్త రవీందర్	103/చ	2.12	-
3	ముచ్చెర్ల సాయిలు తండ్రి లక్ష్మయ్య	103/[illegible]	0.30	-
4	ముచ్చెర్ల జంగయ్య తండ్రి పెద్దమైసయ్య	103/2	0.10	-
5	ముచ్చెర్ల రాములమ్మ భర్త పెద్దమైసయ్య	103/1	0.11	-
6	తాండ్ర బుచ్చయ్య తండ్రి రామయ్య	144	0.38	-
7	గోర్కొండ జంగమ్మ భర్త నర్సింహా	144	0.38	-
8	ఎంది నర్సింహా తండ్రి చంద్రయ్య	144	0.38	-
9	ముచ్చెర్ల శ్రీనివాస్ తండ్రి సాయిలు	144	0.38	-
10	తాండ్ర వరేష్ తండ్రి రామయ్య	144	0.38	-
11	ముంత పర్వతమ్మ భర్త పెద్దయ్య	144	0.38	-
12	మంద ఈశ్వరయ్య తండ్రి లక్ష్మయ్య	144	0.38	-
13	ముచ్చెర్ల నర్సింహా తండ్రి శైలు	144	0.38	-
14	గోర్కొండ చెంద్రయ్య తండ్రి ఎల్లయ్య	144	0.38	-
15	మంద ఎల్లయ్య తండ్రి చెంద్రయ్య	144	0.38	-
16	తాండ్ర చెంద్రయ్య తండ్రి జంగయ్య	144	0.38	-
17	మక్కపల్లి నర్సింహా తండ్రి ఎల్లయ్య	144	0.38	-
	మొత్తం		15.09	

నెం. జి1/3274/2017 | తేది: 03-03-2018

i) భూయజమానులు

క్ర.సం.	భూయజమాని పేరు & చిరునామా	సర్వే నెంబర్	విస్తీర్ణం ఎ.గు.	రిమార్కులు
1	2	3	4	5
1	సింధం మల్లమ్మ భర్త కిష్టయ్య	94	01.24	-
2	సింధం కిష్టయ్య తండ్రి బాలయ్య	94/అ/1	01.35	-
3	సింధం అరుణ తండ్రి కిష్టయ్య	94/అ/1	01.00	-
4	సింధం మల్లమ్మ భర్త కిష్టయ్య	152/ఈ	00.04	-
5	బైరెడ్డి @ కందుకూరి క్రిష్టయ్య తండ్రి అబయ్య	98/అ	00.26	-
6	బైరెడ్డి @ కందుకూరి అగయ్య తండ్రి అబయ్య	98/ఆ	00.25	-
7	బైరెడ్డి @ కందుకూరి విష్ణుమూర్తి తండ్రి అబయ్య	98/ఇ	00.25	-
8	బైరెడ్డి @ కందుకూరి రాములు తండ్రి లక్ష్మయ్య	98/ఈ	01.36	-
	మొత్తం		08.15	

ii) భూయజమానులు కాని వారు (ఆసక్తి గలవారు)

క్ర.సం.	భూయజమాని పేరు & చిరునామా	సర్వే నెంబర్	విస్తీర్ణం ఎ.గు.	రిమార్కులు
1	2	3	4	5
-	-	-	-	-

ఇందు మూలముగా తెలియజేయునది ఏమనగా పైన సూచించిన ఏవైనా క్లైములు/అభ్యంతరములు ఉన్నయెడల భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, ఇబ్రహీంపట్నం డివిజన్, రంగారెడ్డి జిల్లా కార్యాలయములో ఈ ప్రకటన విడుదలైన ఏడు దినములలో దాఖలు చేసుకోవచ్చును.

తహసిల్దారు, యాచారం మండలం, రంగారెడ్డి జిల్లా | భూసేకరణ అధికారి/ రెవెన్యూ డివిజనల్ అధికారి, ఇబ్రహీంపట్నం డివిజన్, రంగారెడ్డి | జాయింట్ కలెక్టర్, రంగారెడ్డి | జిల్లా కలెక్టర్, రంగారెడ్డి

త్రివిక్రమ్ చిత్రంలో లయ?

మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ సినిమాల్లో ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాల్లో అతని డైలాగులతో పాటు నటీనటులు కూడా ఉంటారు. తన సినిమాల్లోని కథ హీరోతో పాటు ఖచ్చితంగా మరో ముఖ్యమైన పాత్ర చుట్టు కూడా తిరుగుతుంది. అలాంటి ముఖ్యమైన పాత్ర కోసం నటులను జాగ్రత్తగా ఎంపికచేసుకుంటాడు త్రివిక్రమ్. అతని సినిమాలు అత్తారింటికి దారేది, అ..ఆ సినిమాల్లో నదియా, అజ్ఞాతవాసి చిత్రంలో ఖుష్బూ ముఖ్యమైన పాత్రలో నటించి ప్రేక్షకులను అలరించారు. తాజాగా ఎన్టీఆర్ హీరోగా సినిమాను తెరకెక్కించడానికి సిద్ధమవుతున్నాడు త్రివిక్రమ్. ఇందులోనూ ఓ ముఖ్యమైన పాత్ర కోసం ఒకప్పటి హీరోయిన్‌ను తీసుకుంటున్నాడట. స్వయంవరం సినిమాతో తెలుగు తెరకు పరిచయమై కొన్నాళ్లపాటు స్టార్ హీరోయిన్‌గా వెలిగిన తెలుగమ్మాయి లయ పెళ్లి చేసుకున్న తర్వాత సినిమాలకు గుడ్‌బై చెప్పేసి వెళ్లిపోయింది. 'ప్రేమించు' సినిమాలో నటిగా తన టాలెంట్ ఏంటో ఆమె చూపించింది. ఇప్పుడు ఎన్టీఆర్ సినిమాలో లయ నటించే అవకాశముందని తెలిసింది. త్రివిక్రమ్ ఆఫర్‌కు లయ ఒప్పుకొని ఈ సినిమాలో నటిస్తే మరో మంచి క్యారెక్టర్ ఆర్టిస్టు టాలీవుడ్‌కు దొరికినట్టే.






క్రిష్

క్రిష్‌తో నెక్స్ట మూవీ?

ఒక సినిమా పూర్తయిన తర్వాత మరో సినిమాను మొదలుపెడతాడు స్టార్ హీరో అల్లు అర్జున్. కథల ఎంపికలో జాగ్రత్తగా ఉండే ఆయన ఒక సినిమా చేస్తుండగా మరో సినిమా పని మొదలుపెట్టడు. కొత్త సినిమా కోసం దర్శకులతో చర్చలు జరపడం, స్క్రిప్ట్ చర్చల్లో కూడా పాల్గొంటూ తనకు ఏది సరిపోతుందో ఆ చిత్రాన్ని ఎంపికచేసుకుంటాడు. ఇదే తన సక్సెస్ సీక్రెట్ అని అల్లుఅర్జున్ బలంగా నమ్ముతాడు. గత ఏడాది మధ్య నుంచి 'నా పేరు సూర్యనా ఇల్లు ఇండియా' సినిమాలో బిజీగా ఉన్న బన్నీ... ఆతర్వాత ఫలానా దర్శకుడితో సినిమా చేస్తాడంటూ రకరకాల ఊహాగానాలు వినిపించాయి. అయితే అవన్నీ అబద్ధమే అని తేలిపోయింది. ఇప్పటిదాకా ఏ సినిమా కూడా ఖరారు కాలేదు. అయితే మరికొన్ని రోజుల్లో 'నా పేరు సూర్య...'ను పూర్తిచేయబోతున్న అల్లుఅర్జున్ తన నెక్స్ట సినిమాకు సూచనప్రాయంగా ఓకే చెప్పినట్లు సమాచారం. విలక్షణ దర్శకుడు క్రిష్‌తో అతను ఓ సినిమా చేస్తాడట. ప్రస్తుతం బాలీవుడ్‌లో కంగనారనౌత్‌తో 'మణికర్ణికః ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ' చిత్రాన్ని రూపొందిస్తున్నాడు ఈ దర్శకుడు. ఈ చిత్రం పూర్తయిన తర్వాత ఈ ఏడాది ద్వితీయార్థంలో అల్లుఅర్జున్‌తో సినిమాను మొదలుపెడతాడు క్రిష్.

ప్రారంభమైన విజయ్ దేవరకొండ కొత్త చిత్రం


స్టూడియోగ్రీన్ చిత్రం ప్రారంభోత్సవంలో విజయ్‌దేవరకొండ, మెహరీన్, అల్లుఅర్జున్, జ్ఞానవేల్ రాజా, బివిఎస్ఎన్ ప్రసాద్, ఆనంద్ శంకర్

'పెళ్లిచూపులు' చిత్రంతో ఒక్కసారిగా లైమ్‌లైట్‌లోకి వచ్చిన యంగ్ హీరో విజయ్ దేవరకొండ ఆతర్వాత 'అర్జున్‌రెడ్డి'తో మంచి క్రేజ్‌ను తెచ్చుకున్నారు. ఈ రెండు చిత్రాలతో యూత్‌లో అతనికి మంచి పాపులారిటీ వచ్చింది. ప్రస్తుతం విజయ్ దేవరకొండ హీరోగా మెహరీన్ హీరోయిన్‌గా ఆనంద్ శంకర్ దర్శకత్వంలో తెలుగు, తమిళ్‌లో నిర్మిస్తున్న చిత్రం హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో ఘనంగా ప్రారంభమైంది. స్టూడియో గ్రీన్ పతాకంపై కె.ఇ.జ్ఞానవేల్ రాజా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అల్లు అరవింద్, కె.ఎస్.రామారావు, బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, స్వప్నదత్, వంశీపైడిపల్లి, మెహర్ రమేష్, సందీప్ రెడ్డి వంగతో పాటు చిత్ర బృందం పాల్గొంది. పూజా కార్యక్రమాల అనంతరం హీరోహీరోయిన్‌లు విజయ్ దేవరకొండ, మెహరీన్‌లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి అల్లు అరవింద్ క్లాప్‌నివ్వగా... సందీప్‌రెడ్డి వంగ కెమెరా స్విచాన్ చేశారు. అనంతరం ఏర్పాటైన విలేకరుల సమావేశంలో హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "స్టూడియో గ్రీన్ కె.ఇ.జ్ఞానవేల్ రాజా బ్యానర్‌లో ఈ సినిమా చేస్తున్నందుకు చాలా గర్వంగా ఉంది. సినిమా స్క్రిప్ట్ వినగానే చాలా ఎగ్జైట్ అయ్యాను. తొలిసారి తెలుగు, తమిళ్‌లో సినిమా చేస్తున్నాను. డేట్స్ లేకపోయినప్పటికీ స్క్రిప్ట్ నచ్చడంతో డేట్స్ అడ్జస్ట్ చేసి ఈ సినిమాకే ఓకే చెప్పాను"అని అన్నారు. నిర్మాత కె.ఇ.జ్ఞానవేల్ రాజా మాట్లాడుతూ "అర్జున్ రెడ్డి సినిమాను థియేటర్‌లో ఐదుసార్లు చూశాను. విజయ్ దేవరకొండ అమేజింగ్ యాక్టర్. అతనితో తెలుగు, తమిళ్‌లో సినిమా చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. దర్శకుడు ఆనంద్ శంకర్ చెప్పిన స్క్రిప్ట్ నచ్చి ఈ సినిమా తీస్తున్నాను. ఈనెల 8 నుండి తొలి షెడ్యూల్ హైదరాబాద్‌లో చేసి రెండో షెడ్యూల్‌ను చెన్నైలో చేస్తాం"అని చెప్పారు. దర్శకుడు ఆనంద్ శంకర్ మాట్లాడుతూ "విజయ్ దేవరకొండ నటించిన 'అర్జున్‌రెడ్డి' అన్ని భాషల్లో మంచి హిట్ అయింది. అతని నటనకు మంచి ప్రశంసలు వచ్చాయి. అతను ఈ స్క్రిప్ట్ విని వెంటనే సినిమా చేస్తానని అన్నాడు. తమిళ్ నేర్చుకొని డైలాగ్స్ చెబుతానని అన్నాడు. ఈ చిత్రంలో సత్యరాజ్, నాజర్ ముఖ్య పాత్రల్లో నటిస్తారు. తెలుగు, తమిళ్ ప్రేక్షకులకు నచ్చేవిధంగా ఈ చిత్రం ఉంటుంది"అని పేర్కొన్నారు. హీరోయిన్ మెహరీన్ మాట్లాడుతూ "విజయ్ దేవరకొండతో ఇటీవల ఒక హోలీ పండుగ పాటలో నటించాను. వెంటనే ఇప్పుడు అతనితో హీరోయిన్‌గా నటిస్తున్నాను. స్టూడియో గ్రీన్ బ్యానర్‌లో ఆనంద్ శంకర్ దర్శకత్వంలో ఈ సినిమా చేస్తున్నందుకు హ్యాపీగా ఉంది"అని అన్నారు. ఈ చిత్రానికి కెమెరాః శాంత, సంగీతంః సి.ఎస్.శ్యామ్, కాస్ట్యూమ్స్ డిజైనర్ః శ్రావ్య, ఆర్ట్ః కిరణ్.

'ది షేప్ ఆఫ్ వాటర్'కు నాలుగు ఆస్కార్‌లు


ఆస్కార్ అవార్డులతో సామ్ రాక్‌వెల్, ఫ్రాన్సిస్ మెక్‌డోర్మండ్, అల్లీసన్ జెన్నీ, గ్యారీ ఓల్డ్‌మన్

- లాస్‌ఏంజిల్స్‌లో కన్నుల పండువగా ఆస్కార్ వేడుక
- ఉత్తమ చిత్రంగా 'ది షేప్ ఆఫ్ వాటర్'
- ఉత్తమ దర్శకుడిగా గల్లీర్మో డెల్‌టోరో, ఉత్తమ నటుడిగా గ్యారీ ఓల్డ్‌మ్యాన్, ఉత్తమ నటిగా ఫ్రాన్సిస్ మెక్‌డోర్మండ్‌లకు ఆస్కార్‌లు

హాలీవుడ్ తారల తళుకుబెళుకుల మధ్య అతిపెద్ద అంతర్జాతీయ సినీ అవార్డుల కార్యక్రమం 'ఆస్కార్' వేడుక లాస్‌ఏంజిల్స్‌లో ఎంతో ఆడంబరంగా జరిగింది. లాస్‌ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో ఈ వేడుకను కన్నులపండువగా నిర్వహించారు. ఈ ఏడాది ఆస్కార్ వేడుకలో 'ది షేప్ ఆఫ్ వాటర్'కు అవార్డుల పంట పండింది. ఈ చిత్రానికి నాలుగు అవార్డులు దక్కడం విశేషం. ఉత్తమ చిత్రంగా నిలిచిన 'ది షేప్ ఆఫ్ వాటర్'... ఉత్తమ దర్శకుడు, బెస్ట్ ఒరిజినల్ స్కోర్, బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్ కేటగిరీలలో కూడా అవార్డులను అందుకుంది. ఉత్తమ దర్శకుడిగా గల్లీర్మో డెల్‌టోరో ఆస్కార్‌ను గెలుచుకోగా ఉత్తమ నటునిగా గ్యారీ ఓల్డ్‌మ్యాన్ (డార్కెస్ట్ అవర్), ఉత్తమ నటిగా ఫ్రాన్సిస్ మెక్‌డోర్మండ్ (త్రీ బిల్‌బోర్డ్స్ అవుట్ సైట్ ఎబ్బింగ్, మిస్సోరి) అవార్డులను దక్కించుకున్నారు. ఇక 'డన్‌కర్క్' చిత్రానికి మూడు ఆస్కార్‌లు లభించడం విశేషం.

సినీ రంగంలో అందజేసే అత్యుత్తమ అవార్డులు ఆస్కార్. నటీనటులు జీవితంలో ఒక్కసారైనా ఆస్కార్ గెలుపొందాలని కలలు కంటారు. ఆస్కార్ అవార్డు దక్కితే పరవశించిపోతారు. ఈ ఏడాది ఆస్కార్ అవార్డుల వేడుకలో పలు దేశాలకు చెందిన ప్రముఖ హాలీవుడ్ తారలు పాల్గొని ప్రేక్షకులను మైమరపించారు. ఆస్కార్‌కు నామినేట్ అయిన ఎనిమిది చిత్రాలతో పోటీపడి 'ది షేప్ ఆఫ్ వాటర్' ఉత్తం చిత్రంగా అవార్డును అందకుంది. గులెర్మో డెల్‌టొరో దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం గత ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సాల్లీ హాకిన్స్, మైఖేల్ షాన్నన్, రిచర్డ్ జెన్‌కిన్స్, డోగ్ జోన్స్, ఆక్టేవియా స్పెన్సర్ ప్రధాన పాత్రల్లో ఈ చిత్రం రూపుదిద్దుకుంది. ఫాంటసీ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సత్తా చాటింది. 19.5 మిలియన్ డాలర్ల బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం 114.3 మిలియన్ డాలర్లను వసూలు చేసి బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ల్యాబొరేటరీలో పనిచేసే ఓ మూగ యువతి కథే ఈ చిత్రం. ఆ ల్యాబొరేటరీలో పరిశోధనల కోసం ఉంచిన హ్యూమనాయిడ్ నీటి జంతువుతో ఆమె ప్రేమలో పడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులను ఎంతగానో అలరించిన ఈ ఫాంటసీ డ్రామా మూవీ చివరికి ఆస్కార్‌లోనూ సత్తా చాటింది. ఇక 'డార్కెస్ట్ అవర్' చిత్రంలో అద్భుతమైన నటనకుగాను గ్యారీ ఓల్డ్‌మ్యాన్ ఉత్తమ నటుడిగా ఆస్కార్ అవార్డును గెలుచుకున్నారు. ఈ సినిమాలో మాజీ బ్రిటన్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ పాత్రలో గ్యారీ నటించారు. 'ఐ, టోన్యా' సినిమాలో తన నటనతో ఆల్లిసన్ జాన్నే విమర్శకుల ప్రశంసలను అందుకున్నారు. ముందుగా అనుకున్న విధంగానే ఉత్తమ నటిగా జాన్నేను ఆస్కార్ అవార్డు వరించింది. ఈ చిత్రంలో తల్లి పాత్రలో నటించిన ఆమెకు అంతకుముందు ఇతర ప్రతిష్టాత్మక అవార్డులు కూడా దక్కాయి. 'ది షేప్ ఆఫ్ వాటర్' చిత్రం తర్వాత ఆస్కార్ వేడుకలో అందరినీ ఆకట్టుకున్న సినిమా 'డన్‌కర్క్'. ఈ చిత్రానికి బెస్ట్ సౌండ్ మిక్సింగ్, బెస్ట్ ఫిలిం ఎడిటింగ్, బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్ విభాగాలలో అవార్డులు లభించాయి.

ఆస్కార్ అవార్డుల విజేతలు

- **ఉత్తమ దర్శకుడు** : గల్లీర్మో డెల్‌టోరో (ది షేప్ ఆఫ్ వాటర్)
- **ఉత్తమ నటుడు** : గ్యారీ ఓల్డ్‌మ్యాన్ (డార్కెస్ట్ అవర్)
- **ఉత్తమ నటి** : ఫ్రాన్సిస్ మెక్‌డోర్మండ్ (త్రీ బిల్ బోర్డ్స్ అవుట్ సైట్ ఎబ్బింగ్, మిస్సోరి)
- **ఉత్తమ చిత్రం** : ది షేప్ ఆఫ్ వాటర్



- **ఉత్తమ సహాయ నటుడు** : సామ్ రాక్‌వెల్ (త్రీ బిల్ బోర్డ్స్ అవుట్ సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి)
- **ఉత్తమ సహాయ నటి** : అల్లీసన్ జెన్నీ (ఐ, టోన్యా)
- **ఉత్తమ సినిమాటో- గ్రఫీ చిత్రం** : బ్లేడ్ రన్నర్ 2049
- **ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్** : మార్క్ బ్రిడ్జెస్ (ఫాంటమ్ థ్రెడ్)


సామ్ రాక్‌వెల్



- **ఉత్తమ ఎడిటర్** : లీ స్మిత్ (డన్‌కర్క్)
- **ఉత్తమ అలంకరణ, కేశాలంకరణ** : కజు హిరో సుజి, డేవిడ్ మాలినోవ్‌స్కీ, లూసీ సిబ్బిక్ (డార్కెస్ట్ అవర్)
- **ఉత్తమ విదేశీ చిత్రం** : ఎ ఫెంటాస్టిక్ ఉమెన్ (చిలీ)
- **బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్**: జాన్ నీల్సన్, గెర్డ్ నెఫ్జర్, పాల్ లాంబర్ట్, రిచర్డ్ ఆర్. హూవర్ (బ్లేడ్ రన్నర్ 2049)
- **బెస్ట్ సౌండ్ మిక్సింగ్** : మార్క్ వీన్‌గార్టెన్, గ్రెగ్ ల్యాన్‌డార్కర్, గ్యారీ ఎ.రిజ్జో (డన్‌కర్క్)
- **బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్** : పాల్ డెన్‌హామ్, ఆస్టర్‌బెర్రీ (ది షేప్ ఆఫ్ వాటర్)
- **బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే** : జోర్డన్ పీలే (గెట్ అవుట్)
- **బెస్ట్ ఒరిజినల్ సాంగ్**: రిమెంబర్ మీ (కోకో)


అల్లీసన్ జెన్నీ


మెక్‌డోర్మండ్


ఓల్డ్‌మ్యాన్


గల్లీర్మో డెల్‌టోరో


'అనగనగా ఒక ఊళ్లో' ఆడియో వేడుకలో శ్రీకాంత్, సుమన్, అశోక్ కుమార్, ప్రియాంక శర్మ, సాయికృష్ణ, చంద్రరావు తదితరులు

'అనగనగా ఒక ఊళ్లో' గీతాల ఆవిష్కరణ

అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులతో చంద్రబాలాజీ ఫిలిమ్స్ పతాకంపై సాయికృష్ణ కె.వి.ని దర్శకునిగా పరిచయం చేస్తూ కె.చంద్రరావు నిర్మిస్తున్న చిత్రం 'అనగనగా ఒక ఊళ్లో'. పల్లెటూరికి వినోద యాత్ర అనేది ట్యాగ్‌లైన్. అశోక్‌కుమార్, ప్రియాంక శర్మ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం ఆడియో వేడుక హైదరాబాద్‌లో జరిగింది. హీరో శ్రీకాంత్ ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో కె.చంద్రరావు, బాలాజీ, శ్రీతేజ్, మనోజ్, బెనర్జీ, సుమన్, సాయికృష్ణ, యాజమాన్య, రాజశేఖర్.ఎస్, అశోక్‌కుమార్, ప్రియాంక శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ 'అనగనగా ఒక ఊళ్లో' చిత్రం బిగ్ సీడీని విడుదల చేశారు. థియేట్రికల్ ట్రైలర్‌ను హీరో నవీన్ చంద్ర విడుదల చేశారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ "సినిమా టైటిల్ చాలా బాగుంది. పల్లెటూరి వాతావరణంలో ఈ చిత్రం ఉంటుంది. సంగీత దర్శకుడు యాజమాన్య మంచి పాటలను అందించారు. ఈ చిత్రం మంచి సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను"అని అన్నారు. సుమన్ మాట్లాడుతూ "రాజమౌళి శిష్యుడు సాయి చాలా మంచి దర్శకుడు. సినిమాను బాగా తీశాడు. ఈ చిత్రంలో నేను ఒక మంచి క్యారెక్టర్ చేశాను. అన్ని కమర్షియల్ అంశాలు ఇందులో ఉంటాయి"అని చెప్పారు. దర్శకుడు సాయికృష్ణ మాట్లాడుతూ "రాజమౌళి వద్ద పనిచేసి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఆ అనుభవంతో నేను కొన్ని కథలు రాసుకున్నాను. నిర్మాత చంద్రరావుకు ఈ కథ బాగా నచ్చడంతో సినిమాను ప్రారంభించాము. రాజోలు పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ఆటంకం లేకుండా 40 రోజులు షూటింగ్ చేశాం. ఈ నెలలోనే ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నాం"అని తెలిపారు. హీరో అశోక్ కుమార్ మాట్లాడుతూ "యాజమాన్య అందించిన పాటలు అద్భుతంగా ఉన్నాయి. హీరోయిన్ ప్రియాంక చాలా బాగా నటించింది. పల్లెటూరి బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది"అని చెప్పారు.



శ్రీదేవి, శశికపూర్‌ల మృతి పట్ల సంతాపం

ఇండియన్ సినిమా ఇండస్ట్రీకి గత కొన్నేళ్లుగా అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభిస్తోంది. బాహుబలి వంటి బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ సినిమాలు విదేశాల్లోనూ సత్తా చాటాయి. మన దేశంలోని కొందరు ప్రముఖ నటీనటులు అంతర్జాతీయంగా మంచి పేరు, ప్రఖ్యాతులు సంపాదించారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఆస్కార్ సంబరాల్లో అతిలోక సుందరి శ్రీదేవి మృతి పట్ల సంతాపాన్ని తెలియజేశారు. స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన ఆమెకు ఉన్న గుర్తింపును ఇది తెలియజేసింది. అప్పట్లో స్టీవెన్ స్పీల్‌బర్గ్ 'జురాసిక్ పార్క్' సినిమాలో శ్రీదేవిని కీలక పాత్ర కోసం ఎంచుకోవాలని అనుకున్నారు. కానీ అప్పటికి ఆమె చాలా బిజీ. రెండు, మూడేళ్ల వరకు డేట్స్ ఇవ్వలేని పరిస్థితి. ఒక్క రోజు కూడా గ్యాప్ లేకుండా నెలల తరబడి నటించిన సందర్భాలు చాలానే ఉన్నాయి. దీంతో అనుకోని విధంగా 'జురాసిక్ పార్క్'లో వచ్చిన అవకాశాన్ని ఆమె వదులుకోవాల్సి వచ్చింది. ఇక దిగ్గజ నటుడు శశికపూర్ గత ఏడాది మరణించిన సంగతి తెలిసిందే. ఆయన కూడా హాలీవుడ్‌కు కొంచెం దగ్గరగా ఉండేవారు. శశికపూర్ మృతి పట్ల కూడా ఆస్కార్ వేడుకలో సంతాపాన్ని తెలియజేశారు.


శశికపూర్

డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లతో నిర్మాతల చర్చలు విఫలం



డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు వర్చువల్ ప్రింట్ ఫీజ్ (విపిఎఫ్)ను తగ్గించాలని డిమాండ్ చేస్తూ దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమ జాయింట్ యాక్షన్ కమిటీ నిర్వహిస్తున్న థియేటర్ల బంద్ నాలుగవ రోజు కూడా విజయవంతంగా జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కేరళ, కర్నాటకలో ఈ థియేటర్ల బంద్ కొనసాగుతోంది. ఈ బంద్ మూలంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు 1700 థియేటర్లు మూతపడ్డాయి. అయితే సోమవారం డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు, నిర్మాతల మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. వర్చువల్ ప్రింట్ ఫీజ్‌ను 16 శాతం తగ్గిస్తామని డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు ప్రతిపాదించారు. ఈ హామీపై నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో థియేటర్ల బంద్ యధావిధిగా కొనసాగనుంది. ఇక ఈనెల 9 వరకు బంద్ నిర్వహించాలని జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయించింది. ఇక థియేటర్ల బంద్ మూలంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రతి రోజు దాదాపు రూ.3 కోట్ల వరకు నష్టం వాటిల్లుతోంది. అయితే డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల వైఖరి పట్ల దక్షిణాది చలన చిత్ర పరిశ్రమల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.



ఫిబ్రవరిలో క్షీణించిన సేవల రంగం సూచీ

న్యూఢిల్లీ: వ్యాపార పరిస్థితుల్లో క్షీణత నేపథ్యంలో ఫిబ్రవరిలో నిక్కీ ఇండియా సేవల వ్యాపార సూచీ ఏడు నెలల కనిష్టానికి పడిపోయింది. గత నెలలో సూచీ 47.8గా నమోదవగా.. అంతకుముందు జనవరిలో సూచీ 51.7గా ఉంది. మూడు నెలల్లో ఉత్పత్తిలో తొలి క్షీణత నమోదైనప్పటికీ స్వల్పంగా ఉందని సోమవారం నిక్కీ ప్రకటనలో తెలిపింది. సేవల రంగంలో క్షీణత నేపథ్యంలో జనవరిలో 52.5గా ఉన్న నిక్కీ ఇండియా పిఎంఐ ఉత్పత్తి సూచీ.. ఫిబ్రవరిలో 49.7కు పడిపోయింది. ఇండెక్స్ 50కి పైన వృద్ధి దిశగా అన్నట్టు.. దిగువన ఉంటే క్షీణత ఉందని సూచిస్తుంది. కాగా ఫిబ్రవరి నెలలో తయారీ రంగం వృద్ధి రేటు కూడా నాలుగు నెలల కనిష్టాని కి పడిపోయింది. కొత్త ఆర్డర్లు లేకపోవడం, తయారీదారులు ధరలు పెంచిన తర్వాత ఉత్పత్తిపై భారం పడడం వంటి ప్రతికూలంగా మారాయని నివేదికలో తేలింది. ఫిబ్రవరి నెలలో నిక్కీ తయారీ రంగం పిఎంఐ 52.1కు క్షీణించగా.. జనవరిలో ఇది 52.4గా ఉంది. కాగా, మూడో త్రైమాసికంలో (అక్టోబర్–డిసెంబర్)లో దేశీయ ఆర్థిక వ్యవస్థ వృద్ధి వేగంగా ఉందని మోర్గాన్ స్టాన్లీ, రైటర్స్ పోల్ రెండు నివేదికలు అంచనా వేశాయి. ఏడాది–ఏడాది ఆధారంగా చూస్తే జిడిపి వృద్ధి రేటు 7 శాతానికి పెరగనుందని, అంతకుముందు సెప్టెంబర్ త్రైమాసికంలో 6.3 శాతంతో పోలిస్తే మెరుగవనుందని నివేదిక పేర్కొంది.

నేడు మార్కెట్లోకి సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్9, ఎస్9 ప్లస్




న్యూఢిల్లీ: సామ్‌సంగ్ సంస్థ తన కొత్త స్మార్ట్‌ఫోన్లు గెలాక్సీ ఎస్9, ఎస్9 ప్లస్‌లను నేడు మార్కెట్లోకి విడుదల చేయనుంది. ఢిల్లీలో జరిగే ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఈ ఫోన్లను లాంఛ్ చేయనున్నారు. ఈ ఫోన్లకు ఇప్పటికే భారత్‌లో ప్రీ ఆర్డర్లు ప్రారంభమయ్యాయి. ఆన్‌లైన్ స్టోర్, ఫ్లిప్‌కార్ట్ సైట్లలో రూ.2వేలు చెల్లించి బుకింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించాయి. సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్9, ఎస్9 ప్లస్ ఫోన్లకు గాను 64, 128, 256 జిబి స్టోరేజ్ వేరియెంట్లు విడుదలయ్యాయి. అయితే భారత్‌లో మాత్రం కేవలం 64, 256 జిబి వేరియెంట్లను మాత్రమే విక్రయించనున్నట్టు సమాచారం. ఇక గెలాక్సీ ఎస్9 ప్రారంభ ధర రూ.57,900, ఎస్9 ప్లస్‌ను రూ.64,900 ప్రారంభ ధరకు విక్రయించనున్నట్లు తెలిసింది.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	33,746.78	300.16	0.88%
నిఫ్టీ	10,358.85	99.50	0.95%

CLOSING SENSEX REPORT



కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29180	31208.56	0.14%
ముంబై	29760	31828.88	–0.03%
ఢిల్లీ	29700	31764.71	–0.5%
కోల్‌కతా	30040	32128.34	–1.02%
కేరళ	28200	30160.43	0%
బెంగళూరు	28850	30855.61	0.52%
హైదరాబాద్	29180	31208.56	–0.14%
గల్ఫ్	1407.18	1505.00	–0.33%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	గురువారం	బుధవారం	మార్పు (%)
చెన్నై	41400.00	41200.00	0.49
ముంబై	41400.00	41200.00	0.49
ఢిల్లీ	41400.00	41200.00	0.49
కోల్‌కతా	41400.00	41200.00	0.49
హైదరాబాద్	41400.00	41200.00	0.49

కోడిగుడ్లు (100కు) నెక్ రేటు



హైదరాబాద్	363	విశాఖపట్నం	369
వరంగల్	366	చిత్తూరు	388
విజయవాడ	365	చెన్నై	395
గోదావరి	365	బెంగళూరు	384

రాబడి పన్నుపై రాబందులు

రూ.3,200 కోట్ల టిడిఎస్ కుంభకోణం



- ఉద్యోగులను మోసం చేసిన 447 కంపెనీలు
- పన్ను వసూలు చేసి ప్రభుత్వం వద్ద డిపాజిట్ చేయలేదు
- వ్యాపార అవసరాలకు ఈ నిధుల మళ్లింపు
- గుర్తించిన ఆదాయ పన్ను శాఖ

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో అతిపెద్ద రుణం ఎగవేత మోసం వెలుగుచూసిన తర్వాత బ్యాంకింగ్ వ్యవస్థపై విశ్వాసం సన్నగిల్లుతోంది. తాజాగా ఆదాయం పన్ను శాఖ.. పన్నుల చెల్లింపులో మరో భారీ కుంభకోణాన్ని గుర్తించింది. ఇది పన్ను చెల్లింపుదారులను దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. 447 కంపెనీలు తమ ఉద్యోగుల వేతనాల నుంచి వసూలు చేసిన పన్నులో భారీ మోసానికి పాల్పడ్డాయి. ఇది దాదాపు రూ.3,200 కోట్లు ఉంటుంది. ఈ నిధులను ప్రభుత్వం వద్ద డిపాజిట్ చేయకుండా సదరు కంపెనీలు.. తమ స్వప్రయోజనాలు, వ్యాపార అవసరాల కోసం మళ్లించాయని ఐటి శాఖ గుర్తించింది. ఆదాయపుపన్ను శాఖలోని టిడిఎస్ (ట్యాక్స్ డిడక్షన్ ఎట్ సోర్స్) విభాగం ఇలాంటి కంపెనీలపై విచారణ ప్రారంభించింది. కొన్ని కేసులకు సంబంధించి వారెంట్లు కూడా జారీ అయ్యాయని అధికార వర్గాలు సమాచారం. ఐటికి సంబంధించిన చట్టాల ప్రకారం ఇలాంటి నేరాలకు పాల్పడిన వారికి మూడు నెలల కనీస శిక్ష నుంచి ఏడేళ్ల గరిష్ఠ శిక్ష, జరిమానా ఉంటుంది.



కుంభకోణాన్ని ఎలా గుర్తించారు?

ఆదాయం పన్ను శాఖకు చెందిన టిడిఎస్(టాక్స్ డిడక్షన్ ఎట్ సోర్స్) వింగ్ 2017 ఏప్రిల్ నుంచి 2018 మార్చి వరకు తనిఖీలు నిర్వహించినప్పుడు.. ఈ బాగోతం వెలుగులోకి వచ్చింది. ఈ మోసంలో సుమారు 447 కంపెనీలు ఉన్నాయని, ఈ సంస్థలు రూ.3200 విలువచేసే కుంభకోణానికి పాల్పడ్డాయని గుర్తించారు. ఈ కంపెనీలు ఉద్యోగుల నుంచి పన్నును వసూలు చేసి వాటిని ప్రభుత్వం వద్ద డిపాజిట్ చేయలేదని ఐటి ధృవీకరించింది. ఈ కంపెనీలు చట్టం ప్రకారం, ఆదాయం పన్ను కింద పన్నును వసూలు చేసి, తగిన సమయంలోగా ఆ నిధులను ప్రభుత్వ ఖాతాల్లోకి పంపించాల్సి ఉంటుంది. కానీ ఈ కంపెనీలు నిబంధనలను పాటించలేదు.

నేరగాళ్లు ఎవరు?

ఈ కుంభకోణంలో ఎక్కువగా బిల్డర్లు ఉన్నారని, వీరిలో ఒక నేరస్థుడికి రాజకీయంగా పలుకుబడి ఉందని తెలుస్తోంది. దాదాపు రూ.100 కోట్లు ఉద్యోగుల నుంచి ఆదాయపన్ను కింద వసూలు చేశారని, ఈ నిధులను ప్రభుత్వానికి కట్టకుండా తన వ్యాపారాలకు వారు ఉపయోగించుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. అలాగే సినిమా ప్రొడక్షన్ హౌసెస్, నిర్మాణ కంపెనీలు, స్టార్టప్‌లు తదితర కంపెనీలు ఈ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. 2017 ఏప్రిల్ నుంచి ఇప్పటికీ ఈ మోసాలు జరిగినట్టు తెలుస్తోంది.

ఇప్పటివరకు ఐటి ఎలాంటి చర్యలు చేపట్టింది?

ఆదాయం పన్ను శాఖ ఈ కంపెనీలపై విచారణ ప్రారంభించింది. కొన్ని కేసుల్లో వారెంట్లను కూడా జారీ చేసింది. 276 బి సెక్షన్ కింద ఈ విచారణ ఉంటుంది. ఆదాయం పన్ను చట్టం కింద ఇలాంటి నేరాలకు పాల్పడిన వారికి కఠిన కారాగార శిక్ష కనీసం మూడు నెలల నుంచి ఏడేళ్ల వరకు ఉంటుంది. జరిమానా విధిస్తారు. రికవరీ చర్యలను ఐటి శాఖ ప్రారంభించింది. వివిధ సెక్షన్ల కింద నేరస్తులపై చర్యలు చేపట్టనున్నారు.

ఉద్యోగులపై ఎలాంటి ప్రభావం?

టిడిఎస్‌తో ఐటి రిటర్న్‌ల దాఖలు సులభతరం అవుతుంది. టిడిఎస్‌ను ప్రభుత్వం వద్ద డిపాజిట్ చేయకపోతే.. అసమానత కనిపిస్తుంది. ఇన్‌కమ్ టాక్స్ వెబ్‌సైట్‌లో మీరు పన్ను చెల్లించారా? లేదా? అనేది తెలుసుకోవచ్చు. టిడిఎస్ చెల్లించకపోతే సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

ఉద్యోగులు ఏమి చేయాలి?

2016లో ప్రభుత్వం ఎస్ఎంఎస్ అలర్ట్‌ను ప్రారంభించింది. దీని ద్వారా ఉద్యోగులు టిడిఎస్ విషయంలో అప్రమత్తంగా ఉండొచ్చు. ప్రభుత్వానికి టిడిఎస్ వెళ్లిందా? లేదా? తెలుసుకోవచ్చు. సంవత్సరం ఆఖరు నాటికి ఉద్యోగులు ఎస్ఎంఎస్‌తో సాలరీ స్లిప్‌ను జత చేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఇది మిస్‌మ్యాచ్ అయినట్లయితే.. ఆ తర్వాత వారు స్పష్టంగా వాటి గురించి తెలుసుకోవాలి.

మార్కెట్లోకి టాటా జెస్ట్ ప్రిమియో ఎడిషన్



న్యూఢిల్లీ: దేశీయ వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్ మార్కెట్లోకి కాంపాక్ట్ సెడాన్ జెస్ట్ ప్రత్యేక ఎడిషన్‌ను విడుదల చేసింది. ఆటో మొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ తన కాంపాక్ట్ సెడాన్ జెస్ట్‌లో ప్రత్యేక ఎడిషన్‌ను సోమవారం విడుదల చేసింది. ఈ కొత్త కారులో 1.3 లీటర్ డీజిల్ ఇంజిన్, 13 అదనపు ఫీచర్లను జోడించారు. ధర రూ.7.53 లక్షలు (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించారు. దేశంలోని అన్ని టాటామోటార్స్ రీటైల్ దుకాణాలలో మార్చి 1నుంచి అందుబాటులో ఉంచినట్టు తెలిపింది. టాటామోటార్స్ 2014 ఆగస్టులో ఈ మోడల్‌ను విడుదల చేసినప్పటినుంచీ ఇప్పటివరకు 85వేల యూనిట్లను విక్రయించింది. కస్టమర్ ప్రాధాన్యతలకు అనుగుణంగా తీసుకొచ్చిన స్పెషల్ ఎడిషన్ వినియోగదారులను తప్పకుండా ఆకట్టుకుంటుందని టాటా మోటర్స్ ప్యాసింజర్ వాహనం బిజినెస్ యూనిట్ ప్రెసిడెంట్ మయాంక్ పరీక్ తెలిపారు. డ్యుయల్ టోన్ రూఫ్ , ఎక్స్ టీరియర్ మిర్రర్స్, డాష్‌బోర్డ్ లాంటి కొత్త ప్రీమియం ఫీచర్లు కారులో ఉన్నాయి. ఇక మార్కెట్‌లో పోటీ విషయానికి వస్తే కొత్త మారుతి డీజైర్, ఫోక్స్‌వ్యాగన్ అమేయో, రాబోయే కొత్త హోండా అమేజ్, ఫోర్డ్ యాస్పైర్ వంటి కార్లకు ఇది గట్టిపోటీ ఇవ్వనుందని అంచనా వేస్తున్నారు

ఆర్సెలర్‌మిట్టల్ కొత్త అధ్యక్షుడు ఆదిత్య మిట్టల్



న్యూఢిల్లీ: అంతర్జాతీయ స్టీల్ దిగ్గజం ఆర్సెలర్ మిట్టల్ కొత్త అధ్యక్షుడిగా ఆదిత్య మిట్టల్ నియమితులయ్యారు. ఈమేరకు లక్సంబర్గ్‌కు చెందిన కంపెనీ ప్రకటన చేసింది. కంపెనీ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్ కుమారుడే ఆదిత్య మిట్టల్.. కంపెనీలో ఇప్పటికే కీలక బాధ్యతల్లో ఉన్నారు. తాజాగా ఆయనకు కొత్తగా ప్రెసిడెంట్ బాధ్యతలను అప్పగించింది. యూరప్ గ్రూప్ సిఇఒ, సిఎఫ్ఒగా ఆయన ప్రస్తుత బాధ్యతలకు అదనంగా దీన్ని అప్పగించారు. 42 ఏళ్ల ఆదిత్యమిట్టల్ ఆర్సెలర్ మిట్టల్‌కు అధ్యక్షుడిగా వ్యవహరించనున్నారని కంపెనీ సోమవారం ప్రకటించింది. ఈ నియామకం ద్వారా గ్రూప్ అంతటా పెరుగుతున్న ప్రపంచ వ్యూహాత్మక పాత్రను ప్రతిబింబించడంతోపాటు, సంస్థ ఛైర్మన్ అండ్ సిఇఒ లక్ష్మీ మిట్టల్‌కు భారీ మద్దతు లభించనుందని పేర్కొంది. యూరప్ కార్యకలాపాల్లో సిఇఒగా బాధ్యతల నిర్వహణలో ఆదిత్య తన ప్రతిభను నిరూపించుకున్నారు. ప్రపంచంలోనే స్టీలు, మైనింగ్ దిగ్గజ కంపెనీల్లో ఆర్సెలర్ మిట్టల్ ఒకటి.. ఈ సంస్థ 60 దేశాల్లో వ్యాపారాలను నిర్వహిస్తోంది.

35 లక్షల మైలురాయిని దాటిన ఆల్టో



న్యూఢిల్లీ: దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియాకు చెందిన ఆల్టో మరో రికార్డును సొంతం చేసుకుంది. ఈ కారు క్యూమిలేటీవ్ విక్రయాల్లో 35లక్షల మైలురాయిని క్రాస్ చేసి రికార్డును నెలకొల్పింది. మారుతి ఆల్టో తన సెగ్మెంట్‌లో 33 శాతం వాటాను సొంతం చేసుకుంది. గత 14 ఏళ్లుగా దేశీయ మార్కెట్‌లో అత్యధికంగా అమ్ముడైన కారు ఆల్టోనే కావడం విశేషం. ఈ మోడల్ కార్ల విక్రయాల్లో 2017–18లో 6 శాతం అభివృద్ధి సాధించినట్లు మారుతీ తెలిపింది. 2017–18లో తొలిసారి కారు కొనుగోలు చేసేవారిలో 55 శాతం మంది ఆల్టోను ఎంపిక చేసుకున్నట్లు కంపెనీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఆర్.ఎస్.ఖల్సీ తెలిపారు. 25 శాతం మంది కొనుగోలుదారులు తమకు ఉన్న కారుకు అదనంగా ఆల్టోను కొనుగోలు చేశారని, 2006 నుంచి చూస్తే ఆల్టో ప్రతి రెండేళ్లకు 5లక్షల కొత్త వినియోగదారులను ఆకర్షిస్తోందని ఆయన వెల్లడించారు.

వరుసగా నాలుగో రోజు నష్టాలు



- 300 పాయింట్లకు పైగా నష్టపోయిన సెన్సెక్స్

న్యూఢిల్లీ: ఆసియా మార్కెట్ల పతనం సోమవారం దేశీయ సూచీలపై ప్రభావం చూపింది. సెన్సెక్స్, నిఫ్టీలు సూచీలు 1 శాతం మేరకు నష్టపోయాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ 300 పాయింట్లకు పైగా నష్టపోయి 33,747 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్జాతీయ పరిణామాలు, దేశీయ రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో వరుసగా నాలుగో రోజు దేశీయ మార్కెట్లు నష్టాలను చవిచూశాయి. నిఫ్టీ కూడా 10,400 కిందకు పడిపోయింది. స్టీల్, ఆల్యూమినియంపై దిగుమతి సుంకాన్ని పెంచుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో ఆసియా మార్కెట్లు నష్టాల బాటపట్టాయి. ఈ ప్రభావం దేశీయ మార్కెట్లపై కూడా పడింది. లోహ, చమురు, ఇంధన, ఆటోమొబైల్, బ్యాంకింగ్ రంగాల షేర్లు నష్టాల్లో సాగాయి. ఈ ఉదయం 200 పాయింట్లకు పైగా నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. ఎన్ఎస్ఇలో అన్ని రంగాలు బలహీనపడ్డాయి. ఐటి మాత్రం 0.6 శాతం లాభపడగా, మెటల్ సూచీ అత్యధికంగా 3.2 శాతం పతనమైంది. ఇక ఆటో, ఎఫ్ఎంసిజి, రియల్టీ, ఫార్మా బలహీనపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో హిందాల్కో, టాటా మోటార్స్, అరబిందో, టాటా స్టీల్, ఆర్ఐఎల్, ఇన్‌ఫ్రాటెల్, కోల్ ఇండియా, వేదాంతా, బజాజ్ ఆటో, అంబుజా పతనమయ్యాయి.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
టెక్ మహీంద్రా	634.90	606.55	630.85	611.90	18.95	3.10
సన్‌ఫార్మా	552.70	527.05	548.55	535.40	13.15	2.46
టిసిఎస్	3,113.65	3,032.95	3,105.85	3,037.70	68.15	2.24
ఎం అండ్ ఎం	743.00	722.15	739.60	732.55	7.05	0.96
యుపిఎల్	723.35	701.35	720.90	714.25	6.65	0.93
ఎస్‌బిఐ	265.00	258.75	263.50	262.15	1.35	0.51
కోటక్ మహీంద్రా	1,103.85	1,080.80	1,100.00	1,095.70	4.30	0.39
ఎన్‌టిపిసి	165.10	160.05	163.30	163.00	0.30	0.18

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
టాటా మోటార్స్	368.75	350.10	352.05	370.75	18.70	5.04
హిందాల్కో	236.00	228.20	229.60	240.80	11.20	4.65
అరబిందో ఫార్మా	613.00	590.00	600.75	624.10	23.35	3.74
టాటా స్టీల్	669.30	651.80	655.90	675.05	19.15	2.84
అంబుజా సిమెంట్స్	252.50	244.00	246.10	253.15	7.05	2.78
హెచ్‌పిసిఎల్	377.75	365.20	366.75	376.75	10.00	2.65
బజాజ్ ఆటో	3,020.90	2,931.75	2,943.55	3,020.90	77.35	2.56
రిలయన్స్	950.15	921.60	924.10	948.40	24.30	2.56
టాటా పవర్	84.30	81.40	82.15	84.30	2.15	2.55
యస్ బ్యాంక్	319.00	311.15	312.95	321.05	8.10	2.52

ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించారు : కాన్రాడ్



షిల్లాంగ్ : రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా గవర్నర్ గంగప్రసాద్ తనను ఆహ్వానించారని ఎన్‌పిపి అధ్యక్షుడు కాన్రాడ్ సంగ్మా తెలిపారు. కొత్త మంత్రివర్గంతో ప్రమాణ స్వీకారం మంగళవారం జరుగుతుందని ఆయన వివరించారు. 'నాకు మెజార్టీ ఉన్నందున గవర్నర్ నన్ను ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు' అని కాన్రాడ్ తెలిపారు. మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 21 స్థానాలు గెల్చుకుని రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే, కేంద్రంలోను, మణిపూర్‌లోనే భాగస్వామ్యపక్షంగా ఉన్న బిజెపితో కలిసి ఎన్‌పిపి ఇక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నది. కాంగ్రెస్ ఈ రాష్ట్రంలో గత పదేళ్లుగా అధికారంలో ఉంది. 60 స్థానాలు కలిగిన అసెంబ్లీలో కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో కనీస మెజార్టీ కంటే 10 సీట్లు తక్కువగా 21 సీట్లను మాత్రమే గెల్చుకోగలిగింది. ఈ తరుణంలో ఆదివారం గవర్నర్‌ను కలిసిన కాన్రాడ్ మెజా ర్టీ కలిగిన తనకు ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని కోరారు. సమావేశానంతరం కాన్రాడ్ విలేకరులతో మాట్లాడుతూ 'గవర్నర్ అడిగిన 34 మంది ఎంఎల్‌ఎల మద్దతుతో కూడిన సంతకాలను అందజేశాం. ఇందులో ఎన్‌పిపి 19, యుడిపి 6, పిడిఎఫ్ 4, హెచ్‌ఎస్‌పిడిపి, బిజెపి నుంచి ఇద్దరేసి, ఇండిపెండెంట్ ఒకరు ఉన్నారు' అని చెప్పారు.



ఢిల్లీలో ఎస్ఎస్‌సి పేపర్ లీకేజీపై చర్యలకు డిమాండ్ చేస్తూ ఆందోళన

పేపర్ లీకేజీపై సిబిఐ దర్యాప్తు : రాజ్‌నాథ్

న్యూఢిల్లీ : గత నెలలో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సి) నిర్వహించిన పరీక్షల్లో ఓ ప్రశ్నాపత్రం లీకేజ్ కుంభకోణంపై దర్యాప్తును సిబిఐకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఎస్ఎస్‌సి సబార్డినేట్ సర్వీసుల కోసం పరీక్షల నిర్వహించిన మరునాడు ఈ ఆదేశాలు రావడం గమనార్హం. కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ (టయర్-2) పరీక్ష-2017ను గత నెల 17 నుంచి 22 వరకు నిర్వహించగా ఓ ప్రశ్నాపత్రం లీకేజీకి గురయినట్టు ఆరోపణలు వచ్చాయి. కాగా, పేపర్ లీకేజ్ ఆరోపణలపై పరీక్షలకు హాజరైన విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు, డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని సిబిఐ దర్యాప్తునకు ఆదేశించినట్టు కేంద్ర హోం మంత్రి సోమవారం మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. విద్యార్థులు తమ ఆందోళనను విరమించాలని కోరారు. ప్రశ్నాపత్రం లీకేజీని నిరసిస్తూ దీనిపై సిబిఐ విచారణ జరపాలని కోరుతూ నిరుద్యోగులు కమిషన్ కార్యాలయం ఎదుట గత నెల 27 నుంచి నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాగా, బిజెపి ఢిల్లీ చీఫ్, ఎంపి మనోజ్ తివారి, అభ్యర్థుల ప్రతినిధులతో కలిసి కమిషన్ చైర్మన్‌ను ఆదివారం నాడు కలిశారు.

ప్రజా తీర్పు శిరోధార్యం : రాహుల్

న్యూఢిల్లీ : ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఎట్టకేలకు మౌనం వీడారు. ప్రజలు ఇచ్చిన తీర్పును కాంగ్రెస్ పార్టీ గౌరవిస్తుందని అన్నారు. ఓటర్ల విశ్వాసాన్ని తిరిగి పొందేందుకు పార్టీ కృషి చేస్తుందని సోమవారం నాడు ట్విటర్‌లో పేర్కొనారు. ప్రజా తీర్పు శిరోధార్యమని, కోల్పోయిన ప్రజా విశ్వాసాన్ని తిరిగి పొందేందుకు పార్టీ శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని అన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో పార్టీ పటిష్టతకు తాము కట్టుబడి ఉన్నామని ఆయన చెప్పారు. మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం శ్రమించిన కార్యకర్తలను ఆయన అభినందించారు. త్రిపుర, నాగాలాండ్‌లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవకుండా చతికిలపడగా, మేఘాలయలో 21 సీట్లు గెలుచుకుని పెద్ద పార్టీగా నిలిచింది.

ఎఫ్ఐఆర్‌లో ఆదిత్యనాథ్ పేరు లేదు

- సుప్రీంకు తెలియజేసిన జమ్మూకశ్మీర్ ప్రభుత్వం

న్యూఢిల్లీ : ముగ్గురు పౌరులు మృతి చెందిన షోపియన్ కాల్పుల ఘటనకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లో నిందితుడిగా మేజర్ ఆదిత్యనాథ్ కుమార్ పేరు లేదని జమ్మూకశ్మీర్ ప్రభుత్వం సోమవారం నాడు సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వాంగ్మూలాన్ని రికార్డు చేసుకున్న న్యాయస్థానం ఈ కేసులో ఏప్రిల్ 24 వరకు ఎలాంటి దర్యాప్తు చేయరాదని ఆదేశించింది. 'ఏప్రిల్ 24న ఈ కేసుకు సంబంధించి విషయం తుది అంకానికి రానీయండి. అదే విధంగా ఎఫ్ఐఆర్ ఆధారంగా అప్పటి వరకు ఈ కేసులో ఎలాంటి దర్యాప్తు చేయరాదు' అని ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు ఎఎం ఖన్విల్కర్, డివై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో నిందితుడిగా మేజర్ ఆదిత్యనాథ్ కుమార్ పేరు ఉందన్న నేపథ్యంలో ఆదిత్యనాథ్ సహా సైనిక అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని ఫిబ్రవరి 12న సుప్రీంకోర్టు జమ్మూ కశ్మీర్ పోలీసులను ఆదేశించిన విషయం విదితమే. తన కుమారుడి పేరును ఎఫ్ఐఆర్‌లో తప్పుగా, ఏకపక్షంగా నమోదు చేశారని ఆరోపిస్తూ ఆదిత్యనాథ్ తండ్రి కరంవీర్ సింగ్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఆయన వాదనను విన్న కోర్టు పై విధంగా ఆదేశాలు జారీ చేసింది.

చిరునవ్వుతో పరీక్షలు రాయండి : మోడీ

న్యూఢిల్లీ: 10వ తరగతి, 12వ బోర్డ్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం తన అభినందనలు తెలిపారు. అత్యంత ఆత్మవిశ్వాసం, చిరునవ్వుతో వారు పరీక్షలు రాయాలని ఆయన సూచించారు. ఇటీవల జరిపిన మాటామంతీ కార్యక్రమంలో మోడీ బోర్డు పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు 'పట్టు సడలని వైఖరి' కనబరచాలని హితవు పలికారు. ' సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సిబిఎస్ఇ) 10వ తరగతి, 12వ తరగతి పరీక్షలు రాసే నా యువ మిత్రులకు నా శుభాకాంక్షలు(బెస్టాఫ్ లక్). ఈ పరీక్షలను మీరు చిరునవ్వుతో, ఆత్మవిశ్వాసంతో రాయండి' అని మోడీ సోమవారం తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

నేడు సిఐసి నూతన భవనాన్ని ప్రారంభించనున్న ప్రధాని

ఇక్కడి సెంట్రల్ ఇన్ఫార్మేషన్ కమిషన్(సిఐసి) నూతన భవనాన్ని ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం ప్రారంభించనున్నారు. ఈ పారదర్శక సంఘం దాదాపు 12 సంత్సరాల తర్వాత అమలులోకి వచ్చింది. ఇప్పటి వరకు ఈ సంఘం రెండు వేర్వేరు భవనాల నుంచి పనిచేస్తూ వచ్చింది.

ఆరోగ్య పరీక్షలకు ముంబయికి పారికర్




పనాజీ: ఆరోగ్య పరీక్ష చేయించుకోడానికి గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ సోమవారం ముంబయికి విమానంలో తరలి వెళ్లారు. అవసరమైతే ఆయన విదేశాల్లో చికిత్స చేయించుకునే అవకాశం ఉందని ఆయన కార్యలయం తెలిపింది. పారికర్ ముంబయికి బయలుదేరడానికి ముందు డోనా పౌలాలో ఉన్న తన నివాసంలో ప్రభుత్వ సీనియర్ మంత్రులతో భేటీ అయి తన గైర్హాజరులో పాలక నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డిజిపి)తో కూడా సమావేశమయ్యారు. డాక్టర్ల సలహా మేరకే ఆయన ముంబయికి తదుపరి చెకప్ కోసం బయలుదేరారని గోవా ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. ఆయన ప్యాంక్రియాటిక్‌తో బాధపడుతున్నారు. ఇదివరలో లీలావతి ఆసుపత్రిలో ఫిబ్రవరి 15 నుంచి 22 వరకు చికిత్స కూడా చేయించుకున్నారు.

త్రిపుర ఫలితాల ప్రభావం ఉండబోదు: సిద్ధ

బెంగళూరు: మరి కొన్ని రోజుల్లో కర్నాటకలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో త్రిపుర ఎన్నికల ఫలితాల ప్రభావం ఉండబోదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. 'త్రిపుర ఎన్నికల ఫలితాల అనంతరం కర్నాటకపై దాని ప్రభావం గురించి మీడియాలో చాలా ఉత్సుకత ఉంది. 2014 లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత 50 లోక్‌సభ స్థానాల్లోని అసెంబ్లీ విభాగాల్లో ఓడిపోయింది. కేవలం 2 లోక్‌సభ స్థానాలే గెలిచింది. కనుక మనం మన వైఖరిని కోల్పోరాదు. ఇక్కడ(కర్నాటకలో) మోడీ పవనాలేవి వీయడంలేదు' అని ఆయన ఆదివారం ట్వీట్ చేశారు. బిజెపి ఒకవేళ ఆందోళన చెందాల్సి ఉంటే అక్రమ భూకేటాయింపులపై, గనుల లూటీలో నేతృత్వం వహించి ఊచలు లెక్కపెట్టిన బి.ఎస్. యడ్యూరప్ప ఎలా అవినీతి రహిత, స్థిరమైన ప్రభుత్వాన్ని నెలకొల్పగలరన్న విషయంపైనే ఆందోళనపడాలి' అన్నారు. ఇదిలా ఉండగా త్రిపురలో బిజెపి వామపక్ష కోటలో పాగా వేసింది. నాగాలాండ్‌లో ప్రభుత్వంలో భాగస్వామ్యం చేపట్టేందుకు ఆహ్వానం అందుకుంది. మేఘాలయలో సంకీర్ణ ప్రభుత్వానికి అవకాశం ఉంది.

ఈశాన్యపు మెరుపులు.. మలుపులు

త్రిపుర, నాగాలాండ్, మేఘాలయాలు చిన్న రాష్ట్రాలే అయినా ఈనెల 3 నాటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు విస్తృత స్థాయి భారతీయ రాజకీయాలపై ప్రభావం చూపాయి. ఈశాన్యపు ప్రభావం కొన్ని పార్టీలకు ,నేతలకు మెరుపుగా మారినా, కొందరికి అది పిడుగుపాటుగా మారింది. జాతీయ ప్రాంతీయ అంశాలను ప్రభావితం చేయడంలో, ఇదే సమయంలో ప్రముఖుల రాజకీయ అవకాశాలను నిర్దేశించడంలో కీలకంగా మారాయి. దేశంలో జరిగే ఏ అసెంబ్లీ ఎన్నిక అయినా తదనంతరం జరిగే ఇతర ఎన్నికలపై ప్రభావం చూపుతుంది. వివిధ జాతీయ పార్టీ స్థాయి నేతల ప్రతిష్టకు ఈ ఫలితం అందివచ్చే అవకాశంగా,అంకుశంగా మారుతుంది. ఇప్పటి ఎన్నికల ఫలితాలు జాతీయ స్థాయి, ప్రాంతీయ స్థాయి నేతలపై ఏ విధంగా ప్రభావం చూపిందనేది కీలకంగా మారింది.



మోడీకి ఎన్నికల లబ్ధి



ప్రతిష్ట దిగజారుతుందనే విశ్లేషణలకు ప్రధాని మోడీ మరో సారి బ్యాలెట్ ద్వారా జవాబిచ్చినట్లు అయింది. కొన్ని ఎన్నికలలో తగ్గిన బలం,ఇటీవలి బ్యాంకుల కుంభకోణాలతో మోడీకి ప్రజలలో ఆదరణ తగ్గుతోందని భావిస్తూ వస్తున్నారు. అయితే త్రిపురలో గెలుపు తాను దేశంలో ఇప్పటికీ ప్రజలలో ఆదరణ ఉన్న నేతననే మోడీ రుజువు చేసుకున్నారు. ప్రాంతాలు, వర్గాలకు అతీతంగా ప్రాబల్య నేతగా స్థానం పదిలం చేసుకున్నారు. బిజెపి ప్రధాన సైద్ధాంతిక రాజకీయ ప్రత్యర్థి లెఫ్ట్ ఫ్రంట్ నుంచి అధికారం కైవసం చేసుకొనగలిగాడని రుజువు చేసుకున్నారు. ఈశాన్య భారతపు రాజకీయాలలో ఈ విధంగా ఇంతకు ముందెప్పుడూ ఏ ప్రధాని సవాలు విసరలేదు. సవాలులో గెలవలేదు. మూడు రాష్ట్రాలలో విస్తృతంగా ప్రచారం చేయడంతో ప్రధాని మోడీ ప్రతి ఎన్నికకు ప్రాధాన్యతను ఇస్తారని వెల్లడించుకున్నారు. ఏ ఎన్నికను వదిలిపెట్టే ప్రసక్తే లేదనే నైజం ఈ తీర్పుతో మరోసారి వెల్లడైంది.

నిగ్గు తేలని రాహుల్



ఈ ఎన్నికల ఫలితాలు జాతీయ స్థాయిలో రాహుల్ ప్రతిష్టకు ఇబ్బంది కల్గించాయి. ఎన్నికలకు ముందుగానే కీలక కాంగ్రెస్ పార్టీ మూడింట్లో రెండు రాష్ట్రాలు నాగాలాండ్, త్రిపురలో చేతులు ఎత్తేసిందని ప్రచారం జరిగింది. దీనిని కొట్టిపారేయడానికి నేతలు యత్నించలేదనడానికి ఫలితాలు నిదర్శనంగా మారాయి. ఈ విధంగా రాజకీయ శూన్యతను కాంగ్రెస్ సృష్టించుకోవడంతో ఇక్కడి పార్టీ మద్దతుదార్లు, పార్టీపై ఆశల పెట్టుకున్నవారు నిరుత్సాహానికి గురయ్యారు. పార్టీ దెబ్బతింది. ఇది ప్రత్యర్థి పార్టీల బలానికి దారితీసింది. ఈ క్రమంలో మేఘాలయాలో తీర్పు రాహుల్‌కు కొంత ఓదార్పుగా మారింది. అత్యధికస్థానాల పార్టీగా మారింది, అయితే అధికారం అందని ద్రాక్ష అయింది. ఇక రాబోయే కర్నాటక అసెంబ్లీ ఎన్నికలలో విజయం ఒక్కటే శరణ్యంగా మారింది. ఆ తరువాత జరిగే లోక్‌సభ ఎన్నికలకు పార్టీ వేగం పుంజుకోవడానికి మిగిలిన అవకాశంగా మారింది.

రాజకీయ 'షాన్'



ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా శ్రేణులను కదిలించే దిట్టగా మారిన బిజెపి అధ్యక్షుడు అమిత్ షాకు ఈ ఎన్నికలతో పార్టీపరంగా ప్రతిష్ట పెరిగింది. దేశంలో సర్వత్రా విస్తారిత రాజకీయ శక్తిగా బిజెపి ఎదగడంలో అమిత్ షా చేసిన శ్రమ ఫలించింది. స్వయంగా ప్రధాని మోడీనే ఈశాన్యంలో బిజెపి బలానికి అమిత్ షా రూపశిల్పి అని శ్లాఘించారు. గత నాలుగు దశాబ్దాలలో ఏ ఇతర రాజకీయ పార్టీకి లేని అధికార స్థాయి ఇప్పుడు బిజెపికి దక్కింది. మొత్తం 20 రాష్ట్రాలలో బిజెపి ఇతరుల సాయంతో ప్రభుత్వంతో ఉండగా ఇందులో 15 రాష్ట్రాలలో సొంతంగా బిజెపి ప్రభుత్వాలు, సిఎంలు ఉన్నారు. ఈ క్రమంలో షా ఆధ్వర్యంలో బిజెపి అంతకుముందటి ఉత్తరాది పార్టీ ముద్రను తొలిగించుకోగలిగింది. హిందీ ప్రాంతపు పార్టీ అనే వాదన సరికాదని తేల్చుకోగలిగింది. మేఘాలయాలోనూ పార్టీ బాగా పుంజుకుంటుందనే నమ్మకం వమ్ముకావడం అమిత్‌కు చురకగానే మారింది

శిఖరం కూలి కేరళ మిగిలింది



త్రిపురలో సుదీర్ఘకాలపు ముఖ్యమంత్రిగా అంతకు మించి భారతీయ వామపక్షంలో అత్యున్నత స్థాయి నేతగా నిలిచిన మాణిక్ సర్కార్ ఈ ఎన్నికలలో దెబ్బతిన్నారు. కమ్యూనిస్టులు తమకు అతిపెద్ద ముప్పుగా భావించే కాషాయ పార్టీ బిజెపి చేతికి త్రిపురను వదిలివెళ్లిన పరిస్థితి నెలకొంది. త్రిపురలో శాంతిస్థాపనలో మాణిక్ సర్కార్ కీలకంగా మారిన వ్యక్తి. కానీ అభివృద్ధి సాధన, ఉద్యోగ కల్పన, ప్రభుత్వ ఉద్యోగులను సంతృప్త పరచడం.. సత్ఫలితాల లేమితో చివరికి వామపక్షం నష్టం చవిచూడాల్సి వచ్చింది. సర్కార్ అపజయం సిపిఎంకు చేదువార్తగా, ఎదురుదెబ్బగా మారింది. ఇప్పుడు వామపక్షం అధికారం కేవలం కేరళకు పరిమితం అయింది. బెంగాల్‌లో తిరిగి విజయం ఇప్పటి దశలో అల్లంతదూరంలో ఉంది. ఇక జాతీయ రాజకీయాలలో పార్టీ ప్రతిష్ట దెబ్బతింటోంది. త్రిపురలో మాణిక్‌కు మంచి పేరు స్థిరపడిపోయినప్పటికీ తాజా ఫలితంతో సిపిఎం కారణాలను అన్వేషిస్తోంది.

ముకుల్‌కు 'సగం' చిక్కులు



మేఘాలయాలో తిరిగి ప్రభుత్వ ఏర్పాటులో విజయం సాధించకపోయినా సిఎం ముకుల్ కాంగ్రెస్‌కు అతి పెద్ద పార్టీ ఖ్యాతిని నిలిపారు. ఈ ప్రాంతంలో పార్టీ ప్రతిష్ట పుంజుకోవాలంటే ప్రాంతీయ నేతలే కీలకమనే విషయం చాటారు. అయితే ప్రభుత్వ స్థాపనకు పూర్తి స్థాయి మెజార్టీ రాకపోవడంతో ముకుల్ సంగ్మాకు ఉన్న పరిమితులు, ఆయన బలం ఏ పాటిదనేది వెల్లడైంది. నిజానికి ఎన్నికల సర్దుబాట్లు సరిగ్గా కుదుర్చుకుని, సరైన రీతిలో ముందస్తుగానే బలం బేరీజు వేసుకుంటే , గోవా, మణిపూర్ నుంచి గుణపాఠాలు నేర్చుకుని ఉంటే పరిస్థితి మరో విధంగా ఉండేది. సంగ్మానే తిరుగులేని నేత అయ్యేవారు. ఇప్పుడు ఫలితం తేలిన తరువాత పార్టీ బలోపేతానికి ఆయన సుదీర్ఘ పోరు చేయాల్సి ఉంటుంది. ఇక మేఘాలయలో బిజెపి, ఇతరుల మద్దతుతో కూడిన సర్కార్ ఏర్పాటుకు లైన్ క్లియర్ అయింది. దీంతో ముకుల్ మళ్లీ ప్రతిపక్ష పాత్రకు పరిమితం కావాల్సి వస్తుంది.

ముఖ్యమంత్రిత్వమే లక్ష్యంగా రియో



అధికారమే లక్ష్యంగా పరుగులు తీస్తూ వచ్చిన నైఫుల్ రియో మరోసారి నాగాలాండ్ సిఎం అయ్యేందుకు రంగం సిద్ధం అయింది. నాగాలాండ్‌కు 2003, 2014 మధ్యకాలంలో సిఎంగా ఉన్న రియో ఆ తరువాత రాజకీయ రంగుల కేళిలో ఆరితేరారు. ఆకస్మికంగా ఎంపి అయ్యారు, కేంద్ర మంత్రి కావాలనే ఆశతో ఎంపి అయినా బిజెపి ఆయనకు అవకాశం ఇవ్వలేదు. దీనితో ఆయన అప్పటి నుంచి తిరిగి రాష్ట్రరాజకీయాలలో పట్టుకోసం చూస్తూ వస్తున్నారు. తరువాత ఎన్‌డిపిపి స్థాపించారు. బిజెపితో మిత్రపక్షంగా మారారు. ఎమ్మెల్యేగా ఏకగ్రీవంగా ఎన్నికకావడం ఆయనకున్న బలంతోనే సాధ్యం అయింది. ఇక ఎన్నికల ఫలితాలకు ముందే ఎంపి సీటుకు రాజీనామా చేయడం సిఎంగా తిరిగి రావాలని, కోహిమా కింగ్ కావాలనే తపనే కారణం. కొన్ని చిన్న పార్టీలూ, ఇండిపెండెంట్లు మద్దతుతో ఆయన నాగా సిఎం కానున్నారు. ఇది అనిశ్చిత రాజకీయాలలో నిశ్చిత పరిణామమే కానుంది.

చిదంబరానికి బిగుస్తున్న ఉచ్చు

- గోల్డ్ స్కీంతో పిఎన్‌బి శ్కాంకు లింకు
- నీరవ్ మోడీ కోణంలో కేంద్రం ఆరా
- పిఎసి భేటీలో సమీక్ష



న్యూఢిల్లీ : మన్మోహన్ సింగ్ నాయకత్వంలోని యుపిఎ హయాంలో ప్రకటించిన బంగారు పథకాలు అక్రమ వజ్రాల వ్యాపారుల పంట పండిందని కేంద్ర మంత్రి రవి శంకర్ ప్రసాద్ విమర్శించారు.చిదంబరం ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు తీసుకువచ్చిన 80:20 గోల్డ్ స్కీం మెహుల్ ఛోక్సీ, నీరవ్ మోడీ వంటి వజ్రాల వ్యాపారులకు ఉపయోగపడిందని మంత్రి ఆరోపించారు. బంగారం, వజ్రాల దిగుమతికి సంబంధించి ఈ స్కీంను తీసుకువచ్చారు. పిఎన్‌బిలో రూ 12000 కోట్ల రుణ అక్రమాలలో వీరు నిందితులుగా ఉన్నారు. ఆగస్టు 2013లో ఈ గోల్డ్ స్కీం తీసుకువచ్చారని, తరువాత నవంబర్ 2014లో దీనిని ఎత్తివేశారని ఈ మధ్యలోనే భారీ స్థాయిలో మాయ జరిగిందని మంత్రి ఆరోపించారు. దేశంలో ఎన్నికల ఫలితాల ప్రకటన రోజు నే స్కీం రద్దు ప్రకటన వెలువడిందని గుర్తు చేశారు. అప్పటి ఆర్థిక మంత్రి చిదంబరం ఈ గో ల్డ్ స్కీం ద్వారా దేశంలోని ఏడు ప్రైవేటు కంపెనీలకు లబ్ధి చేకూరిందని, చిదంబరం ఆశీర్వాదం ఆయా కంపెనీలకు దక్కిందని కేంద్ర న్యాయ మంత్రి విమర్శించారు. ఈ కంపెనీలలో ప్రధానంగా నీరవ్, ఛోక్సీలకు చెందిన గీతాంజలి కూడా ఉందని తెలిపారు. వజ్రాల వ్యాపారుల ఒత్తిళ్లకు తలొగ్గి ఆ స్కీంతీసుకువచ్చారని , ఇందు లో దిగుమతులపై ఆంక్షలను సరళీకృతం చేశారని, దీనితో ప్రైవేటు సంస్థలు ఇష్టారాజ్యంగా బంగారం, నగలను దిగుమతి చేసుకునే వీలేర్పడిందని తెలిపారు. సిఎడికి చెక్‌పెట్టేందుకు బంగారు దిగుమతులపై ఆంక్షలను విధించే దశలోనే ఈ స్కీం తీసుకువచ్చారని మంత్రి వివరించారు. వ్యాపారులు తాము దిగుమతి చేసుకున్న బంగారంలో 80 శాతం దేశంలో వ్యాపార వినియోగానికి, మిగిలిన 20 శాతం విదేశాలకు పంపించడానికి వీలు కల్పించారని ఈ వెసులుబాటుతో కొన్ని ప్రైవేటు కంపెనీలు భారీగా లాభం పొందాయని, గీతాంజలి ఇందులో ఒకటి అని విశ్లేషించారు. ప్రస్తుతం నీరవ్ , ఛోక్సీల వజ్రాల కంపెనీలు వివాదాస్పదంగా మారాయి. వాటి అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. అయితే వీటికి అప్పటి యుపిఎ స్కీంకు లింక్ ఉందని కేంద్ర మంత్రి ఎదురుదాడిని పెంచారు. అప్పటి ఆర్థిక మంత్రి చిదంబరంపై దృష్టిని కేంద్రీకృతం చేసేలా వ్యాఖ్యానాలకు దిగారు. 2014 నవంబర్‌లో ఎన్‌డిఎ ప్రభుత్వం బంగారం దిగుమతులపై ఆంక్షలను ఎత్తివేసిందని, అంతకు ముందటి గోల్డ్ స్కీంను రద్దు చేసిందని మంత్రి వివరించారు. పలు కంపెనీలు ఆ స్కీం ఆధారంగా అక్రమాలకు దిగాయని ఆరోపణలు వస్తున్నాయి.

పిఎన్‌బిపై చర్చించాల్సిందే

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంపై లోక్‌సభలో మంగళవారం చర్చ జరపాలని ప్రధాన ప్రతిపక్షాలు సోమవారం నాడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. అయితే, ఇతర అంశాలపై చర్చ ముగిసిన అనంతరమే దీనిపై చర్చ నిర్వహిస్తామని ప్రభుత్వం తెలియజేసింది. లోక్‌సభ వ్యవహారాల సలహా సంఘం సమావేశం సోమవారం స్పీకర్ సుమిత్ర మహాజన్ అధ్యక్షతన జరిగింది. ఇందులో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బిజెడి ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకు కుంభకోణంపై మంగళవారం ప్రశ్నోత్తరాల సమయం అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి నాలుగు గంటల పాటు చర్చ జరపాలని కోరాయి. అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి అనంత్ కుమార్ చెప్పారని, అయితే బ్యాంకు కుంభకోణంపై ఎందుకు ఆయన నోరు మెదపడం లేదని ప్రతిపక్ష పార్టీ సభ్యుడొకరు ప్రశ్నించారు.

లోక్‌సభ ఎన్నికల వరకూ సస్పెన్స్

రాజకీయ పార్టీపై సూపర్ స్టార్ రజనీకాంత్

చెన్నై : లోక్‌సభ ఎన్నికలకు ముందు తన రాజకీయ పార్టీపై నిర్ణయాన్ని ప్రకటిస్తానని ప్రముఖ నటుడు రజనీకాంత్ తెలిపారు. చెన్నైలో సోమవారం డాక్టర్ ఎంజిఆర్ విద్యా పరిశోధన సంస్థలో ఎంజిఆర్ కాంస్య విగ్రహావిష్కరణకు సూపర్‌స్టార్ తరలివచ్చారు. విగ్రహావిష్కరణ తరువాత విలేకరులతో ఆయన మాట్లాడారు. రాజకీయ ప్రయాణాలు అనుకున్నంత సులువు కాదని, ఈ మార్గంలో తీవ్రపోరు ఉంటుందని రజనీ చెప్పారు. రాజకీయాల గురించి తాను కరుణానిధి, మూపనార్ వంటి ప్రముఖుల నుంచి ఎంతో తెలుసుకున్నానని రాజకీయాల పయనం వైకుంఠపాళి వంటిదని పాములు నిచ్చెనలు ఉంటాయని, ముళ్లు ఉంటాయి, పూలూ ఉంటాయని తెలిపారు. తాను రాజకీయాలలోకి లోక్‌సభ ఎన్నికలకు ముందు వస్తానని చెప్పిన రజనీ ఈ ఎన్నికలలో పోటీ చేస్తారా? అనేది వెల్లడించలేదు. అప్పుడే కీలక నిర్ణయం ఉంటుందన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలలో అన్ని స్థానాలకు పోటీ చేయవచ్చునని సూచనప్రాయంగా తెలిపారు. ప్రస్తుత అన్నాడిఎంకె ప్రభుత్వం పెద్దలు సినిమా వాళ్లు రాజకీయాలలోకి రావడాన్ని ఎందుకు వ్యతిరేకిస్తున్నారో తెలియడం లేదని రజనీ చెప్పారు. ఎంజిఆర్ తనకు మంచి మిత్రుడని చెప్పిన రజనీ , ఎంజిఆర్‌తో తన స్నేహ బంధం గురించి అందరికీ తెలియదని వెల్లడించారు. ప్రజలకు ఎంజిఆర్ అందించిన పాలన వంటి పాలనను అందిస్తానన్నారు.



పార్లమెంట్‌ను కుదిపేసిన పిఎన్‌బి శ్కాం

- ప్రతిపక్షాల నిరసనలు
- ఎపికి ప్రత్యేక ప్యాకేజీ కోసం టిడిపి ఆందోళన

న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకు (పిఎన్‌బి) కుంభకోణం సోమవారం నాడు పార్లమెంటు ఉభయ సభలను కుదిపేసింది. రెండో విడత బడ్జెట్ సమావేశాల మొదటి రోజున సభ ప్రారంభం కాగానే పిఎన్‌బి కుంభకోణంపై లోక్‌సభలో ప్రతిపక్ష కాంగ్రెస్ నిరసన వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయగా, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టిడిపి సభ్యులు ఆందోళనకు దిగారు. వీరితో పాటు టిఆర్ఎస్, ఎఐఎడిఎంకె సభ్యులు కూడా నిరసన వ్యక్తం చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఈ నిరసనలు కొనసాగుతుండడంతో సభలో గందరగోళం నెలకొంది. దీంతో స్పీకర్ సుమిత్ర మహాజన్ సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభం కాగానే..కాంగ్రెస్ సభ్యులు ప్లకార్డులతో వెల్‌లోకి దూసుకెళ్లారు. నీరవ్ మోడీ ఎక్కడున్నాడో ప్రధాని నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు కూడా ఇదే డిమాండ్‌ను లేవనెత్తారు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టిడిపి సభ్యులు వెల్ వద్ద నిరసనకు దిగగా, తెలంగాణకు రిజర్వేషన్ కోటా పెంచాలని డిమాండ్ చేస్తూ టిఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో నైఫీ రియో లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా పత్రాన్ని అందజేశారని సుమిత్ర మహాజన్ సభలో నిరసనల మధ్య ప్రకటించారు. 'ఫిబ్రవరి 22 నుంచి అమలులోకి వచ్చే విధంగా ఈ రాజీనామాను ఆమోదిస్తున్నాను' అని ప్రకటించారు. సభ ప్రారంభానికి ముందు ప్రధాని మోడీ సభలోకి వస్తుండగా బిజెపి సభ్యులు కరతాళ ధ్వనులు చేశారు. తమ పార్టీ సభ్యులతో పాటు ప్రతిపక్ష సభ్యులకు మోడీ పలుకరిస్తూ ముందుకు సాగారు.

రాజ్యసభలోనూ ఇదే తీరు..

రాజ్యసభలోనూ సోమవారం ఇదే దృశ్యం కనిపించింది. పిఎన్‌బి కుంభకోణంపై ప్రతిపక్షాలు నిరసనలతో హోరెత్తించాయి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎన్‌డిఎ భాగస్వామ్యపక్షమైన టిడిపి ఆందోళన చేపట్టింది. ఈ నిరసనలతో ఉదయం రెండు సార్లు వాయిదా పడిన అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి ప్రారంభం కాగా నీరవ్ మోడీ వ్యవహారంపై, కావేరి జలాల నిర్వహణ బోర్డు ఏర్పాటుపై ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించాయి. నిరసనలు ఎంతకూ ఆగకపోవడంతో 'మీరంతా వేర్వేరు అంశాలపై ఆందోళన చేస్తున్నారు. నాకు తెలుసు ప్రతి అంశం చాలా ముఖ్యమైనదే' అని డిప్యూటీ చైర్మన్ కురియన్ వ్యాఖ్యానించారు. బ్యాంకు ల కుంభకోణాలపై స్వల్పకాలిక చర్చ కు జరుగుతుందని, అనంతరం వివిధ అంశాలపై ఒకరు తర్వాత ఒకరు మాట్లాడవచ్చని వారికి సూచించారు. అయినప్పటికీ సభ్యులు శాంతించకపోవడంతో చివరికి సభను వాయిదా వేశారు. అంతకు ముందు తొలుత ఇదే అంశాలపై సభ్యులు నిరసనలు వ్యక్తం చేస్తుండడంతో చైర్మన్ ఎం.వెంకయ్య నాయుడు సభను పది నిమిషాల పాటు వాయిదా వేశారు. తిరిగి ప్రారం భం కాగానే, తిరిగి ఆందోళన కొనసాగిస్తుండడంతో సభ్యులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మనం సభలో ఉన్నామా? ఇంకెక్కడైనా ఉన్నా మా? అని ప్రశ్నించారు. మీరు వ్యవహరిస్తున్న తీరు ప్రజలకు కోపాన్ని తెప్పిస్తుందని అన్నారు. అనంతరం సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు.





డోక్లాంలో హెలిపాడ్‌లు నిర్మిస్తున్న చైనా: నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: డోక్లాంలో చైనా, భారత్ దళాల మధ్య ఏర్పడిన ప్రతిష్టంభన తర్వాత రెండు దేశాలు ఓ అంగీకారంతో తమ బలగాలను తగ్గించుకుని పూర్వస్థితిని నెలకొల్పాయని రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం ఒక ప్రశ్నకు సమాధానం ఇస్తూ లోక్‌సభకు తెలిపారు. 'శీతాకాలంలో తమ బలగాలను ఉంచేందుకు చైనా సైన్యం పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పిఎల్ఎ) సెంట్రీ పోస్టులు, ట్రెంచ్‌లు, హెలిపాడ్లు సహా ఇతర మౌలికవసతులు నిర్మించినట్లు ఆమె తెలిపారు. డోక్లాం ప్రాంతంలో చైనా ఏడు హెలిపాడ్లు నిర్మించడమే కాక ట్యాంకులు, క్షిపణులను మోహరించినట్లు ఉపగ్రహ చిత్రాల ద్వారా తెలిసిందని అన్నారు. సరిహద్దుకు సంబంధించిన విషయాలను దౌత్య మార్గాల ద్వారా చైనాకు రెగ్యులర్‌గా తెలుపుతూనే ఉన్నామన్నారు. ఇదిలా ఉండగా భారత్ తన దృష్టిని పాకిస్థాన్ నుంచి తప్పించి చైనా మీద కేంద్రీకరించాల్సిన సమయం ఆసన్నమైందని ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ జనవరిలోనే చెప్పారు. పాకిస్థాన్‌లో చైనా సైనిక స్థావరాన్ని చైనా నిర్మిస్తోందన్న పెంటగాన్ నివేదికపై ఇంకో ప్రశ్నకు నిర్మలా సీతారామన్ సమాధానమిస్తూ ప్రభుత్వం నిరంతరం గమనిస్తూనే ఉందన్నారు. సముద్ర జలాల్లో తిరుగులేని శక్తిగా ఎదగాలని చైనా భావిస్తున్న విషయం గురించి ప్రభుత్వానికి తెలుసునని అన్నారు.

టెక్సాస్ జడ్జి రేసులో ఎన్ఆర్ఐ

హూస్టన్: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో జడ్జి పదవికి భారతీయ అమెరికన్ అటార్నీ షంపా ముఖర్జీ పోటీపడుతున్నారు. టెక్సాస్‌లోని హారీస్ కౌంటీకి చెందిన 269వ సివిల్ డిస్ట్రిక్ట్ కోర్టుకు ఆమె తన అభ్యర్థిత్వాన్ని దాఖలు చేశారు. దేశంలోని సివిల్ కోర్టులకు ఎన్నో సేవలు అందించాలన్న ఉద్దేశంతోనే తాను ఆ జడ్జి సీటుకు పోటీపడుతున్నానని డెమోక్రటిక్ అభ్యర్థి అయిన ఆమె చెప్పారు. ' అందరికీ కోర్టుల అందుబాటు, జ్యూరీ విచారణ హక్కును కల్పించే 7వ సవరణను తాను విశ్వసిస్తున్నాను' అని ఆమె ఈ సందర్భంగా అన్నారు. పార్టీ ప్రైమరీల తొలి ఓటింగ్ ఫిబ్రవరి 20న జరిగింది. ఎన్నిక రేపు(మంగళవారం) జరగనుంది. ప్రైమరీలో గెలిచిన అభ్యర్థి తదుపరి అధికారంలో ఉన్న రిపబ్లికన్ అభ్యర్థి.. జడ్జి డాన్ హిందెతో తలపడతారు. హూస్టన్‌కు చెందిన షంపా ముఖర్జీ 1960 దశకంలో అమెరికాకు వలసపోయిన భారతీయ దంపతుల కూతురు. ఆమె తండ్రి అమెరికాలోని ఆయిల్ అండ్ గ్యాస్ ఇండస్ట్రీలో ఇంజినీర్‌గా పని చేశారు. రిటైర్ అయ్యాక ఆయన ఫిలాసఫీలో డాక్టరేట్ చేశారు. గ్రాడ్యుయేట్ అయిన ఆమె తల్లి గృహిణిగా బాధ్యతలు నిర్వహించి తన ముగ్గురు సంతానాన్ని పెంచి పోషించింది. షంపా ముఖర్జీ యూనివర్సిటీ ఆఫ్ హూస్టన్ లా సెంటర్ స్కూల్‌లో లా చదివారు. చదువుకునే రోజుల్లోనే ఆమె హూస్టన్ జర్నల్ ఆఫ్ హెల్త్ లా అండ్ పాలసీ అనే పత్రికకు సంపాదకురాలిగా పనిచేశారు.

భారత ఎంబసీ పేరిట అక్రమాలు!


వాషింగ్టన్: అమెరికాలో కొందరు మోసగాళ్లు ప్రజల నుంచి డబ్బులు దండుకునేందుకు అమెరికాలోని భారతీయ రాయబార కార్యాలయం టెలిఫోన్ లైన్ల నకళ్లను రూపొందించారు. ఈ నేపథ్యంలో అనుమానస్పద కాల్స్ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని అక్కడి రాయబార కార్యాలయం హెచ్చరించింది. ఈ విషయమై భారతీయ రాయబార కార్యాలయం అమెరికా ప్రభుత్వానికి తెలుపడమేకాక, స్వయంగా అంతర్గత పరిశోధనను చేపట్టింది. ప్రజలను ఈ విషయంలో హెచ్చరిస్తూ అరుదైన 'పబ్లిక్ అడ్వయిజరీ'ని జారీ చేసింది. భారతీయ దౌత్య కార్యాలయానికి చెడ్డ పేరు తెచ్చేందుకే ఈ చర్యను మోసగాళ్లు చేపట్టారని ప్రజలను హెచ్చరించింది. ఈ మోసగాళ్లు భారతీయుల నుంచి క్రెడిట్ కార్డు వివరాలు వంటివి తెలుసుకోవడం లేక పాస్‌పోర్టు, వీసా ఫారాల్లో తప్పులున్నాయని, వాటిని సరిచేస్తామన్న మిషతో డబ్బులు దండుకునే ప్రయత్నం చేయడం వంటి మోసాలకు పాల్పడతారని హెచ్చరించింది. మోసగాళ్లు భారతీయులను మోసగించేందుకు ఉపయోగించిన లైన్లు దౌత్యకార్యాలయం నకిలీ లైన్లు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ మోసాలకు సంబంధించిన సమాచారాన్ని అమెరికాలోని భారతీయ రాయబార కార్యాలయం సేకరిస్తోంది. వ్యక్తిగత వివరాలు తెలుసుకునేందుకు భారతీయ రాయబార కార్యాలయం అధికారులెవరూ ఫోన్లు చేయరని కూడా తన అడ్వయిజరీలో ఎంబసీ పేర్కొంది. మోసపూరిత టెలిఫోన్ కాల్స్‌ను నమ్మొద్దని కూడా హెచ్చరించింది.వ్యక్తిగత వివరాలు తెలుపడం, డబ్బులు చెల్లించడం వంటివి చేయొద్దని సూచించింది.అమెరికా ప్రభు త్వ అధికారులు కూడా తమకు ఇప్పటికే ఇలాంటి ఫిర్యాదులు అందాయని తెలిపారు. ముఖ్యంగా యూరోప్ జాతీయుల నుంచి అని చెప్పారు.

అబుదాబి లక్కీ డ్రాలో 'భారతీయం'



అబుదాబి : అబుదాబి 'బిగ్ టికెట్ లక్కీ డ్రా'లో భారతీయులకు జాక్‌పాట్ తగిలింది. ఈ లక్కీ డ్రా విజేతలు 8మందిలో ఏడుగురు భారతీయులే. వీరంతా భారీ మొత్తం గెల్చుకున్నారు. సోమవారం అబుదాబి అంతర్జాతీయ విమానాశ్రయంలో నిర్వహించిన లక్కీ డ్రాలో విజేతలను ప్రకటించారు. కేరళకు చెందిన థాన్సిలాస్ బాబు మాథ్యూస్ 7 మిలియన్ల దినార్‌లు (దాదాపు 12.5 కోట్లు) గెలుచుకున్నాడు. ఈ లాటరీ తలగటడం నమ్మలేకపోతున్నానని థాన్సిలాస్ ఆనందాన్ని వ్యక్తం చేశాడు. గత నెలలో రాఫెల్ బొనాంజా బిగ్ లక్కీ మిలియనీర్ లాటరీ టికెట్ నెంబర్ 030202 కొనుగోలు చేయగా, డ్రాలో పెద్ద మొత్తమైన 12.5 కోట్లు గెలుచుకున్నాడు. ఇదే డ్రాలో మరో ఆరుగురు భారతీయులు ఒక్కొక్కరు దాదాపు 18 లక్షలు గెలుపొందారు. బిగ్ టికెట్ లక్కీ డ్రా విజేతల్లో ఏడుగురు భారతీయులు కాగా, బెహ్రెయిన్ కు చెందిన మరో వ్యక్తి ఉన్నారు. ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు చేతులకు రావడంతో విజేతలు అమితాశ్చర్యానికి గురయ్యారు.

సింగిల్ జడ్జి ఆదేశాలు రద్దు



మన తెలంగాణ/హైదరాబాద్ : వాల్తేరు వార్డులోని 1027, 1028, 1029, 1196, 1197 సర్వే నెంబర్లల్లోని భూమిని రిజిస్ట్రేషన్ జరపకుండా విశాఖ జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులపై గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను సోమవారం డివిజన్ బెంచ్ రద్దు చేసింది. వాల్తేరు వార్డులోని దసపల్ల హిల్స్‌కు చెందిన భూమిని జిల్లా కలెక్టర్ నిషేధిత జాబితాలో చేర్చారు. దీనిపై పిటిషనర్ల పేరిట భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని విశాఖ రిజిస్ట్రేషన్ సబ్ రిజిస్ట్రార్ వన్‌ను గతంలో సింగిల్ జడ్జి ఆదేశించారు. ఈ నిర్ణయాన్ని పలువురు సవాల్ చేసిన వ్యాజ్యాలను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మి లతో కూడిన డివిజన్ బెంచ్ విచారించారు. దసపల్లా హిల్స్‌పై రిట్‌ను విచారణ దశలోనే సింగిల్ జడ్జి రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించడాన్ని అప్పీల్ రిట్లల్లో తప్పుపట్టారు. సింగిల్ జడ్జి ఉత్తర్వుల్ని బెంచ్ రద్దు చేస్తూ పూర్తి వివరాల్ని సింగిల్ జడ్జి వద్ద వాదనల సమయంలో తెలియజేయాలని బెంచ్ ఇరుపక్షాలను ఆదేశించింది. రాణి కమలాదేవి ఇతరులు దాఖలు చేసిన రిట్లపై వివరణ ఇవ్వాలని ఏపీ సర్కార్‌ను హైకోర్టు ఆదేశించింది. విచారణ 7వ తేదీకి వాయిదా వేసింది.

ఇండియా సిమెంట్స్‌పై తీర్పు వాయిదా

మన తెలంగాణ/హైదరాబాద్:ఇండియా సిమెంట్స్‌కు గనుల లీజు, నీటి కేటాయింపులపై ఈడీ నమోదు చేసిన కేసు విచారణకు స్వయంగా కోర్టు విచారణకు హాజరుకావాలన్న ఉత్తర్వుల్ని రద్దు చేయాలని కోరుతూ ఆ కంపెనీ చైర్మన్ శ్రీనివాసన్ దాఖలు చేసుకున్న వ్యాజ్యంపై హైకోర్టు తీర్పు వాయిదా పడింది.శ్రీనివాసన్ పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో వాద ప్రతివాదనలు ముగియడంతో తీర్పును తర్వాత వెలువరిస్తామని న్యాయమూర్తి షమీమ్ అక్తర్ వెల్లడించారు. వయసు మీదపడినందున, ఇప్పటికే ఇదే తరహా ఆరోపణలపై సీబీఐ పెట్టిన కేసును హైకోర్టు కొట్టేసినందున ఈకేసులో కూడా తనకు అనుకూలంగా ఉత్తర్వులు ఇవ్వాలని శ్రీనివాసన్ లాయర్ వాదించారు.కోర్టుకు హాజరయ్యేందుకు శ్రీనివాసన్‌కు ఎందుకు అభ్యంతరమో అర్థం కావడం లేదని, అంత వయసులో అనేక వ్యాపారాలు ఎలా చేయగలుగుతున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ తరపు లాయర్ ప్రతివాదన చేశారు.అనంతరంహైకోర్టుతీర్పు వాయిదా పడింది.

బహుళ పార్టీలతో అనర్థాలు

చైనా రాజకీయ విధానం అపూర్వం : జిన్‌పింగ్



బీజింగ్ : బహుళ పార్టీల ప్రజాస్వామ్యం సరికాదని, ఇది పరమచెత్త పోటీకి దారితీస్తుందని చైనా అధ్యక్షులు జి జిన్‌పింగ్ స్పష్టం చేశారు. చైనాలో చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) పాలన అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. అపరిమిత కాలం దేశాధ్యక్ష పదవిలో సాగేందుకు విస్తృతాధికారాలను పొందే దశలో జిన్‌పింగ్ ఉన్నారు. దేశంలో సిపిసి బలోపేతం చేసిన ఏక పార్టీ విధానాన్ని జిన్‌పింగ్ కొనియాడారు. అధికార మార్పిడిని, అనవసర సమస్యలను ఈ ప్రక్రియ నివారిస్తుందని అభిప్రాయపడ్డారు. బహుళ పార్టీల ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీల మధ్య అసంబద్ధ పోటీ అనర్థాలకు దారితీస్తుందని చెప్పారు. దేశంలో ప్రాబల్యం ఉన్న సిపిసి ఆజమాయిషిలోనే నామమాత్రంగా ఉన్న వివిధ చిన్న పార్టీల ప్రతినిధులను ఉద్దేశించి సోమవారం జిన్‌పింగ్ మాట్లాడారు. దేశంలో సరైన రాజకీయ విధానాన్ని ఖరారు చేసిన ఘనత సిపిసికి దక్కుతుందని, సిపిసి ఆధ్వర్యంలో సాగే బహుళ పార్టీల సహకార ధోరణి, రాజకీయ సంప్రదింపుల ప్రక్రియ సముచితంగా ఉందని దేశాధ్యక్షులు అభిప్రాయపడ్డారు. ఆయన చేసిన ప్రసంగం వివరాలను అధికారిక వార్తా సంస్థ జిన్హువా వెల్లడించింది. చైనా రాజకీయ విధానం ఆదర్శంగా ఉందని, అపూర్వమని జి తెలిపారు. రాజకీయ పార్టీలు, ప్రజలు అన్నింటికీ అతీతంగా వ్యవహరించేందుకు ఉమ్మడి లక్ష్యం సాధించుకునేందుకు సరైన వాతావరణం ఇప్పటి వ్యవస్థలో ఉందని ఆయన పేర్కొన్నారు. ఏక పార్టీ పాలనలో ఉండే లొసుగులు, కొన్ని తప్పిదాలు గుర్తించి వాటినిఎప్పటికప్పుడు చక్కదిద్దే దిశలో సిపిసి సంవిధానం ఉందని తెలిపారు. నూతనత్వం సంతరించుకున్న సంవిధానంతో అధికార దుర్వినియోగానికి చెక్ పెట్టడం జరుగుతోందని, ఇదే సమయంలో పార్టీల మధ్య అనవసర పోటీని నివారిస్తుందని వెల్లడించారు. ఏ వ్యవస్థ అయినా ఉమ్మడి లక్ష్యాలను దెబ్బతీసే సంకుచిత పోటీతో దెబ్బతింటుందన్నారు. తరచూ అధికార మార్పిడి వల్ల వచ్చే అనర్థాలకు కళ్లెం ఉంటుందని , దీని వల్ల దేశ ప్రయోజనాల కోణంలోనే దృష్టి సారించేందుకు, ఎక్కువ కాలం పరిపాలనపై కేంద్రీకృతం అయ్యేందుకు వీలేర్పడుతుందని జిన్‌పింగ్ తెలిపారు. పాత సంవిధానపు పార్టీ వ్యవస్థలో కొన్ని లోపాలు ఉండేవని విశ్లేషించారు. వీటి వల్ల కొన్ని నిర్థిష్ట రాజకీయ పార్టీలు లేదా వర్గాలు, ప్రాంతాలు, బృందాల ప్రయోజనాలకు ప్రాధాన్యత లభించేది. దీనితో సామాజిక సంక్షేమ విచ్ఛిత్తి జరిగేదని తెలిపారు.

ప్రజాస్వామ్యమే కీలకం : సిపిసికి అనుసంధానం కావడం ప్రజాస్వామ్యంతో దూరం పాటించడం కాదని జిన్‌పింగ్ స్పష్టం చేశారు. పై గా మరింత సమర్థవంతం, విస్తృతమైన ప్రజాస్వామిక రూపం ఇప్పటి వ్యవస్థతతో రూపొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కమ్యూనిస్టేతర పక్షాలూ, ప్రజలు పార్టీలకు అతీతంగా ఉండే వారు కూడా దేశ నిర్మాణ ప్రక్రియలో సరైన సలహాదారులుగా, పాలనా దిశలో సహాయకులుగా ఉండాలని కోరారు.

అత్యంత కీలక నిర్ణయాలు తీసుకునే దిశలో చైనా పార్లమెంట్, నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్(ఎన్‌పిసి) రెండు వారాల వార్షిక సమావేశాలు సోమవారం ఆరంభం అయ్యాయి. అధ్యక్ష , ఉపాధ్యక్ష పదవి కాలపరిమితిని తొలిగించడం , ఇప్పటి దేశాధ్యక్షుడికి శాశ్వత అధికారం కట్టబెట్టడం, నలుగురు ఉప ప్రధానులను నియమించం వంటి పలు కీలక నిర్ణయాలు పార్లమెంట్ అజెండాలో ఉన్నాయి. ఈ తరుణంలోనే దేశంలో రాజకీయ వ్యవస్థ గురించి జిన్‌పింగ్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను

పార్లమెంట్, ఎన్‌పిసి కీలక భేటీ

సంతరించుకున్నాయి. నియంతృత్వ పోకడలను అరికట్టేందుకు, సమిష్టి నాయకత్వ విధానాన్ని ప్రోత్సహించడం వంటి కీలక అంశాలతో సిపిసి వ్యవస్థ సాగుతోంది. ఈ అంశాలతో జిన్‌పింగ్ అధికార కాలపరిమితికి ఏర్పడుతోన్న ఇబ్బందులను సిపిసి సమర్థదంతంగా తొలిగించుకుంది. రెండు పర్యాయాల కన్నా ఎక్కువ సార్లు కూడా జిన్‌పింగ్ అధికారంలో సాగేందుకు వీలు కల్పించడం ద్వారా ఆయనే జీవితకాలపు అధ్యక్షులు అయ్యేందుకు మార్గం ఏర్పడింది.అంతేకాకుండా నేషనల్ పీపుల్స్ కాం గ్రెస్ కీలక సమావేశాల సందర్భంగానే సోషలిజంలో జి జిన్‌పింగ్ ఆలోచనా విధానాలను ప్రవేశపెట్టేందుకు వీలు కల్పించే కీలక నిర్ణ యం తీసుకోనుంది. ఇందుకు రాజ్యాంగ సవరణ ముసాయిదాను సిద్ధం చేశారు.

మన కన్నా మూడింతలు

చైనా రక్షణ వ్యయం భారీగా పెంపు

బీజింగ్ : చైనా ఈ ఏడాది తమ దేశ రక్షణ వ్యయాన్ని భారీగా పెంచింది. 2018 సంవత్సరానికి ప్రకటించిన డిఫెన్స్ బడ్జెట్‌లో వ్యయ కేటాయింపులను 8.1 శాతం పెంచారు. ఈ ఏడాది దేశ రక్షణ వ్యయాన్ని 175 బిలియన్ డాలర్లుగా ఖరారు చేసింది. భారతదేశపు రక్షణ వ్యయంతో పోలిస్తే ఇది మూడు రెట్లు ఎక్కువ. సైనిక ఆధునీకరణ ప్రక్రియను మరింతగా వేగవంతం చేయాలని బడ్జెట్‌లో నిర్దేశించారు. విధాన నిర్ణయాల కీలక వ్యవస్థ అయిన నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పిసి)కి సోమవారం బడ్జెట్ నివేదికను సమర్పించారు. ఇందులో రక్షణ వ్యయం గత ఏడాది బడ్జెట్‌ను మించిపోయింది. 2018లో చైనా రక్షణ వ్యయం చైనా కరెన్సీలో 1.11 ట్రిలియన్ యువాన్లుగా ఉంటుంది. గత ఏడాది చైనా రక్షణ బడ్జెట్ 150.5 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇప్పుడు దీనిని 8.1 శాతం పెంచడం ద్వారా ప్రపంచంలో అమెరికా తరువాతి స్థానంలో అత్యధిక రక్షణ వ్యయం దేశంగా ఇప్పుడు చైనా నిలిచింది. ఓ వైపు అమెరికా రక్షణ వ్యయం ప్రతిపాదనలు వచ్చే ఏడాదికి 686 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. దేశ సైనిక బలగాలను అన్ని విధాలుగా తీర్చిదిద్దాలని, ప్రత్యేకించి అధునాతన వ్యవస్థలను జోడించుకోవాలని చైనా అధ్యక్షుఏలు దేశ సైనిక దళాల ప్రధానాధికారి అయిన జిన్‌పింగ్ భావిస్తున్నారు.ఇందుకు అనుగుణంగానే ఇప్పుడు కేటాయింపులు జరిగాయి. త్రివిధ బలగాలను మరింత పటిష్టం చేసుకోవాలని , సరికొత్త యుద్ధ విమానాలతో పటిష్టం కావాలని చైనా సంకల్పించింది. ప్రత్యేకించి సముద్ర జలాలలో చైనా ఉనికిని చాటుకునేందుకు అవసరమైన సరికొత్త యుద్ధ నౌకలు తోడుగా విమాన బలగాలను పెంచుకోవాలని నిర్ణయించారు. రక్షణ వ్యయం పెంపుదలను చైనా సమర్థించుకుంది. ఇంతకు ముందు కన్నా స్వల్పస్థాయి పెంపుదల అని, ఇది సాధారణం అని తెలిపింది.



'సుంజువాన్' దాడి సూత్రధారి వకాస్ హతం






శ్రీనగర్: జైషే మహమ్మద్ ఉగ్రసంస్థకు చెందిన టాప్ కమాండర్ ముఫ్తీ వకాస్ హతమయ్యాడు. జమ్మూకశ్మీర్‌లోని సుంజువాన్ ఆర్మీ క్యాంపుపై దాడికి ప్రధాన సూత్రధారి అయిన వకాస్‌ను భారత ఆర్మీ, కశ్మీర్ పోలీసులు, సిఆర్‌పిఎఫ్ నిర్వహించిన ఆపరేషన్‌లో భాగంగా మట్టుపెట్టాయి. కశ్మీర్‌లోని అవంతీపూర్‌లో ఉగ్రకదలికలు ఉన్నట్లు గుర్తించిన 50 రాష్ట్రీయ రైఫిల్స్ బృందాలు, భారత ఆర్మీ, స్థానిక పోలీసులు గాలింపు చర్యలు నిర్వహించారు. హతివారాలో జరిపిన ఎన్‌కౌంటర్‌లో సంజువాన్ ఆర్మీ క్యాంపు దాడి ప్రధాన నిందితు డు ముఫ్తీ వకాస్ హతమయ్యాడని శ్రీనగర్ ఆర్మీ క్యాంపు అధికార ప్రతినిధి కల్నల్ రాజేశ్ కలియా మీడియాకు వివరించారు. ఓఎకె 47 రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నామని, ఈ ఆపరేషన్‌లో పౌరులెవరికీ ఎలాంటి హానీ జరగలేదన్నారు. నూర్ మహమ్మద్ అనంతరం జైషే ఉగ్రసంస్థకు వకాస్ ప్రధాన కమాండర్‌గావ్యవహరించిన విషయం తెలిసిందే.గత నెలలో జమ్మూ నగ ర శివార్లలోని సంజువాన్ ఆర్మీక్యాంపుపై జరిగిన ఉగ్రదాడిలో ఒక పౌరుడు, ఐదుగురు ఆర్మీ సిబ్బందితో కలిపి మొత్తం ఆరుగురు మృత్యువాతపడ్డారు.

కశ్మీర్‌లో నిరసనలు : కశ్మీర్‌లో సోమవారం అనేక చోట్ల నిరసనలు చోటు చేసుకున్నాయి. దీంతో ప్రభుత్వ బలగాలు నిరసనకారులపై బాష్పవాయువు ప్రయోగించారు. ఇద్దరు లష్కరే తోయిబా ఉగ్రవాదులు, నలుగురు పౌరులు సహా ఆరుగురిని సైన్యం చంపేయడంతో నిరసనకారులు వీధుల్లోకి వచ్చి మరీ నిరసనలు ప్రదర్శించారు. దక్షిణ కశ్మీర్‌లో అధికారులు కర్ఫ్యూ విధించినప్పటికీ వందలాది మంది ఆంక్షలను ఉల్లంఘించి లష్కరే తోయిబా కమాండర్ అంత్యక్రియలకు హాజరయ్యారు. అయితే చంపబడిన అందరూ తీవ్రవాదులేనని సైన్యం చెబుతోంది. షోపి యాన్ సైనిక స్థావరం బయట చెక్‌పా యింట్‌లో ఓ కారు ఆపడానికి నిరాక రించడంతో ఆదివారం రాత్రి సమస్య తలెత్తిందని అధి కా రులు తెలిపారు. ఆదివారం రాత్రి నలుగురు చని పోయి నట్లు, వారి మృతదేహాలను సోమవారం ఉదయం స్వాధీనం చేసుకున్నట్లు పోలీ సులు తెలిపారు. కాల్పులు జరిగిన ప్రదేశా నికి దాదాపు 6 కిమీ. దూరంలో తూటాలతో తూట్లు పడిన లష్కరే తోయిబా ఉగ్రవాది అషిఫ్ హుస్సేన్ భట్ మృత దేహం లభించిందని పోలీసులు తెలిపారు. అతడు 2017 నవంబర్ 13 నుంచి కనిపించకుండా పోయాడు. పౌరుడు గోహ్వార్ అహ్మద్ లోనే(24) మృత దేహం కాల్పులు జరిగిన ప్రదేశానికి 250 మీటర్ల దూరంలో సోమవారం లభించింది. ఆదివారం మరణించిన ముగ్గురు యువకులను సుహైల్ అహ్మద్ వాగేన, నవాజ్ అహ్మద్ వాగే, షాహిద్ ఖాన్‌గా స్థానికులు గుర్తించారు.

ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్రానిదే

• విభజనతో ఏపి చాలా నష్టపోయింది • అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు • బడ్జెట్ ప్రసంగంలో గవర్నర్ నరసింహన్



అమరావతి: విభజన కారణంగా ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోయిందని తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ నరసింహన్ అన్నారు.ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయసభలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు చాలా కష్టాల్లో ఉన్నారని.. రాష్ట్రాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్రానిదేనని పేర్కొన్నారు. నూతన భవనాల్లో రెండోసారి బడ్జెట్ సమావేశాలు నిర్వహించుకోవడం సంతోషదాయకంగా ఉందని గవర్నర్ అన్నారు.

గవర్నర్ ప్రసంగంలో ... విభజన కారణంగా ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా చాలా నష్టపోయింది. ప్రధాన ఆర్థిక కేంద్రాన్ని కోల్పోయింది. రాజధాని లేని రాష్ట్రంగా మిగిలింది. రెవెన్యూ లోటు, తక్కువ ఆదాయంతో కష్టాలు మరింత పెరిగాయి. అందెవల్ల కేంద్రం రాష్ట్రాన్ని ఆదుకోవాలి. విభజన చట్టంలోని హామీలన్నీ కేంద్రం అమలు చేయాల్సి ఉంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది. భౌగోళిక ప్రదేశం ఆధారంగా ఇరు రాష్ట్రాలకు ఆస్తులు పంచితే.. అప్పులు మాత్రం జనాభా ఆధారంగా పంచారు. కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్, విశాఖ చెన్నై పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు కావాలి. వెనకబడిన జిల్లాలకు ఆర్థిక సాయం, 9,10 షెడ్యూల్ సంస్థలను విభజించాల్సి ఉంది.విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో రైలు, రోడ్డు అనుసంధానం కావాల్సి ఉంది.అమరావతికి ఆర్థిక సహాయం,జాతీయ ప్రాముఖ్యతగల సంస్థలు ఏర్పాటు కా వాలి. అసెంబ్లీ సీట్ల పెంపు, పన్ను విధింపు విషయాల్లో తేడాలను పరిష్కరించాలి. ఐదు కోట్ల ప్రజల రాష్ట్రంగా విభజన కష్టాలను అధిగమించాలంటే కేంద్ర సాయంఅనివార్యం.

అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా..

రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా చేయగలిగాం. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకుని ముందుకెళ్తోంది. సహజసిద్ధ వనరులు, తీరప్రాంతం, అధిక నైపుణ్యం కలిగిన సిబ్బంది సహకారంతో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రభాగంలో నిలుపుతాం. అభివృద్ధి ఫలాలు చిట్టచివరి వ్యక్తికి చేరేవరకు నిర్విరామంగా కృషి చేస్తున్నాం. ప్రభుత్వం ఏర్పడ్డాక శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసు వ్యవస్థ ఆధునీకరణ చేశాం. వామపక్ష తీవ్రవాదాన్ని అదుపులోకి తెచ్చాం. రౌడీయిజాన్ని పూర్తిగా అణచివేశాం. పోలీసులు కనబడకుండా పోలీసింగ్ మాత్రమే కనబడేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నాం. ఎకో, హెరిటేజ్, బీచ్ టూరిజం విభాగాల్లో ఆధునిక సదుపాయాలతో కొత్త పర్యాటక ప్రాజెక్టులు ప్రారంభిస్తున్నాం. కియా మోటార్స్ కర్మాగారం అనంతపురం జిల్లాకు ఒక గేమ్ ఛేంజర్‌గా నిలిచింది. ఆటోమొబైల్ కేంద్రంగా అనంతపురం అభివృద్ధి చెందుతోంది. చిత్తూరు జిల్లాలోని తిరుపతి ఎలక్ట్రానిక్ హబ్‌గా మారుతోంది. ఔషధ, ఏరోస్పేస్, డిఫెన్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తుల హబ్‌గా విశాఖ, జౌళి, ఆహార శుద్ధి కేంద్రాలుగా, కృష్ణా, గుంటూరు అభివృద్ధి చెందుతున్నాయి. కర్నూలులో ఒక అల్ట్రా మెగా ఫుడ్‌పార్క్ ఏర్పాటు కాబోతోంది. వృద్ధి గమనాన్ని సుస్థిరపరచడమే మా ప్రభుత్వ లక్ష్యం.

ఉపాధి కల్పనే లక్ష్యంగా..

యువతకు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోంది. ప్రైవేటు రంగంలో పెద్దెయెత్తున ఉపాధిని ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేస్తోంది. 2019లో 10లక్షల మందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిచనున్నాం.2018లో చమురు, సహజ వాయువు అన్వేషణలో ప్రభుత్వం పెట్టబడులు ఆశిస్తోంది. విజయవాడ, విశాఖ, తిరుపతి విమానాశ్రయాలు ప్రయాణికుల రద్దీ విషయంలో దేశంలోనే అధికవృద్ధి నమోదు చేసున్నాయి. భోగాపురం, ఓర్వకల్లు, దగదర్తి, దోనకొండ కొత్త విమానాశ్రయాల పనులు పురోగతిలో ఉన్నాయి. ప్రపంచంలోనే మొట్టమొదటి గ్రీన్‌ఫీల్ స్మార్ట్ సిటీగా అమరావతి నిర్మాణం కాబోతోంది. అమరావతి ఒక పరిపాలన రాజధాని మాత్రమే కాదు, అంతర్జాతీయ కేంద్రంగా భావిస్తున్నాం. 2018లో సింగపూర్ కన్సార్టియం ద్వారా స్టార్టప్ ఏరియా మాస్టర్ డెవలప్‌మెంట్ ప్రారంభం కానుంది.

17రోజులు జరగనున్న ఎపి అసెంబ్లీ

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలు 17రోజుల పాటు జరగనున్నాయి. గవర్నర్ ప్రసంగం అనంతరం సభ వాయిదా పడ్డాక సభాపతి కోడెల అధ్యక్షతన బీఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈ నెల 28 వరకూ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. దీంతో మొత్తం 17 రోజుల పాటు అసెంబ్లీ జరగనుంది. ఈ నెల 9,10,11,17,18,24,25 తేదీల్లో సభకు సెలవులుగా నిర్ణయించారు. రేపు, ఎల్లుండి గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తీర్మానంపై చర్చ జరుగనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 8న 11.30కు సభలో బడ్జెట్ ప్రవేశపెట్టనుంది.9,10,11 తేదీల్లో అసెంబ్లీకి సెలవులు.12 నుంచి 15 వరకూ బడ్జెట్‌పై చర్చ జరిపేందుకు నిర్ణయించారు.16 నుంచి 27 వరకూ శాఖల వారీగా కేటాయింపులపై చర్చ చేపట్టనున్నారు.



క్షయ వ్యాధి నిర్మూలన అందరి బాధ్యత : మిథాలిరాజ్



మన తెలంగాణ / హైదరాబాద్ : క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఇది అనేది నివారించగలిగే వ్యాధేనని భారత మహిళా క్రికెట్ జట్టు సారధి మిథాలిరాజ్ అన్నారు. ఇండియన్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 13 భాషల్లో రూపొందించిన వ్యాధి నిర్మూలన క్యాలెండర్, పోస్టర్‌లను ఆమె సోమవారం ఆవిష్కరించారు. వ్యాధి లక్షణాలతో పాటు అవగాహన, చైతన్య కార్యక్రమాలపై తీసుకోవాల్సిన చర్యల గురించి వీటిలో సంస్థ వివరించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఇండియా గెలుస్తుంది.. టీబీ ఓడిపోతుంది' అనే నినాదంతో ఈ ఏడాది క్షయవ్యాధి నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ వంతు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ నారాయణ అయ్యర్ మాట్లాడుతూ ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం ప్రతి ఏడాది మార్చి 24న జరుగుతుందని తెలిపారు. ఈ దినోత్సవం పురస్కరించుకొని ముందుగానే పోస్టర్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ ఏడాది తమ ఫౌండేషన్‌కు మిథాలి రాజ్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించామన్నారు. టీబీ వ్యాధి నివారణకు అవగాహనే అసలైన మందన్నారు. దేశంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

సీనియర్లు లేకున్నా..

ఫేవరెట్‌గా భారత్, గెలుపు కోసం లంక, నేడు ముక్కోణపు టి-20 తొలి సమరం

జట్ల వివరాలు:

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), శిఖర్ ధావన్ (వైస్ కెప్టెన్), లోకేష్ రాహుల్, సురేశ్ రైనా, మనీష్ పాండే, దినేష్ కార్తీక్, దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, చాహల్, అక్షర్ పటేల్, విజయ్ శంకర్, శార్దూల్ ఠాకూర్, జైదేవ్ ఉనద్కట్, మహ్మద్ సిరాజ్, రిషబ్ పంత్,

శ్రీలంక: దినేష్ చండీమల్ (కెప్టెన్), ఉపుల్ తరంగ, దనుష్క గుణతిలక, కుశాల్ మెండిస్, దాసున్ శనక, కుశాల్ పెరీరా, జీవన్ మెండిస్, సురంగ లక్మల్, ఇసురు ఉడనా, అకిల ధనంజయ, అమిలా అపోన్సొ, నువాన్ ప్రదీప్, దుష్మంత చమీరా, ధనంజయ డిసిల్వా, తిసారా పెరీరా.

కొలంబో: సీనియర్లు లేకున్నా శ్రీలంకలో జరుగుతున్న ముక్కోణపు టోర్నమెంట్‌లో భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. శ్రీలంక వేదికగా మూడు దేశాల ట్వంటీ–20 క్రికెట్ టోర్నమెంట్‌కు మంగళవారం తెరలేవనుంది. భారత్‌తో పాటు ఆతిథ్య శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు టోర్నీలో పోటీ పడనున్నాయి. అన్ని మ్యాచ్‌లు కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో జరుగుతాయి. 18న ఫైనల్ సమరం జరగనుంది. కాగా, మంగళవారం జరిగే మొదటి మ్యాచ్‌లో భారత్ ఆతిథ్య లంక జట్టుతో తలపడనుంది. సీనియర్ ఆటగాళ్లు లేకుండానే టోర్నీలో ఆడుతున్న భారత్‌కే గెలుపు అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. రెగ్యూలర్ కెప్టెన్ విరాట్ కోహ్లి, మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని, సీనియర్ బౌలర్లు భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రిత్ బుమ్రాలు లేకుండానే భారత్ టోర్నీకి సిద్ధమైంది. అంతేగాక, యువ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యలకు కూడా విశ్రాంతి ఇచ్చారు. ఇలా ఆరుగురు కీలక ఆటగాళ్లు లేకుండానే భారత్ సమరానికి సిద్ధమైంది. అయితే వీరు లేకున్నా భారత్ చాలా మెరుగ్గా కనిపిస్తోంది. కెప్టెన్ రోహిత్ శర్మ, వైస్ కెప్టెన్ శిఖర్ ధావన్, సీనియర్లు సురేశ్ రైనా, దినేష్ కార్తీక్‌లతో భారత్ చాలా బలంగా కనిపిస్తోంది. అంతేగాక మనీష్ పాండే, లోకేష్ రాహుల్, రిషబ్ పంత్ వంటి ట్వంటీ–20 స్పెషలిస్ట్‌లు ఉండనే ఉన్నారు. దీంతో భారత్ భారీ ఆశలతో తొలి పోరుకు సిద్ధమైంది. మరోవైపు ఆతిథ్య శ్రీలంకకు ఈ మ్యాచ్ చాలా కీలకంగా మారింది. ఇటీవల కాలంలో భారత్ చేతిలో వరుస పరాజయాలు చవిచూస్తున్న లంకకు ఈ మ్యాచ్ సవాలుగా తయారైంది. భారత్ చేతిలో ఎదురవుతున్న ఓటములకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో లంక కనిపిస్తోంది. అయితే స్టార్ ఆటగాడు, కెప్టెన్ ఎంజిలో మాథ్యూస్ దూరం కావడం లంకకు పెద్ద లోటుగా చెప్పవచ్చు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన మాథ్యూస్ ఉంటే జట్టు మరింత బలంగా ఉండేదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే సొంతగడ్డపై జరుగుతున్న పోరు కావడంతో లంకను తక్కువ వేయడం పొరపాటే అవుతుంది. రెండు జట్లు కూడా విజయమే లక్ష్యంగా పెట్టుకోవడంతో పోరు నువ్వానేనా అన్నట్టు సాగడం ఖాయం.



అందరి దృష్టి రోహిత్‌పైనే...

ఈ మ్యాచ్‌లో అందరి దృష్టి టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మపైనే నిలిచింది. దక్షిణాఫ్రికా సిరీస్‌లో ఘోరంగా విఫలమైన రోహిత్ శర్మకు ముక్కోణపు టోర్నీ ప్రతిష్టాత్మకంగా మారింది. ఇందులో రాణించడం ద్వారా విమర్శకులకు గట్టి జవాబివ్వాలనే లక్ష్యంతో ఉన్నాడు. అంతేగాక ఉపఖండం పిచ్‌లపై మెరుగైన రికార్డు కలిగిన రోహిత్ సత్తా చాటే అవకాశాలను కొట్టిపారేయలేం. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే సత్తా రోహిత్‌కు ఉంది. తనదైన రోజు ఎంతటి బౌలింగ్‌నైనా చిన్నాభిన్నం చేసే సత్తా ఒక్క రోహిత్‌కే సొంతం. దీంతో ఈ మ్యాచ్‌లో అతను చెలరేగుతాడనే నమ్మకంతో అభిమానులు ఉన్నారు. మరోవైపు శిఖర్ ధావన్ భీకర ఫాంలో ఉండడం జట్టుకు కలిసి వచ్చే అంశం. దక్షిణాఫ్రికా సిరీస్‌లో అద్భుత బ్యాటింగ్‌తో అదరగొట్టిన ధావన్ లంకలోనూ అదే జోరును కొనసాగించేందుకు తహతహలాడుతున్నాడు. అతను విజృంభిస్తే భారీ స్కోరు చేయడం భారత్‌కు కష్టమేమి కాదు.

బౌలర్లకు పరీక్ష!

కాగా, ఈ సిరీస్ భారత బౌలర్లకు పరీక్షగా మారింది. కీలక బౌలర్లు భువనేశ్వర్, బుమ్రా, కుల్దీప్, హార్దిక్, మహ్మద్ షమి తదితరులు లేకుండానే భారత్ పోరుకు సిద్ధమైంది. దీంతో యువ బౌలర్లు శార్దూల్ ఠాకూర్, జైదేవ్ ఉనద్కట్, సిరాజ్, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ తదితరులకు ఇది పరీక్షా సమయంగా చెప్పాలి. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జట్టులో స్థానాన్ని కాపాడుకోవడానికి వీరికి ఇంతకు మించిన ఛాన్స్ మరొకటి ఉండదనే చెప్పవచ్చు. వీరంతా ఎలా రాణిస్తారనే దానిపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. ఇక, ఈ టోర్నీలో భారత్ ఆశలన్నీ ఏస్ బౌలర్ యజువేంద్ర చాహల్‌పైనే ఆధారపడి ఉన్నాయి. టి–20లో మెరుగైన బౌలర్‌గా పేరు తెచ్చుకున్న చాహల్‌కు ఉపఖండంలో మంచి రికార్డే ఉంది. దక్షిణాఫ్రికాతో జరిగిన టి–20 సిరీస్‌లో విఫలమైన చాహల్ ఈ టోర్నీ ద్వారా మళ్లీ గాడిలో పడాలని భావిస్తున్నాడు. ఇదే జరిగితే లంక బ్యాట్స్‌మెన్‌కు కష్టాలు ఖాయం.



రాత్రి 7 గంటల నుంచి డిడి స్పోర్ట్స్, డిడి నేషనల్‌లలో ప్రత్యక్షప్రసారం

రైనాపై కీలక బాధ్యతలు..

మరోవైపు కోహ్లి, ధోనిలు లేకుండా బరిలోకి దిగుతున్న భారత్‌కు సీనియర్ ఆటగాడు సురేశ్ రైనా కీలకంగా మారాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన టి–20 సిరీస్‌లో రైనా అంచనాలకు మించి రాణించిన విషయం తెలిసిందే. ఈసారి కూడా జట్టు అతనిపై భారీ ఆశలు పెట్టుకుంది. జట్టును ఆదుకునే బాధ్యత రైనాపై నెలకొంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన రైనా విజృంభిస్తే అడ్డుకోవడం లంక బౌలర్లకు శక్తికి మించిన పనిగానే చెప్పాలి. ఇక, లోకేష్ రాహుల్, మనీష్ పాండే, దినేష్ కార్తీక్‌లతో భారత బ్యాటింగ్ చాలా బలంగా ఉంది. రిషబ్ పంత్, విజయ్ శంకర్ వంటి టి–20 స్పెషలిస్ట్‌లు కూడా సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నారు. దక్షిణాఫ్రికా మనీష్ పాండే నిలకడైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. దీంతో ఈసారి కూడా జట్టుకు కీలకంగా మారాడు. దినేష్ కార్తీక్ కూడా మెరుగైన ఆటగాడే. రాహుల్ కూడా అవకాశం లభిస్తే చెలరేగేందుకు సిద్ధమయ్యాడు.



భారీ ఆశలతో లంక...

ఇదిలావుండగా ఆతిథ్య శ్రీలంక జట్టు భారీ ఆశలతో టోర్నమెంట్‌కు సిద్ధమైంది. ఇటీవల బంగ్లాదేశ్‌లో జరిగిన సిరీస్‌లో లంక నిలకడైన విజయాలు సాధించింది. దీంతో జట్టు ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యింది. దీనికి తోడు సీనియర్లు లేకుండా బరిలోకి దిగుతున్న భారత్‌ను ఓడించేందుకు మంచి ఛాన్స్ దొరికింది. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు లంక తహతహలాడుతోంది. అయితే కెప్టెన్ మాథ్యూస్ దూరం కావడం ఒక్కటే జట్టుకు లోటుగా చెప్పాలి. కానీ, ఉపుల్ తరంగ, చండీమల్, గుణతిలక, కుశాల్ మెండిస, కుశాల్ పెరీరా, తిసారా పెరీరా, సురంగ లక్మల్‌లతో లంక చాలా బలంగా కనిపిస్తోంది. అంతేగాక సొంత గడ్డపై పోటీలు జరుగుతుండడంతో గెలిచే అవకాశాలు కూడా అధికంగా కనిపిస్తున్నాయి. కాగా, నిలకడలేమి జట్టుకు ప్రధాన అవరోధంగా మారింది. ఎప్పుడూ ఎలా ఆడుతారో అంతు బట్టకుండా తయారైంది. ఉపుల్ తరంగ కొంత కాలంగా ఘోర వైఫల్యం చవిచూస్తున్నాడు. కనీసం ఈ టోర్నమెంట్‌లోనైనా అతను తన బ్యాట్‌కు పని చెప్పాల్సిన అవసరం ఉంది. అంతేగాక కెప్టెన్ చండీమల్, కుశాల్ పెరీరా, గుణతిలక, ధనంజయ డిసిల్వా తదితరులు కూడా సత్తా చాటక తప్పదు. బౌలింగ్‌లో నువాన్ ప్రదీప్, లక్మల్, అకిల ధనంజయ, దాసున్ శనకలపై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. దీంతోపాటు సమష్టిగా రాణించాల్సిన అవసరం కూడా ఎంతైన ఉంది. అప్పుడే భారత్‌కు గట్టి పోటీ ఇచ్చే అవకాశాలు ఉంటాయి.



భారత మహిళల శుభారంభం

దక్షిణ కొరియాతో హాకీ సిరీస్

సియోల్: దక్షిణ కొరియాతో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత మహిళా హాకీ జట్టు విజయం సాధించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా సోమవారం ఇక్కడి నేషనల్ సెంటర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో భారత్ 1–0 గోల్స్ తేడాతో ఆతిథ్య దక్షిణ కొరియాను ఓడించింది. ఈ విజయంతో సిరీస్‌లో భారత్ 1–0 ఆధిక్యాన్ని అందుకుంది. ఆట ప్రారంభం నుంచే భారత్ దూకుడుగా ఆడింది. ఐదో నిమిషంలో లారెమ్‌సియామి భారత్‌కు తొలి గోల్‌ను అందించింది. అద్భుత ఆటను కనబరిచిన సియామి కళ్లు చెదిరే గోల్‌తో భారత్‌కు గోల్‌ను సాధించి పెట్టింది. తర్వాత కూడా భారత్ దూకుడుగా ఆడుతూ లక్ష్యాన్ని మరింత పెంచుకునేందుకు ప్రయత్నించింది. కానీ, కొరియా పటిష్టమైన డిఫెన్స్‌తో భారత్ దాడులను తిప్పికొట్టింది. ఇరు జట్లు కూడా గోల్ కోసం తీవ్రంగా పోరాడాయి. అయితే రెండు జట్లు కూడా మరో గోల్ నమోదు చేయడంలో విఫలమయ్యాయి. కాగా, చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకోవడంలో సఫలమైన భారత్ విజయాన్ని అందుకుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో తలపడేందుకు భారత్ కొరియాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే.





ఆస్ట్రేలియా ఘన విజయం

దర్బన్: దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియా 118 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. సోమవారం చివరి రోజు విజయం కోసం అవసరమైన ఏకైక వికెట్‌ను పడగొట్టి కంగారూలు విజయాన్ని అందుకున్నారు. ఈ గెలుపుతో నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0 ఆధిక్యాన్ని అందుకుంది. సోమవారం ఆఖరి రోజు 293/9 ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్ చేపట్టిన సౌతాఫ్రికా మరో ఐదు పరుగులు జోడించి ఆలౌటైంది. డికాక్ (83) చివరి వికెట్ రూపంలో పెవిలియన్ చేరాడు. దీంతో సఫారీ జట్టు 298 పరుగులకు ఆలౌటైంది. నాలుగో రోజే ఆస్ట్రేలియా విజయం దాదాపు ఖరారై పోయింది. ఊహించినట్టే చివరి ఆట ప్రారంభంలోనే ఆస్ట్రేలియా మిగిలిన లాంఛనాన్ని పూర్తి చేసి ఘన విజయం సాధించింది. 417 పరుగుల క్లిష్టమైన లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన దక్షిణాఫ్రికాను మార్‌క్రామ్ అద్భుత సెంచరీతో ఆదుకున్నాడు. మరోవైపు వికెట్ కీపర్ డికాక్ కూడా 83 పరుగులు చేసి జట్టుకు అండగా నిలిచాడు. వీరిద్దరూ వీరోచిత పోరాటం చేయడంతో దక్షిణాఫ్రికా మెరుగైన స్కోరును సాధించి పరువును నిలుపుకొంది. కాగా, ఆస్ట్రేలియా బౌలర్లలో మిఛెల్ స్టార్క్ మ్యాచ్‌లో తొమ్మిది వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అతనికి మ్యాచ్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు, రెండో ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లను స్టార్క్ పడగొట్టాడు. హాజిల్‌వుడ్‌కు మూడు వికెట్లు లభించాయి. కాగా, ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 351, రెండో ఇన్నింగ్స్‌లో 227 పరుగులు చేసింది. మరోవైపు దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్‌లో 162 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యాన్ని సాధించి మ్యాచ్‌పై పట్టు బిగించింది.



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ స్టార్క్ (9 వికెట్లు)

అలా అనుకుంటే పొరపాటే: రహానె



న్యూఢిల్లీ: తనకు దూకుడుగా ఆడడం రాదని ఎవరైన భావిస్తే అది పొరపాటే అవుతుందని టీమిండియా స్టార్ ఆటగాడు అజింక్య రహానె అన్నాడు. ఇతర క్రికెటర్లతో పోల్చితే తన స్వభావం కాస్త భిన్నమైందని, తాను కామ్‌గా ఉండేందుకు ఇష్టపడుతానని తెలిపాడు. అంత మాత్రాన తాను దూకుడుగా బ్యాటింగ్ చేయలేనని భావించడం మంచిది కాదన్నాడు. సందర్భోచితంగా బ్యాటింగ్ చేయడం తనకు ఇష్టమని, దూకుడుగా ఆడాల్సిన సమయంలో ధాటిగా బ్యాటింగ్ చేసేందుకు వెనుకాడనని స్పష్టం చేశాడు. గతంలో పలు వన్డేల్లో తాను ఆడిన ఇన్నింగ్స్‌లే దీనికి నిదర్శనమన్నాడు. కాగా, ఐపిఎల్‌లో మళ్లీ సొంత జట్టు రాజస్థాన్ రాయల్స్‌కు ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందన్నాడు. రాజస్థాన్‌కు ఆడడం తనకు ఎంతో ఇష్టమన్నాడు. మళ్లీ తన జట్టు తరపున ఆడనుండడం కొత్త అనుభూతిని ఇస్తుందన్నాడు. కాగా, తనకు డబ్బు కంటే ఆటే ప్రధానమన్నాడు. డబ్బుల కోసం ఆశపడే వ్యక్తులతో తనను పోల్చోద్దన్నాడు. భారత్ తరపున తాను ఆడుతున్నానంటే దానికి ప్రతిభే కారణమన్నాడు. తాను ఎప్పుడూ ఆటనే నమ్ముకుంటానని, ఒత్తిడిలోనూ నిలకడగా ఆడేందుకు ప్రయత్నిస్తానని తెలిపాడు. ఓ వార్త సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రహానె ఈ విషయాలు వెల్లడించాడు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.